ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 16-3-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 215 రూ. 5-00 పేజీలు 24+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



❛ సాగునీటి ప్రాజెక్టులు, పంటల పెట్టుబడి మద్దతు పథకం, విద్యుత్ సబ్సిడీలకు ఎక్కువ నిధులు సమకూర్చడం వల్ల వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకుసాగుతాయి.

\- కేసీఆర్



❛ అనేక ప్రతికూలతలు, అస్పష్టతలు, అనుమానాలు, సవాళ్ల మధ్య ఏర్పడిన నూతన రాష్ట్రం అనతి కాలంలోనే అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచే స్థాయికి వెళ్లింది.

\- ఈటల రాజేందర్

లక్షకోట్లు దాటిన ప్రగతిపద్దు

- 22% పెరిగిన సొంత రాబడులు
- జీఎస్టీ... నోట్లరద్దు దెబ్బతీసినా కోలుకున్న వైనం
- రెవెన్యూ మిగులు రాష్ట్రమే
- గత బడ్జెట్ అంచనాలకంటే 16.9 శాతం పెరుగుదల

అన్నదాతకు వెన్నుదన్ను.. బడుగు బలహీనులకు భరోసా...

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇదే ఈ ఏటి తెలంగాణ ప్రభుత్వ పద్దు సారాంశం!

'అపనమ్మకం నుంచి ఆత్మవిశ్వాసంలోకి, అణగారిన స్థితిలోంచి అభ్యున్నతిలోకి.. వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతిలోకి'.. అంటూ ఆరంభమైన ఈటల బడ్జెట్.. సూటిగా ప్రజల అవసరాలనే తాకింది. తెలంగాణ పల్లె గడ్డ మీద జీవజలం పరవళ్లు తొక్కేలా.. రైతు ఇంట పచ్చదనం ప్రభవించేలా చూడటమే లక్ష్యంగా వ్యవసాయం, సాగునీటి రంగాలకు భారీగా కేటాయింపులు చేసింది. మరోవైపు మైనారిటీలకూ కొండంత అండగా నిలిచింది. మిగతా సంక్షేమ రంగాలకు ఏ లోటూ లేనంతగా పట్టం కట్టింది. రైతన్నకు పెట్టుబడిసాయం చేసే 'రైతు లక్ష్మి' పథకానికి రూ.12 వేల కోట్లను ప్రకటించింది. ప్రాధాన్య పథకాలుగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాకతీయ, రెండు పడక గదుల ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్.. తదితరాలన్నింటికీ సముచితంగా కేటాయించింది.

సలామ్ రైతన్న


కేటాయింపులు (రూ. కోట్లలో)


- సాగునీటి రంగానికి 25,000
- రైతు లక్ష్మికి 12,000
- రైతు బీమాకు 500
- మైనార్టీలకు 2,000
- సంక్షేమ రంగానికి: 28,692

రాష్ట్ర బడ్జెట్ 2018-19 (రూ. కోట్లలో)	
1,74,453.84	నిర్వహణ పద్దు: 69,695.94
	ప్రగతి పద్దు: 1,04,757.90

బడ్జెట్ కథనాలు 2, 16, 17, 18, 19, 20, 21 పేజీల్లో









ఎన్డీయేకు రాంరాం

- తెదేపా నిర్ణయం
- వైకాపా అవిశ్వాసానికి మద్దతు
- రాష్ట్రం కోసం ఎవరు పోరాడినా సహకరిస్తాం
- లాలూచీ రాజకీయాలను ఎండగడతాం
- నేను కేంద్రంపై పోరాడుతుంటే ఈ కుట్రలేంటి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం
- అందరి బండారం బయట పెడతానని వెల్లడి -7లో

పవన్ వెనుక పెద్దలు

-7లో

- తెదేపాను తీవ్రంగా దెబ్బతీసేందుకు కుట్ర
- 40 ఏళ్ల రాజకీయజీవితంలో ఎన్నో సంక్షోభాలు చూశా
- మోదీని వదిలేసి.. నాపై విమర్శలా!?
- నన్ను బలహీనపరిస్తే పవన్‌కళ్యాణ్‌కు వచ్చే లాభమేంటి
- కేసుల మాఫీకి దిల్లీలో వైకాపా రహస్య ఒప్పందాలు
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కేంద్రంపై వైకాపా అవిశ్వాసం


- లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు సమర్పించిన ఎంపీ వైవీ -6లో

బహిష్కరణపై కోర్టుకెక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయండి
- ఎన్నికలు నిర్వహించకుండా ఈసీని ఆదేశించండి
- ఉమ్మడి హైకోర్టులో కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ పిటిషన్ -6లో

గ్రాట్యుటీ రెట్టింపు

బిల్లుకు లోక్‌సభ ఆమోదం -2లో



మా బడ్జెట్ ప్రగతి, సంక్షేమానికి దిక్సూచి

ఈనాడు, హైదరాబాద్: కొత్త ఆర్థిక సంవత్సరానికి తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమ రంగాలకు దిక్సూచిగా నిలిచిందని, రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడేదిగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం సీఎం మంత్రులు, అధికారులతో తమ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పూర్తి సమతుల్యతతో, రాష్ట్ర ఆదాయ వనరులను, తెలంగాణ రాష్ట్రానికున్న అవసరాలు, ప్రభుత్వ లక్ష్యాలకు మధ్య పూర్తి సమన్వయంతో బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. ఎక్కువ శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులను ప్రతిపాదించడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. సాగునీటి ప్రాజెక్టులు, పంటల పెట్టుబడి మద్దతు పథకం, విద్యుత్ సబ్సిడీలకు ఎక్కువ నిధులు సమకూర్చడం వల్ల వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకుసాగుతాయన్నారు. అభివృద్ధి ప్రణాళికలను సమర్థంగా అమలు చేసే విధంగా వార్షిక ఆర్థిక ప్రణాళికను రూపొందించారని ఆయన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ సలహాదారు జీఆర్‌రెడ్డిలను సీఎం అభినందించారు.

సీఎంకు కృతజ్ఞతలు

కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్‌ను కలిసి బడ్జెట్‌లో పలు శాఖలు, పథకాలు, కార్యక్రమాలకు నిధుల పెంపుపై కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఈటలకు ఎమ్మెల్యేలు అభినందనలు చెప్పారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తల అభివృద్ధిసంఘం అధ్యక్షురాలు డీవీవీ శ్రీలక్ష్మివాణి, ఆప్కో మాజీ ఛైర్మన్ మండల శ్రీరాములు తదితరులుపరిశ్రమలు, జౌళి శాఖలకు బడ్జెట్ పెంపుదలపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రిలా అండగా ఉండే ప్రభుత్వమిది: ఈటల

ప్రభుత్వం ఒక తండ్రిలా ఉండి అండగా ఉంటుందనే విశ్వాసాన్ని రాష్ట్ర ప్రజల్లో కలిగించామని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో మాకు న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఎన్నికల కోసం, ఓట్ల కోసం కాకుండా అన్నిరంగాల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. కులం, మతాలకతీతంగా అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వాస్తవిక అంచనాలతో బడ్జెట్ ప్రవేశపెట్టామని తెలిపారు. గురువారం శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థికమంత్రి అసెంబ్లీ కమిటీహాల్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక, ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థికశాఖ కార్యదర్శి శివశంకర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. దేశానికే ఆదర్శవంతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు.

సలాం రైతన్న

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేస్తూ.. మౌలిక వసతులు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పద్దులను ఆవిష్కరించింది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, వాటికి తోడుగా నిలిచే సాగునీరు, విద్యుత్ రంగాలకు రాష్ట్ర బడ్జెట్‌లో 26 శాతం నిధులు దక్కాయి. ఏటా రెండు పంటలు పండించే రైతులకు ఎకరాకు ఎనిమిది వేల రూపాయలు చొప్పున పెట్టుబడి ప్రోత్సాహం అందించడానికి వీలుగా కేటాయింపులు చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరం వరకూ రూ.17,000 కోట్ల రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం వ్యవసాయ పునరుజ్జీవం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు పెట్టుబడి ప్రోత్సాహం పేరిట మలి అడుగు వేసింది. వ్యవసాయరంగానికి గతంలో ఎన్నడూలేనంతగా కేటాయింపులు దక్కాయి. గత బడ్జెట్‌కంటే ఒకటిన్నర రెట్లు పెంచుతూ రూ.12,601 కోట్లను కేటాయించింది. సాగునీటి రంగానికి బడ్జెట్ వెలుపల నిధులతో నిమిత్తం లేకుండా బడ్జెట్‌లో రూ.25 వేలకోట్లు ఇచ్చింది. విద్యుత్ రంగానికి రూ.4,393 కోట్లను ప్రతిపాదించింది. రైతు కుటుంబాలకు విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచేందుకు రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పిస్తూ రైతు బీమా పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కోసం రూ.500 కోట్లను కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522 కోట్లను కేటాయించిది. రైతులకు వడ్డీలేని రుణాల కోసం రూ.500 కోట్లను ప్రతిపాదించింది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలాలను వచ్చే ఏడాది అందించేలా దృష్టి సారించింది. రైతులకు గిట్టుబాటు ధర, కనీస మద్దతు ధర లక్ష్యంగా రైతు సమన్వయ సమితిలు పనిచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ అనుబంధరంగాలపై ఆధారపడిన వారికి గొర్రెల పంపిణీ ద్వారా అండగా నిలిచిన ప్రభుత్వం చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చేలా కేటాయింపులను పెంచింది.

సంక్షేమానికి పెద్దపీట

సంక్షేమ రంగానికి ఈ బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. గ్రామీణాభివృద్ధికి అండగా నిలిచింది. వైద్య ఆరోగ్య రంగానికి రూ.1,400 కోట్ల మేర నిధులను పెంచగా, విద్యారంగానికి నామమాత్రంగానే కేటాయింపులు పెరిగాయి. సీఎం విచక్షణ మేరకు ఖర్చు చేసే ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.3000 కోట్లను కేటాయించింది. 2019 ఎన్నికలకు ముందు తెరాస ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచేందుకు ప్రాధాన్యమిచ్చింది. పట్టణాభివృద్ధికి నిధులను పెంచిన ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయాలను రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా మారుస్తూ రిజిస్ట్రేషన్ బాధ్యతను తహసీల్దార్లకే అప్పగించనున్నట్లు స్పష్టం చేసింది. పంచాయతీరాజ్ సంస్థలకు నిధులను పెంచింది. రాష్ట్ర ఆర్థిక సంఘానికి రూ.2,500 కోట్లు కేటాయించడం ద్వారా పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు తోడ్పాటు ఇవ్వనుంది. ఆసరా పింఛన్ల ద్వారా 41.78 లక్షల మందికి సాయం అందిస్తున్న ప్రభుత్వం బోదకాలుతో బాధపడేవారికి నెలకు రూ.1000 జీవనభృతికి కేటాయింపులు చేసింది.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు నిధుల పెంపు

బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు అధిక ప్రాధాన్యమిస్తూ రూ.1,450 కోట్లు ప్రతిపాదించింది. దళితులకు మూడెకరాల భూమికి నిధులు కేటాయించింది. అత్యంత వెనుకబడిన వర్గాలకు, మైనార్టీ సంక్షేమానికి నిధులు పెంచింది. రెండు దశాబ్దాల నుంచి నాలుగు దశాబ్దాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు ఆవిష్కరించింది. మిగిలిన ఉద్యోగాల భర్తీని వేగవంతం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. యాదాద్రి, వేములవాడతో బాటు భద్రాద్రి, బాసర, ధర్మపురి ఆలయాలకు ప్రత్యేక నిధులిచ్చింది. కోట్లమంది ప్రజల రవాణాకు ఊతంగా ఉన్న ఆర్టీసీకి రూ.975 కోట్లను ఇవ్వనున్నట్లు పేర్కొంది.

మెరుగైన వృద్ధిరేటుతో ముందుకు..

2017-18 బడ్జెట్ అంచనాలకంటే 16.9 శాతం పెరుగుదలతో తాజా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రూ.1,74,453 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పటిష్ఠంగా ఉందని, మెరుగైన వృద్ధిరేటుతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర సొంత రాబడులు 22.84 శాతం మేర పెరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నోట్లరద్దు, జీఎస్టీ నేపథ్యం వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా రాష్ట్ర రాబడులు పెరిగాయి. వస్తు,సేవల పన్ను (జీఎస్టీ) అమలు నేపథ్యంలో రాష్ట్ర రాబడిపై ప్రభావం పడినా చివరి నెలల్లో కోలుకోవడంతో మెరుగైన ఆర్థిక స్థితితో పాటు ఆర్థిక వృద్ధిరేటు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే గ్రాంటులను రూ.29 వేలుగా అంచనా వేసింది. రాష్ట్ర సొంత రాబడులు రూ.73,751 కోట్లు, కేంద్ర పన్నుల వాటా రూ.19,207 కోట్లుగా పేర్కొంది. ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల రాబడి అంచనాలు గతంలో కంటే పెరిగాయి. ద్రవ్యలోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.45 శాతంగా ప్రభుత్వం పేర్కొంది.

భూముల అమ్మకం ద్వారా రూ.3,000 కోట్లు

భూములు అమ్మకం ద్వారా రూ.3,000 కోట్లను సమకూర్చుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గత బడ్జెట్‌లో భూముల అమ్మకానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన లేదు. 2016-17లో మాత్రం భూముల అమ్మకం ద్వారా రూ.1,776 కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. నాలుగేళ్లలో జీఎస్డీపీలో అప్పుల శాతం నాలుగు శాతంపైగా పెరిగింది. తాజాగా జీఎస్డీపీలో అప్పుల శాతం 21.39కి చేరుకుంది



బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ముందు ప్రతిని సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

పన్నురహిత గ్రాట్యుటీ రెట్టింపు!

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: గ్రాట్యుటీ చెల్లింపు (సవరణ) బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. దీనికింద ఉద్యోగులకు పన్నురహిత గ్రాట్యుటీని ప్రస్తుతమున్న రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెరుగుతుంది. దీనికితోడు భవిష్యత్‌లో గ్రాట్యుటీని పెంచడానికి, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుకాలాన్ని నిర్ధరించడానికి ప్రభుత్వం చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉండదు. ఎప్పటికప్పుడు కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేయడం ద్వారా వీటిని పెంచుకునే హక్కు సర్కారుకు లభిస్తుంది. తాజా బిల్లుకు ఇంకా రాజ్యసభ ఆమోదం తెలపాల్సి ఉంది. ఏడో వేతన సంఘం సిఫార్సులను అమలు చేశాక.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీపై ఉన్న పరిమితి రూ.20లక్షలకు పెరిగింది. దీన్ని చట్టంలో చేర్చాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం వివిధ అంశాలపై పలువురు సభ్యులు చేస్తున్న ఆందోళనల మధ్యే లోక్‌సభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది.

ప్రస్తుతం సంఘటిత రంగంలో 10 మంది కన్నా ఎక్కువ మంది పనిచేసే సంస్థలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసిన ఉద్యోగులకు.. పదవీ విరమణ సమయంలో కానీ ఉద్యోగం మానేసినపుడు కానీ గరిష్ఠంగా రూ.10లక్షల వరకూ పన్నురహిత గ్రాట్యుటీని పొందే వీలుంది. బిల్లులో సవరణ అమల్లోకి వస్తే... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వీరికి కూడా ఈ పరిమితి రూ.20లక్షలకు పెరుగుతుంది. అవసరమనుకుంటే ప్రసూతి సెలవుపై కూడా నోటిఫికేషన్ జారీ చేసే అధికారం ప్రభుత్వానికి లభిస్తుంది. ఈ సెలవును నిరంతర సర్వీసుగానే పరిగణిస్తారు. ప్రస్తుతం గరిష్ఠ ప్రసూతి సెలవును 26 వారాలుగా నిర్ధరిస్తున్నట్లు ప్రసూతి లబ్ధి (సవరణ) చట్టం-2017 చెబుతోంది.

తెలంగాణ బడ్జెట్ సమగ్రస్వరూపం

2018–19 బడ్జెట్ అంచనాలు

	వివరం	రూ.కోట్లలో
1.	ప్రారంభ నిల్వ	311.90
2.	రెవెన్యూ వసూళ్లు	1,30,975.10
	ఎ. కేంద్ర పన్నుల్లో వాటా	19,207.43
	బి. పన్ను ఆదాయం	73,751.88
	సి. పన్నేతర ఆదాయం	8,973.92
	డి. గ్రాంట్లు	29,041.87
3.	మూలధన వసూళ్లు	43,507.17
	ఇ. బహిరంగ మార్కెట్ రుణాలు	31,500.00
	ఎఫ్. స్వల్పకాలిక రుణాలు	100.00
	జి. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు	800.00
	హెచ్. ఇతర రుణాలు	800.00
	ఐ. డిపాజిట్లు, లావాదేవీలు (నికరం)	2,500.00
	జే. రుణాలు, అడ్వాన్సులు	7,807.17
	కే. ఇతర వసూళ్లు	
	ఎల్. కంటింజెన్సీ నిధి	
4.	మొత్తం వసూళ్లు	1,74,482.28
5.	మొత్తం వ్యయం	1,74,453.83
	ఎం. రెవెన్యూ వయం	1,25,454.70
	ఎన్. ఇందులో వడ్డీ చెల్లింపులు	11,691.11
	ఓ. మూలధన వ్యయం	33,369.10
	పీ. రుణాలు, అడ్వాన్సులు	9,035.55
	క్యూ. ప్రభుత్వ రుణ చెల్లింపులు	6,594.48
6.	రెవెన్యూ మిగులు (2–ఎం)	5,520.40
7.	ద్రవ్యలోటు	–29,077.07

చీకటి నుంచి వెలుగులోకి..!

- 45 నెలల్లో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించాం
- జాతీయ సగటు కన్నా ఎక్కువగా తెలంగాణ జీఎస్‌డీపీ
- బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఈటల

ఈనాడు, హైదరాబాద్: "చీకటి నుంచి వెలుగులోకి.. అపనమ్మకం నుంచి ఆత్మవిశ్వాసంలోకి.. అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి.. వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజలను నడిపిస్తున్నాం. విధానాల రూపకల్పన, ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన గుణాత్మకమైన మార్పుతోనే ఈ విజయం సాధ్యమైంది. గత 45 నెలల స్వల్పకాలంలో ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తరవాత పరిస్థితి గమనిస్తే పురోగతి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. శాసనసభలో రాష్ట్ర బడ్జెట్‌ను వరసగా ఐదోసారి ఆయన గురువారం ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

"సమైక్య పాలనలో చివరి రెండేళ్లు (2012-14) తెలంగాణ ప్రాంత స్థూల జాతీయోత్పత్తి(జీఎస్‌డీపీ) వృద్ధి రేటు.. జాతీయ సగటుకన్నా తక్కువగా ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డాక ఇది మెరుగు పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు 6.6తో పోలిస్తే రాష్ట్ర వృద్ధి రేటు 10.4 శాతం ఉండటం ప్రశంసనీయం. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వల్ల కలిగిన ప్రారంభ ప్రతికూల పరిణామాలను అధిగమించి జీఎస్‌డీపీ వృద్ధి రేటులో జాతీయ ధోరణినీ తోసిరాజని రెండంకెల రేటును సాధించామని సగర్వంగా విన్నవిస్తున్నా. నూతన పారిశ్రామిక విధానం వల్ల పారిశ్రామిక వృద్ధి రేటు 7.6 శాతానికి చేరింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల వృద్ధి 6.9 శాతానికి చేరింది. వచ్చే ఏడాదీ సకాలంలో వానలు కురవాలని కోరుకుందాం.

పెరుగుతున్న తలసరి ఆదాయం..

రాష్ట్ర తలసరి ఆదాయం ఏటేటా మెరుగుపడుతోంది. ప్రస్తుత ధరల్లో ఇది రూ.1,75,534 ఉంటుందని అంచనా. గతేడాదితో పోలిస్తే 13.4 శాతం పెరిగింది. జాతీయ వృద్ధి రేటు 8.6 శాతంతో పోల్చితే ఇది చాలా ఎక్కువ. వనరులు, అవసరాలను సరిగా అంచనా వేసుకుని వాటికి అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగడంతోనే రాష్ట్రం ప్రగతిని సాధిస్తోంది.

వ్యవసాయానికి పునరుజ్జీవం..

వ్యవసాయానికి పునరుజ్జీవం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠ పరచాలని ప్రభుత్వం సంకల్పించింది. 35.29 లక్షల మంది రైతులకు రూ.16.124 కోట్ల రుణాలను మాఫీ చేశాం. పెట్టుబడి కోసం చేసిన అప్పు.. దానిమీద పడే మిత్తీ పులిమీద పుట్రలా ఒకదానికొకటితోడై రైతులను పూర్తిగా కుంగదీస్తున్నాయి. ఈ క్షోభ నుంచి వారిని కాపాడటానికి పంటకు అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వమే సమకూర్చాలని నిర్ణయించింది. రైతుల పక్షాల నిలిచి ఇంత గొప్ప నిర్ణయాన్ని స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ తీసుకోలేదు. ఈ విషయంలో తెలంగాణ.. దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. భూ రికార్డులను సమగ్ర సర్వే చేయించే మహత్తరమైన పనిని ప్రభుత్వం చేపట్టింది. రికార్డుల వివరాలన్నీ 'ధరణి' వెబ్‌సైట్‌లో త్వరలో ఆవిష్కరిస్తాం. భూముల రిజిస్ట్రేషన్లు సులభతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రైతు బీమా పథకం..

కుటుంబ పెద్ద అయిన రైతు మరణిస్తే ఒక్కసారిగా ఆ కుటుంబ పరిస్థితి తలకిందులవుతుంది. అనుకోని పరిస్థితుల్లో అటువంటి కష్టం వస్తే ఆ రైతు కుటుంబం రోడ్డున పడకూడదని ఆ కుటుంబానికి బాసటగా నిలవాలన్న సీఎం ఆశయం నుంచి రూపుదిద్దుకున్న పథకమే 'రైతు బీమా పథకం'. ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించనున్నాం. పండిన పంటకు మద్దతు ధర సాధించడానికి రైతు సమన్వయ సమితులను ఏర్పాటుచేశాం. మార్కెట్‌లో మంచి ధర రాకపోతే సమితి కొనుగోలు చేస్తుంది. పంటల కొనుగోలులో ప్రభుత్వం పూచీకత్తుగా ఉంటుంది.

వర్షాకాలం నాటికి 8 లక్షల ఎకరాలకు నీరు

వచ్చే వర్షాకాలం నాటికి కొత్తగా 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. పాలమూరు జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీరందించాం. గోదావరి, కృష్ణా నదులపై 23 భారీ, మరో 13 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ సాగుతోంది. అన్ని చౌక ధరల దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేయడం వల్ల నిజమైన లబ్ధిదారులకు రాయితీ అందించే అవకాశం ఏర్పడింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం కల్పించే ప్రణాళికను అమలుచేస్తున్నాము. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెడుతున్నాం.

బంగారు తెలంగాణ ధ్యేయంగా..

కేసీఆర్ పరిపాలన సంక్షేమానికి స్వర్ణయుగంగా చెప్పవచ్చు. అసహాయులైన వారికి ఆసరాగా నిలిచేందుకు ప్రతి నెలా పింఛన్లు ఇస్తున్నాం. ఆడపిల్లల పెళ్లి చేయలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారి కష్టాల్ని కల్యాణలక్ష్మి పథకం నివారించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కావాలనే డిమాండ్‌ను సమర్థిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. తల్లీ, బిడ్డల ఆరోగ్యం కోసం ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అమలుచేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రత్యేక ప్రగతి నిధి ఏర్పాటుచేశాం. బంగారు తెలంగాణ ధ్యేయంగా ప్రజల సమగ్ర అభివృద్ధికి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాం" అని ఈటల రాజేందర్ చెప్పారు.

గ్రహం అనుగ్రహం

16–3–2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర ఋతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
చతుర్దశి: సా. 5-41 తదుపరి అమావాస్య
శతభిషం నక్షత్రం: రా. 6-19 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: ఉ. 10-37 నుంచి 12-19 వరకు
వర్జ్యం: రా. 1-02 నుంచి 2-42 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-34 నుంచి 9-22 వరకు
తిరిగి మ. 12-32 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-12; సూర్యాస్తమయం: సా.6-06

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	39.0	26.0
కర్నూలు	38.3	27.4
ఆదిలాబాద్	37.4	22.0
గుంటూరు	37.0	24.1
ఖమ్మం	37.0	20.0
తిరుపతి	36.9	24.7
సూర్యాపేట	36.5	25.0
హన్మకొండ	36.0	21.5
కరీంనగర్	36.0	20.0
హైదరాబాద్	35.5	23.4
రామగుండం	34.8	24.3
మహబూబ్‌నగర్	34.0	26.5
నిజామాబాద్	31.0	23.0

ఎస్ఎస్‌సీ ప్రశ్నాపత్రం లీకును దాచిపెట్టే యత్నం

రాహుల్ ఆరోపణ

దిల్లీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారాన్ని కేంద్రం దాచి పెట్టడానికి ప్రయత్నించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఎస్ఎస్‌సీ కుంభకోణం మీ హయాంలోనే జరిగింది. ఎందుకు కప్పిపుచ్చాలనుకుంటున్నారో సమాధానం చెప్పండి" అని ట్విటర్‌లో మోదీని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యలు చేశారు.



రన్‌వేపై పడిన బంగారం

బంగారమే వర్షంగా..!

- విమానం లోనుంచి జారిపడ్డ 3.4 టన్నుల పుత్తడి

మాస్కో: వర్షం కురవడమే మనకు బంగారం. మరి ఆ బంగారమే వర్షంగా కురిస్తే? అవును ఇది నిజమే..! రష్యాలో టన్నుల కొద్దీ పుత్తడి నేలకు జారింది. అయితే ఇది ఆకాశం నుంచి కాదు. ఎరుగుతున్న విమానం లోనుంచి. వజ్రాలు, బంగారు గనులకు నిలయమైన యకుతియా ప్రాంతం ఈ ఘటనకు వేదికైంది. ఇక్కడి యకుస్క్ విమానాశ్రయంలో నింబూస్ ఎయిర్‌లైన్స్ విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే వస్తువులు తరలించే విభాగం తలుపులు తెరచుకున్నాయి. దీంతో బంగారం దిమ్మలు, ప్లాటినం, విలువైన రత్నాలు జలజలా రన్‌వేపై జారిపడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. విమానాన్ని సిబ్బంది జాగ్రత్తగా కిందకు దించగలిగారు. దీనికి సంబంధించిన చిత్రాలు అంతర్జాలంలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఘటన వాస్తవమేనని రష్యా దర్యాప్తు బృందం గురువారం స్పష్టీకరించింది. పరిసరాల్లోని చికోత్కా ప్రాంతానికి చెందిన ఓ గనులు తవ్వే సంస్థ బంగారాన్ని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు విమానం తలుపులు తెరుచుకున్నట్లు వెల్లడించింది. మొత్తంగా 3.4 టన్నుల బంగారం నేలపై పడినట్లు తెలిపింది.

పశ్చిమబెంగాల్‌లో రూ. 173 కోట్ల మోసంపై ఈడీ దర్యాప్తు

దిల్లీ/ కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో జాతీయ చిన్నతరహా పరిశ్రమల సంస్థ (ఎన్ఎస్ఐసీ) ప్రమేయంతో.. 2016లో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోటుచేసుకున్న రూ. 173 కోట్ల మోసంపై ఈడీ తాజాగా అక్రమ నగదు చెలామణి కేసు నమోదు చేసింది. రాష్ట్ర సీఐడీ అప్పట్లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ పరిధిలోని ఎన్ఎస్ఐసీలో ముడిపదార్థాల సహాయ పథకానికి గాను కొందరు వ్యక్తులు బోగస్ బ్యాంకు పూచీకత్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. అప్పట్లో ఎన్ఎస్ఐసీ ముఖ్య నిఘా అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పశ్చిమబెంగాల్ సీఐడీ 23 మందిపై కేసు నమోదు చేసింది. బ్యాంకు అధికారులు, ఎన్ఎస్ఐసీ మాజీ ఉద్యోగి, ఓ ప్రైవేటు వ్యక్తి, కొందరు ఉద్యోగులతో కుమ్మక్కై బ్యాంకును మోసగించినట్లు కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై ఈడీ తాజాగా దర్యాప్తు చేపట్టింది.

ఇదీ సంగతి!



మన బ్యాంకు గవర్నర్ గారు. దుష్ట సంహారం కోసం శివుడి వేషం కట్టారు.

‘అమ్మ’ పాలన అందించడానికే పార్టీ

మదురైలో ఏఎంఎంకేని ప్రారంభించిన టీటీవీ దినకరన్



గురువారం మదురైలో తాను ప్రకటించిన పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దినకరన్

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడు రాజకీయ రాజధాని మదురైలో మరో పార్టీ ఆవిర్భవించింది. శశికళ మేనల్లుడు, ఆర్కేనగర్ స్వతంత్ర ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ గురువారం ‘అమ్మ మక్కల్ మున్నేట్ర కళగమ్ (ఏఎంఎంకే)’ పేరుతో సొంత పార్టీని ప్రారంభించారు. పార్టీ ప్రారంభానికి ముందు ‘అమ్మ’ చిత్రపటం వద్ద ఆశీస్సులు తీసుకున్న దినకరన్ జయలలిత చిత్రంతో కూడిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత్రువులు సృష్టించే అవరోధాలను అధిగమించడానికి, విప్లవాత్మకమైన నాయకురాలైన దివంగత ముఖ్యమంత్రి జయలలిత పాలనను ప్రజలకు అందించడానికే తాను పార్టీని ప్రారంభించానని ప్రకటించారు. ఈ పార్టీ పేరుతో కుక్కర్ గుర్తుపైనే భవిష్యత్తు ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. అన్నాడీఎంకే ఎన్నికల గుర్తు రెండాకుల చిహ్నాన్ని కూడా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అప్పటివరకు కుక్కర్ చిహ్నాన్ని తమ ఎన్నికల గుర్తుగా వినియోగిస్తామని వివరించారు. ఈ సందర్భంగా మదురైలోని మేలూరు ప్రాంతం వరకు దారుల్లో పెద్దపెద్ద కటౌట్లు, చిత్రాల తోరణాలు వెలిశాయి. దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితతో పాటు వీకే శశికళ తదితర నేతల నిలువెత్తు చిత్రాలు ఇందులో ఉన్నాయి. శశికళ, దినకరన్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జైషా పరువు నష్టం కేసులో ‘ది వైర్’కు ఊరట

ఏప్రిల్ 12వరకూ చర్యల నిలిపివేతకు సుప్రీం కోర్టు ఆదేశం

దిల్లీ: వార్తా పోర్టల్ ‘ది వైర్’పైన, దాని పాత్రికేయులపైన భాజపా అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జైషా దాఖలు చేసిన నేరపూరిత పరువునష్టం ఫిర్యాదుపై వచ్చే నెల 12 వరకూ ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. తమకు ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను కొట్టేయడానికి గుజరాత్ హైకోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పాత్రికేయులు వేసిన పిటిషన్‌పై రెండు వారాల్లోగా బదులివ్వాలని జైషా తదితరులకు సూచించింది. ఇదే సమయంలో.. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఏది తోస్తే అది రాయకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం హితవు పలికింది. అయితే ప్రస్తుత కేసుకు సంబంధించి తాము ఈ వ్యాఖ్యలు చేయడంలేదని పదేపదే స్పష్టంచేసింది. కొన్నిసార్లు కోర్టును ధిక్కరించే రీతిలో విలేఖరులు కథనాలు రాస్తున్నారని పేర్కొంది. “మేం మీడియా గొంతు నొక్కబోం. మరింత బాధ్యతగా ఉండాలి” అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

‘పనామా పత్రాల’ మొసాక్ ఫోన్సెకా మూసివేత

పనామా సిటీ: ప్రపంచవ్యాప్తంగా పన్ను ఎగవేత కుంభకోణం ‘పనామా పత్రాల’ వ్యవహారంలో కేంద్రబిందువుగా నిలిచిన మొసాక్ ఫోన్సెకా.. తన కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. “ప్రతిష్ఠ మసకబారడం, మీడియా ప్రచారం, ఆర్థిక పరిణామాలు, పనమాకు చెందిన కొందరు అధికారుల చర్యల వల్ల మాకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. ఫలితంగా ఈ నెలాఖరు నుంచి పూర్తిగా కార్యకలాపాలను నిలిపివేస్తున్నాం” అని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వినతులపై స్పందించేందుకు చిన్న బృందం కొనసాగుతుందని పేర్కొంది. 2016 ఏప్రిల్ 3న మొసాక్ ఫోన్సెకాకు చెందిన డిజిటల్ రికార్డుల నుంచి 11.5 మిలియన్ పత్రాలు లీకయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులు తమ అక్రమ సంపదను కాపాడుకోవడానికి విదేశీ వ్యాపార సంస్థలను సృష్టించిన తీరును అవి కళ్లకు కట్టాయి.

సీబీఎస్ఈ 12వ తరగతి ప్రశ్నపత్రం లీక్!

విచారణకు ఆదేశించిన దిల్లీ ప్రభుత్వం

దిల్లీ: కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) 12వ తరగతి అకౌంటెన్సీ ప్రశ్నపత్రం లీక్ అయ్యిందంటూ ఫిర్యాదులు అందుతున్నాయని దిల్లీ ప్రభుత్వం తెలిపింది. వీటిపై విచారణకు ఆదేశించామని వివరించింది. అయితే అసలు లీక్ జరగనేలేదని సీబీఎస్ఈ చెబుతోంది. ఈ అంశంపై ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోదియా గురువారం ట్విటర్‌లో స్పందించారు. ‘అకౌంటెన్సీ ప్రశ్నపత్రాలు లీకయినట్లు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిపై విచారణ చేపట్టాలని విద్యా విభాగం డైరెక్టరేట్‌లోని అధికారులను ఆదేశించాం. సీబీఎస్ఈ సిబ్బందితోనూ మాట్లాడాం. వారి నిర్లక్ష్యం వల్ల ఎంతో కష్టపడి చదివే విద్యార్థులు నష్టపోకూడదు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటాం’అని ఆయన ట్వీట్‌చేశారు. ఇది జరిగిన కొద్దిసేపటికే సీబీఎస్ఈ కూడా స్పందించింది. “ప్రశ్నపత్రాలు అసలు లీక్ కాలేదు. అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ సీల్స్ తనిఖీచేశాం. ఎక్కడా వాటిని తెరచినట్లు కనిపించలేదు. కొందరు కావాలనే వాట్సాప్‌లో వీటిపై వదంతులు వ్యాపింపచేస్తున్నారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బోర్డు నిర్ణయించింది”అని ఓ ప్రకటన విడుదలచేసింది.

ఈనాడు

ఉరుముతున్న రాజకీయ అనిశ్చితి!

'రాజకీయ నాయకులకు రోజూ పరీక్షే... ఏ మారుమూల మున్సిపాలిటీలో పార్టీ పరాజయం పాలైనా మోదీకి ఎదురుదెబ్బ అని రాసేస్తారు'- నెల రోజులనాడు విద్యార్థులతో నిర్వహించిన విలక్షణ భేటీలో భారత ప్రధాని వ్యాఖ్యలివి. ఎప్పుడు ఎక్కడ ఏ స్థాయి ఎన్నికలనైనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కేంద్రంలో వ్యూహ నిర్మాణం మొదలు బూత్ స్థాయిలో కార్యకర్త శ్రేణుల్ని కదం తొక్కించేదాకా గెలుపే లక్ష్యంగా పరిశ్రమించే కమలనాథులకు తాజా ఉప ఎన్నికల పరీక్షల్లో తగిలిన ఎదురుదెబ్బ- పాలన సిలబస్ మార్చుకోవాల్సిన అవసరాన్ని బోధిస్తోంది. అంతకుమించి, 2014 ఎన్నికల్లో మోదీ అప్రతిహత విజయానికి బాటలుపరచిన 'హిందీ బెల్ట్' రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితి భాజపాకు పూర్తి భరోసా ఇచ్చేదిగా లేదన్న సత్యమూ వెల్లడవుతోంది. యూపీ, బిహార్లలో మూడు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే అన్నింటా అపజయమే కమలనాథుల్ని వెక్కిరించింది. యూపీ ముఖ్యమంత్రి కాక ముందు యోగి ఆదిత్యనాథ్ ఏకంగా అయిదుసార్లు ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య తొలిసారి ఒడిసిపట్టిన ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాల్లో 2014 ఎన్నికల్లో భాజపా సాధించిన మెజారిటీ మూడు లక్షలపైనే. మాయావతి మద్దతుతో సమాజ్‌వాది అభ్యర్థులు రెండుచోట్లా విజయదుందుభి మోగించడం కమలనాథులను కలవరపాటుకు గురిచేసేదే. ఎన్‌డీఏలో నితీశ్ చేరికతో మహాఘట్‌బంధన్ కుప్పకూలి, అవినీతి కేసుల ఊబిలో లాలూ కుటుంబం మునిగితేలుతున్న వేళ- బిహార్‌లోని అరారియాలో ఆర్‌జేడీ జయకేతనం ఎగరేయడం- గాలి మారుతున్నదనడానికి గట్టి సంకేతం. 2014 నుంచి ఇప్పటిదాకా 19 లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, డజను సీట్లను అంతకు ముందు గెలుచుకొన్న పార్టీలే నిలబెట్టుకున్నాయి. తక్కిన ఏడు సీట్లలో ఆరింటిని భాజపా చేజార్చుకుంది. గురుదాస్‌పూర్ (పంజాబ్), రత్లామ్ (ఎంపీ), అజ్మీర్, అల్వార్ (రాజస్థాన్)లతో పాటు ఇప్పుడు కోల్పోయిన సీట్లు- కమలం పార్టీకి ముందున్న హెచ్చరికలవుతున్నాయి. అంతకుమించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో త్రిశంకు సభ ఆవిర్భావంపై భయసందేహాల్ని రేకెత్తిస్తున్నాయి!

భారత రాజకీయాల్లో కాంగ్రెస్, భాజపా రెండు ధ్రువాలుగా ఉన్నాయని, 1980 దాకా కాంగ్రెస్ వ్యతిరేకత దేశంలో రాజకీయ వ్యూహాలకు కేంద్ర బిందువైతే, ఇప్పుడా స్థానాన్ని భాజపా వ్యతిరేకత ఆక్రమించిందని 2005లో కమలం పార్టీ రజతోత్సవ వేళ అడ్వాణీ విశ్లేషించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఏలుబడిలో కుంభకోణాలు హెచ్చి, అవినీతితో పాలన పుచ్చిన తరుణంలో అభివృద్ధి అజెండాగా గుజరాత్ నమూనాతో దూసుకొచ్చిన మోదీకి 2014లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాజస్థాన్, గుజరాత్, ఎంపీ, యూపీ, బిహార్ రాష్ట్రాల్లోని మొత్తం 200 స్థానాల్లో 171 చోట్ల కమలనాథులు విజయభేరి మోగించారు. 'హిందీ బెల్ట్'గా పరిగణించే యూపీ, ఎంపీ, బిహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లలో 174 సీట్లకుగాను 143 చోట్ల భాజపా జెండా ఎగిరింది. 'ఢిల్లీ పీఠానికి దగ్గరి దారి'గా భావించే యూపీలో 80 లోక్‌సభ స్థానాలుండగా మిత్రపక్షం అప్నాదళ్ (2)తో కలిసి భాజపా 73 సీట్లు కొల్లగొట్టింది. 20 శాతం ఓట్లు తెచ్చుకొని కూడా మాయావతి పార్టీ ఒక్క సీటూ దక్కించుకోలేకపోగా, 22.2 శాతం ఓట్లతో సమాజ్‌వాది అయిదు సీట్లే గెలుచుకోగలిగింది. దాదాపు రెండు పుష్కరాల కత్తి వైరాన్ని పక్కనపెట్టి ఎస్పీ, బీఎస్పీ చేతులు కలిపితే- భాజపా దూకుడును నిలువరించడం అసాధ్యమేమీ కాదన్న వాస్తవాన్ని ఈ ఉప ఎన్నికలు ఎలుగెత్తి చాటుతున్నాయి. నిరుడు మధ్యప్రదేశ్, ఇటీవల రాజస్థాన్ ఉప ఎన్నికల్లో భాజపాకు తల బొప్పి కట్టిన తీరు- అట్టడుగు స్థాయిలో ఓటర్ల అసంతృప్తికి నిదర్శనగా నిలుస్తోంది. మరో నెల రోజుల వ్యవధిలో కర్ణాటక, ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు- 2014 నాటి మోదీ ప్రభంజనం ఏ మేరకు కొనసాగనుందీ ముందస్తు సూచనలివ్వనున్నాయి.

వరస విజయాలతో దూసుకుపోతూ తనంతటివాడు లేడని విర్రవీగే నేతాగణాన్ని నేలకు దించి ముంగాళ్ల మీద కూర్చోబెట్టే పరిణతిగల ప్రజాస్వామ్యం మనది. మోదీ, అమిత్ షాల తరవాత భిన్న రాష్ట్రాల్లో భాజపా ప్రచార తారగా వెలుగొందుతున్న యోగి ఆదిత్యనాథ్ తన సొంత స్థానాన్ని నిలబెట్టుకోలేకపోవడం- క్షేత్ర స్థాయి వాస్తవాల్ని విస్మరించబట్టే జరిగింది! 'సమ్మిళిత రామన్న' అంటే, నట్టేట ముంచుతా లక్ష్మన్న' అన్నట్లు పదేళ్ల పాలనలో దేశం పరువు తీసేసిన యూపీఏకు 2014లో ఏకైక విస్పష్ట ప్రత్యామ్నాయంగా మోదీ భాజపాను ప్రజానీకం ఎంచుకుంది. ముప్ఫయ్యేళ్ల తరవాత ఒకే పార్టీకి విస్పష్ట మెజారిటీ కట్టబెట్టి ఆశీర్వదించింది. 2009లో 18.8 శాతం ఓట్లు, 116 సీట్లకే పరిమితమైన భాజపా, 2014లో 31.3 శాతం ఓట్లతో 282 సీట్లు గెలుచుకోగలిగిందంటే కారణం అదే. 19.5 శాతం ఓట్లు పడినా ప్రధాన ప్రతిపక్ష హోదా సైతం పొందలేక 44 సీట్లతో మోహం వేలాడేసిన కాంగ్రెస్, ఏ మాత్రం పుంజుకోవడం లేదన్నదీ తాజా ఉప ఎన్నికల తాత్పర్యమే! ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో మోదీ భాజపాకు ప్రత్యామ్నాయం ఏమిటి?- జాతి జనుల్ని వేధిస్తున్న ప్రశ్న ఇది. ఇందిర అవినీతి, నిరంకుశత్వాలపై లోక్‌నాయక్ జేపీ పూరించిన సమరశంఖం- కాంగ్రెసుకు తొలి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని కేంద్రంలో ప్రతిష్ఠించినా, అంతర్గత కుమ్ములాటలతో అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. దరిమిలా నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల నిర్మాణమూ సైద్ధాంతిక పునాదుల్లేక కూలిపోయింది. కుచ్చీకాయల కుర్చీలాటలా తెల్లారిపోయిన ఆ అనుభవాలు దేశాన్నింకా కురుపులా సలుపుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో- భాజపా ప్రభ మసకబారి, సరైన ప్రత్యామ్నాయం ఎదిగిరాకుంటే, దేశంపై అస్థిరత్వ మేఘాలు ముసురేసే ప్రమాదం ఆలోచనాపరుల్ని ఆందోళనపరుస్తోంది!



వ్యవస్థీకృత లోపాలే విస్తరణకు శాపాలు





డాక్టర్ ఎస్.అనంత్

ఎలక్ట్రానిక్ చెల్లింపుల గురించి రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఇటీవల విడుదల చేసిన సమాచారం ఆశావాదులు ఎగిరి గంతేసేంత గొప్పగా లేదు, నిరాశావాదులు పెదవి విరవడానికి ఆస్కారమిచ్చేలానూ ఏమీ లేదు. ఒక్క మాటలో మిశ్రమ స్పందన రేపిందని చెప్పాలి. రద్దయిన పెద్ద నోట్లలో 99 శాతం బ్యాంకింగ్ వ్యవస్థకు తిరిగి వచ్చిన నేపథ్యంలో ఎలక్ట్రానిక్ చెల్లింపుల పద్ధతి ఎంతవరకు పురోగమించిందో సమీక్షించవలసి ఉంది. ఎలక్ట్రానిక్ చెల్లింపులు మొదట్లో విజృంభించినా 2016 నవంబరు నుంచి ప్రతి నెలా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని రిజర్వుబ్యాంకు సమాచారాన్ని బట్టి అవగతమవుతోంది. ఈ తరహా చెల్లింపులు పెరుగుతూనే ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, వ్యాపార సంస్థలు... అన్నింటినీ మించి కుటుంబాలు గట్టి చేయూత ఇవ్వాల్సి ఉంటుంది. 2017 మార్చిలో గరిష్ఠ స్థాయికి పెరిగిన ఎలక్ట్రానిక్ చెల్లింపులు, కొత్త నోట్లు వ్యవస్థలోకి వచ్చిన తరవాత నుంచి తగ్గుముఖం పట్టసాగాయి.

నగదు లావాదేవీలే అధికం

ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ చెల్లింపులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పడనంతవరకు అవి నగదుకు సంపూర్ణ ప్రత్యామ్నాయం కాలేవు. కుటుంబాలు నెమ్మదిగా డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడుతున్నా, అవి ఇప్పటికీ నగదు చెల్లింపులకే ప్రాధాన్యమిస్తున్నట్లు సమాచార విశ్లేషణ బట్టి తెలుస్తోంది. వ్యాపార సంస్థలైతే రకరకాల కారణాల వల్ల ఎలక్ట్రానిక్ చెల్లింపులకు మళ్లుతున్నాయి. ఏటీఎమ్‌ల ద్వారా కాకుండా ఇతరత్రా 10 మార్గాల్లో ఈ తరహా చెల్లింపులు జరుగుతున్నాయని ఆర్‌బీఐ సమాచారం తెలుపుతోంది. వీటిలో ముందస్తు చెల్లింపు సాధనాలు, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ లేదా భీమ్), ఐఎమ్‌పీఎస్, ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌లు ముఖ్యమైనవి. సాధారణ చెక్కుల వాడకం తగ్గడమే కాదు- ఎలక్ట్రానిక్ చెక్కుల పరిష్కారాలు(క్లియరెన్స్) కూడా 2017 మార్చి నుంచి తగ్గింది. ఈ నెలలో మొత్తం డిజిటల్ చెల్లింపులు గరిష్ఠంగా రూ.14.95 లక్షల కోట్లకు చేరాయి. ఐఎమ్‌పీఎస్ ద్వారా చెల్లింపులు పెద్దనోట్ల రద్దు తరవాత రెట్టింపై రూ.88,200 కోట్లకు చేరుకున్నాయి. కొత్తగా ప్రవేశపెట్టిన యూపీఐకి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. ఈ తరహా చెల్లింపులు రూ.15,610 కోట్లకు చేరుకున్నాయి. మొబైల్ చెల్లింపుల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఈ తరహా చెల్లింపులు రూ.1,244 కోట్ల నుంచి 2017 అక్టోబరులో రూ.11,680 కోట్లకు పెరిగినా, 2018 ఫిబ్రవరి కల్లా రూ.10,250 కోట్లకు తగ్గాయి. ఏది ఏమైనా పెద్దనోట్ల రద్దు తరవాత ఆర్‌టీజీఎస్, నెఫ్ట్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్‌లు ఊపందుకున్నాయని స్పష్టమవుతోంది. కుటుంబాలు మాత్రం ఇప్పటికీ డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గు చూపడం లేదనడానికి దుకాణాల్లోని పాయింట్ ఆఫ్ సేల్ (స్వైపింగ్) యంత్రాల వద్ద క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం పెద్దగా పెరగకపోవడమే నిదర్శనం. ఈ తరహా కార్డు లావాదేవీలు 2017 జూన్‌లో గరిష్ఠంగా రూ.46,820 కోట్లకు చేరి 2018 ఫిబ్రవరిలో రూ.46,590 కోట్ల దగ్గర ఆగాయి. 2017 మార్చి నుంచి కార్డు లావాదేవీల పరిమాణం ఆరుశాతం మాత్రమే పెరిగింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కొన్ని లొసుగులు ఉండటంతో కుటుంబాల ఎలక్ట్రానిక్ చెల్లింపుల్లో ఆశించిన స్థాయి మెరుగుదల ఉండటంలేదు. ఈ చెల్లింపులకు రకరకాల సాధనాలు, మార్గాలు ఉన్నందువల్ల అన్నింటినీ ఒకే గాటన కట్టకూడదు. మొబైల్, యూపీఐ వంటి సాధనాలను గతంలో ఎరుగం. వాటిలో ఉన్నట్టుండి చెల్లింపులు జరుగుతున్నందువల్ల చాలా ఎక్కువ వృద్ధిరేటు సాధించినట్లు అనిపిస్తుంది. అన్నింటికన్నా కీలకమైన అంశం ఏమంటే- వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వల్ల డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నాయని గుర్తించాలి. ఇవి ప్రధానంగా ఆర్‌టీజీఎస్, నెఫ్ట్‌ల ద్వారా సంభవిస్తున్నాయి. జీఎస్‌టీ రిటర్నులను విధిగా దాఖలు చేయాల్సిన రోజుల్లో ఎలక్ట్రానిక్ చెల్లింపులు 10 నుంచి 30 శాతం వరకు పెరగడమే దీనికి నిదర్శనం. వీటిలో త్రైమాసిక వృద్ధి కనిపిస్తుండటంబట్టి కుటుంబాలకన్నా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ విభాగాలే ఈ తరహా చెల్లింపులను ఎక్కువగా చేపడుతున్నట్లు తేలుతోంది. త్రైమాసిక గడువుల చివరి నెలలైన మార్చి, జూన్, సెప్టెంబరు, డిసెంబర్లలో డిజిటల్ చెల్లింపులు అంతక్రితం నెలలకన్నా 10 శాతం అధికమవుతాయి. తదుపరి నెలల్లో అవి తగ్గిపోతాయి.

వినియోగదారులు జోరుగా డిజిటల్ చెల్లింపులకు మారకపోవడానికి మూడు కారణాలున్నాయి. అవి- డిజిటల్ చెల్లింపు వసతులు విస్తృతంగా అందుబాటులో లేకపోవడం, నగదు చెల్లింపులకన్నా డిజిటల్ చెల్లింపులకు ఎక్కువ ఖర్చవడం, సైబర్ భద్రత గురించి ప్రజలకు అనుమానం ఉండటం. వాటిని తొలగించి ఖాతాదారులకు డిజిటల్ చెల్లింపులపై నమ్మకం పెంచడానికి బ్యాంకులు చొరవ తీసుకొనకపోవడం శోచనీయం. తరచూ సమాచార చౌర్యం జరుగుతున్నా అవి



అడ్డంకులు తొలగిస్తేనే 'డిజిటల్' వేగంతో చెల్లింపులు

సమర్థంగా అరికట్టలేకపోతున్నాయి. నిరర్థక ఆస్తులతో సతమతమవుతున్న బ్యాంకులు డిజిటల్ లావాదేవీలకు కావలసిన మౌలిక వసతుల విస్తరణకు సరిగ్గా నిధులు వెచ్చించలేకపోతున్నాయి. దీనివల్ల గ్రామాలు, చిన్న పట్టణాలకు పూర్తిస్థాయిలో డిజిటల్ వ్యవస్థ విస్తరించలేదు. దేశం మారుమూలల్లోనూ బ్యాంకుల్లో ఖాతాలు తెరచేవారు ఎక్కువై, డిజిటల్ చెల్లింపులకు మళ్లాలని కుతూహలపడుతున్న సమయంలో- డిజిటల్ వసతులు విస్తరించకపోవడం నిజంగా పెద్ద అవరోధం. ఇలాంటి సమస్యలు ఏడాది కాలం నుంచి ఉన్నా బ్యాంకులు ఏ ఒక్కదాన్నీ పరిష్కరించలేకపోయాయి. ఇప్పుడు హడావుడిగా మేల్కొన్నా ఉన్న పళాన పరిష్కరించడం సాధ్యపడదు. దుకాణాల్లో కార్డుల సాయంతో చెల్లింపులు జరపడానికి వీలు కల్పించే పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలు మన జనాభాకు తగిన సంఖ్యలో ఇప్పటికీ చాలాచోట్ల అందుబాటులో లేవు.

గ్రామాల్లో పుంజుకోని సాంకేతికత


గ్రామాలు, చిన్న పట్టణాల్లో డిజిటల్ లావాదేవీలు అవసరమైన మేర పెరగకపోవడానికి ప్రధాన కారణమిదే. నిజానికి 2016 మార్చిలో 11.28 లక్షలున్న పీఓఎస్ యంత్రాలు 2017 సెప్టెంబరుకల్లా 29 లక్షలకు పెరిగాయి. గత సంవత్సర కాలంలో అన్ని బ్యాంకులూ కలిసి ప్రతి 13,000 మంది జనాభాకు అదనంగా ఒక్క పీఓఎస్ యంత్రాన్ని మాత్రమే ఏర్పాటుచేయగలిగాయి. పైగా వీటిలో అత్యధికం పెద్ద నగరాల్లో మాత్రమే అందుబాటులోకి రావడంతో మారుమూల ప్రాంతాలకు డిజిటల్ చెల్లింపులు ఆశించిన స్థాయిలో విస్తరించలేదు. అనేక గ్రామాలు, చిన్న పట్టణాల్లో పీఓఎస్ యంత్రాలు అసలు లేకపోవడమో, ఉన్నా ఒకటీ అరా యంత్రాలతో సరిపెట్టుకోవడమో జరుగుతోంది. గత సంవత్సరం డెబిట్ కార్డుల జారీ 35 శాతం పెరిగినా, వాటి వినియోగంలో అదే స్థాయి వృద్ధి నమోదు కాలేదు. అంతమాత్రాన ఖాతాదారులు డెబిట్ కార్డులను వినియోగించడానికి ఇష్టపడటంలేదని కాదు. అందుకు కావలసిన వసతులు లేకనే ఈ పరిస్థితి ఏర్పడింది. బ్యాంకుల అశక్తతను ప్రైవేటు డిజిటల్ వ్యాలెట్లు భారీగా సొమ్ము చేసుకొంటున్నాయి. భవిష్యత్తులో అపార విస్తరణావకాశాలున్న డిజిటల్ లావాదేవీల విపణిని బ్యాంకులు చేతులారా వదులుకొంటున్నాయి. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ప్రజలు బ్యాంకులను నమ్మినంతగా ప్రైవేటు డిజిటల్ వ్యాలెట్లను నమ్మడం కష్టం కాబట్టి బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పటికైనా మేల్కొనాలి.

పరిజ్ఞానంపై ప్రచారం

అలవాటుగా డిజిటల్ చెల్లింపులు జరపాలంటే ఖాతాదారులకు కనీస విద్యా స్థాయి, టెక్నాలజీ వినియోగంపై ప్రాథమిక అవగాహన ఉండాలి. గ్రామీణ పేదలకు, వయోవృద్ధులకు ఇలాంటి అవగాహన ఉండదు కాబట్టి డిజిటల్ చెల్లింపులవ్యాప్తి మందంగా సాగుతోంది. నలభై ఏళ్లు, అంతకు తక్కువ వయసువారే ఎక్కువగా డిజిటల్ లావాదేవీలు జరుపుతున్నారని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని జిల్లా, మండల కేంద్రాల్లో జరిగిన అధ్యయనాలు తెలుపుతున్నాయి. సాధారణంగా అరవై ఏళ్లు పైబడినవారికి మొబైల్ బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్ చెల్లింపులు కాదు కదా, కనీసం స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించడమూ తెలియదు. వీరందరికీ డిజిటల్ పరిజ్ఞానం అలవరచాలంటే దేశమంతటా విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ, ఆర్థిక సమస్యలతో కిందుమీదులవుతున్న బ్యాంకులకు ఇది తలకుమించిన భారమవుతోంది. ప్రభుత్వం బ్యాంకులకు సబ్సిడీలనో, పన్ను రాయితీలనో ఇచ్చి ఈ సమస్యను అధిగమించడానికి తోడ్పడాలి. ప్రజల్లోకి వెళ్లి డిజిటల్ అవగాహన పెంచే బ్యాంకులకు డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు సబ్సిడీ ఇస్తామని షరతు పెట్టాలి.

డిజిటల్ చెల్లింపులతో పోలిస్తే నగదు చెల్లింపులు చవక కావడం వల్ల గ్రామాలు డిజిటల్ వైపు మొగ్గడానికి ఆసక్తి చూపడంలేదు. డిజిటల్ చెల్లింపు జరిపినప్పుడు వ్యాపారి ముదరా రేటు రూపంలో ఖాతాదారులపై ఛార్జీ పడుతుంది. చిన్న చిన్న చెల్లింపులు జరిపేవారికి ఈ రుసుములు భారమవుతాయి. మరోవైపు పీఓఎస్ యంత్రాల నిర్వహణకు అధికంగా ఖర్చవుతుంది. కాబట్టి, గ్రామీణ వ్యాపారులు కూడా వాటిపై మొగ్గు చూపడంలేదు. చిన్న పట్టణాల్లోనూ కార్డుల వినియోగం తక్కువే కాబట్టి ఈ యంత్రాలపై పెట్టుబడి పెట్టడానికి వ్యాపారులు సుముఖంగా లేరు. వ్యాపారి ముదరా రేటును ఇటీవల రిజర్వు బ్యాంకు తగ్గించినా దానివల్ల వర్తకులకే తప్ప ఖాతాదారులకు ప్రయోజనం ఉండదు. మొత్తంమీద డిజిటల్ చెల్లింపుల రుసుములను ప్రభుత్వమే మూడు నాలుగేళ్లపాటు బ్యాంకులకు చెల్లించడం మంచిది. దాని వల్ల ఖాతాదారులకు ఉచిత సేవలు అంది డిజిటల్ వైపు మళ్లుతారు. ఆ తరవాత నుంచి బ్యాంకులు రుసుములు వసూలు చేసుకునే అవకాశం పరిశీలించాలి. అంతేతప్ప బంగారు గుడ్లు పెట్టే బాతును ఒకేసారి కోసుకుతిన్నట్లు మొదటినుంచే రుసుముల వసూలుకు బ్యాంకులు తొందరపడకూడదు. 1969లో బ్యాంకులను జాతీయం చేసినప్పటినుంచి ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెట్టడం వల్లనే బ్యాంకింగ్ వ్యవస్థ నేడు దేశం నలుమూలలకు విస్తరించింది. దీన్ని మరింత విస్తృతం చేయడానికి బ్యాంకులు తమవంతు కృషి చేసి ఖాతాదారులను ఆకట్టుకోవాలి. ఏతావతా ఎలక్ట్రానిక్ చెల్లింపుల వ్యవస్థ నేడు నెమ్మదిగా విస్తరిస్తోందంటే కారణం- ఈ తరహా చెల్లింపుల వ్యవస్థ దేశం నలుమూలలకూ విస్తరించకపోవడం, డిజిటల్ చెల్లింపుల ఖర్చు ఎక్కువగా ఉండటం, సైబర్ భద్రతకు పూచీ లేకపోవడం. ఈ మూడు లోపాలను సరిదిద్దినప్పుడు ఎలక్ట్రానిక్ చెల్లింపులు బహుముఖంగా విస్తరిస్తాయి. లేదంటే ఇంతవరకు సాధించిన కొద్ది పురోగతితోనే సంతృప్తిపడాల్సి ఉంటుంది!

భాషా శాస్త్రాలకేదీ వెన్నుదన్ను?



ప్రజాస్వామ్య ఉనికికి ఆయువుపట్టు- భాష. దాని వినియోగం వల్ల భావ వినిమయం కలుగుతుంది, పెరుగుతుంది. భాష కారణంగానే జనజీవనం సుసంపన్నంగా మారుతుంది. సంస్కృతి ఎంతో పరిపుష్టమవుతుంది. ఏ సమాజంలోనైనా వ్యక్తి వికాసానికి, అభివృద్ధికి మాతృభాష సహజమైన సాధనం. ఆ భాషకు, సాహిత్యానికి, వాటి పురోగతికి సంస్కృతే నేపథ్యంగా ఉంటుంది. భాషకు సంస్కృతి ఆత్మ వంటిది. సంస్కృతికి భాష దేహంలా నిలుస్తుంది. జాతికి, దాని భాషా సంస్కృతులకు విడదీయరాని సంబంధం నెలకొంటుంది. ఎక్కడైనా సంస్కృతి చిరకాలం మనగలుగుతోందంటే, దానికి భాషానుబంధమే మూలం. భారత్‌పై గతంలో రాజకీయంగా, సాంస్కృతికంగా ఎన్ని దాడులు జరిగినా- వ్యవస్థ అభేద్యంగా, అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి కారణం- భాషకు సంబంధించిన బంధం!

సమాజ అభ్యుదయానికి విద్యారంగమే పునాది. దాన్ని ఆంగ్ల ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుంది. భారతీయ భాషలు అభివృద్ధి చెందలేదని, ఆ విజ్ఞానం శాస్త్రీయమైనది కాదని పలు విపరీత భావనల్ని ప్రచారం చేసింది. బ్రిటిష్‌వారికి అనుకూలత కలిగించడమే ధ్యేయంగా ఆంగ్లవిద్య ప్రవేశించింది. ఒకప్పుడు వ్యామోహంగా ఉన్నది ఆ తరవాత అవసరంగా మారిన పరిస్థితి అది! అప్పట్లో దేశీయ విద్య, ఆ భాషల్ని నేర్పే బడులు కనుమరుగయ్యాయి. భారతీయ భాషలకన్నా, ఆంగ్ల మాధ్యమం ద్వారా విద్యార్జనపై మోజు పెరుగుతూ వచ్చింది. ఒకప్పుడు 'ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత గొప్ప' అనే భావం విద్యావంతుల్లో ఉండేది. పలువురు మాతృభాషతో పాటు ఆంగ్లం, హిందీ, సంస్కృతం వంటి ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సంపాదించేవారు. విశ్వవిద్యాలయాల స్నాతకోత్తర స్థాయుల్లో వివిధ భాషలు అభ్యసించేవారి సంఖ్య గణనీయంగా ఉండేది. వారికి విద్యారంగంలో ఉపాధి అవకాశాలూ ఎక్కువ. ఒడిశా సరిహద్దుల్లో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒడిస్సీ, తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లోని రాయలసీమ జిల్లాల్లో తమిళ, కన్నడ; తెలంగాణలో ఉర్దూ, పర్షియన్, మరాఠీ, కన్నడ భాషల్ని అవి మాతృభాషలుగా ఉన్నవారు అభ్యసించేవారు. జాతీయ అనుసంధాన భాషగా హిందీని అభ్యసించేవారి సంఖ్యా పెద్దదిగా ఉండేది. సంస్కృతంపై ఆసక్తి గలవారు దాన్ని నేర్చుకునేవారు. ఆ భాష కోసం ప్రాచ్య కళాశాలలు ఉండేవి. కాలక్రమంలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. భాషాశాస్త్రాన్ని అభ్యసించినవారికి ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించకుంటే, వాటిని ఇక చదివేవారు ఎవరుంటారని ఉమ్మడి ఉన్నత న్యాయస్థానం ఇటీవల



సమైక్య కృషితో పురోగతి

ప్రశ్నించింది. పిల్లలు భాషాశాస్త్రాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు నిరుత్సాహపరచడం తగదనీ అభిప్రాయపడింది. సంస్కృతం, ఇతర భాషలు ఇప్పటికే ప్రాధాన్యం కోల్పోయి క్రమంగా కనుమరుగవుతున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తంచేసింది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ప్రవేశం లేని కారణంగా- ఆయా కోర్సుల్ని రద్దుపరచి, అధ్యాపకుల్ని ఇతర విభాగాలకు బదిలీ చేస్తున్న పరిస్థితులున్నాయి. దీనిపైనే న్యాయస్థానంలో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.

హృదయ వికాసానికి భాషల అధ్యయనం దోహదం చేస్తుంది. ఆ భాషాశాస్త్రాల్ని అభ్యసిస్తే ఉపాధి లభిస్తుందన్న కచ్చితమైన హామీ ఉంటేనే, విద్యార్థులు చేరతారు. విద్యారంగంలో భాషల అధ్యయనం తగ్గకుండా, క్రమేణా అవి అంతరించకుండా కాపాడటానికి ప్రభుత్వమే ముందుకు రావాలి. వాటిని అభ్యసించేవారికి ప్రోత్సాహకాలు లేదా ప్రత్యేక ప్రయోజనాలు కల్పించాలి. దీన్ని 'సాంస్కృతిక న్యాయం' అనవచ్చు. అనేక ప్రాంతాల్లో ప్రాచ్య కళాశాలలు చాలావరకు మూతపడ్డాయి. ఒకప్పుడు వైభవోపేతంగా ఉన్న ప్రభుత్వ సంస్కృత కళాశాలలు ప్రస్తుతం విద్యార్థులే కరవైన దయనీయ స్థితికి చేరాయి. ద్వితీయ భాషల్లో పనిగంటలు తగ్గిపోతున్నాయి. నాయకత్వ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు భారతీయ భాషల సాహిత్యాధ్యయనమే ఎక్కువగా ఉపకరిస్తుందన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో భాషాబోధనకు ఎటువంటి ప్రాముఖ్యమూ ఉండదు. గ్రూప్ పోటీ పరీక్షల పాఠ్య ప్రణాళికలో- భాషాశాస్త్రాలు, సాహిత్యాంశాలకు ఉనికి లేదు. పర్యవసానంగా, వాటిని అధ్యయనం చేసినవారు ఉద్యోగాల్లో అవకాశాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా అటువంటివారికి సముచిత ప్రోత్సాహం కల్పించాలి. కళాశాలల్లో, పాఠశాలల్లో భాషాబోధకుల నియామకాలపై సంపూర్ణ శ్రద్ధ వహించాలి. వివిధ ప్రక్రియల్లోని సాహిత్యాన్ని విశ్లేషించడం వల్ల మానవీయ విలువలతో పాటు మారుతున్న సమాజ స్వరూపం అవగతమవుతుంది. ప్రభుత్వం ఇదే దృష్టితో భాషాశాస్త్రాల అధ్యయనాన్ని ఉత్సాహపరచే ప్రయత్నాలు ప్రారంభించాలి. అప్పుడే మన భాషలు మనగలుగుతాయి. దేశభాషల మనుగడతోనే సాంస్కృతిక వికాసం సాధ్యపడుతుంది!

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

ఈనాడు లేఖలు

వస్తుపంపిణీలో అక్రమాలు

నిత్యావసర వస్తు సరఫరాలో అనేక లోటుపాట్లు చోటుచేసుకుంటున్నాయి. వాటి వల్ల వినియోగదారులు నానా అగచాట్ల పాలవుతున్నారు. నమోదు మొదలు వస్తు పంపిణీ వరకు అన్ని దశల్లోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని సంబంధిత సంస్థలు చెబుతున్నాయి. ఆచరణలో రకరకాల అవకతవకలకు ఆస్కారం కల్పించేలా పరిస్థితులు తయారయ్యాయి. ఉదాహరణకు వంట గ్యాస్ అందించాల్సిన సంస్థల్లో కొన్ని- అక్రమాలకు పాల్పడుతున్నాయి. సకాలంలో సరఫరా చేయడం లేదు. సమస్యల్ని, ఫిర్యాదుల్ని పెడచెవిన పెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సంస్థల సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. వాడకందారుల్లో ఎవరైనా నిలదీస్తే, బెదిరింపులకు దిగడమూ పరిపాటిగా మారింది. పలు నిబంధనల్ని ధిక్కరించి వ్యవహరించడం అలవాటైంది. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. మెరుపు దాడుల ద్వారా అక్రమార్కుల ఆటలు కట్టించాలి. వినియోగదారుల హక్కుల పరిరక్షణపై శ్రద్ధ వహించడం అన్నింటికంటే ప్రధానం.

- వావిలాల రాజశేఖర శర్మ, నాగర్ కర్నూలు

దాహార్తి తీర్చండి

ఎండలు మండుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విపరీతమైన వేడిమికి తోడు దాహార్తితో అనేకులు తల్లడిల్లుతున్నారు. పరీక్షల సమయం కావడంతో, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముఖ్యంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ స్థలాల్లో పలు చలివేంద్రాల్ని ఏర్పాటుచేసి జనం దప్పిక తీర్చాల్సిన అవసరముంది. స్వచ్ఛంద సంస్థలు, సేవాబృందాలు, వ్యాపార సంఘాలు ఇప్పటికే అటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. వీటిని ఇంకా విస్తృతం చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే ఇతర చర్యలకూ ఆయా ప్రభుత్వ శాఖలు సంసిద్ధం కావాలి. వివిధ కాలనీల్లోనూ చల్లటి నీరు, మజ్జిగ వంటివి అందజేయడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

అంతర్యామి


రుషిత్వం

ఎంతమంది ప్రయత్నించినా, ఓ మనిషిని రుషి చేయలేరు. రుషిత్వం అనేది విశ్వవిద్యాలయం ఇచ్చే పట్టా వంటిది కాదు. ఎవరో కట్టబెట్టడం వల్ల అది రాదు. అది సాధించుకునేదే తప్ప, సంభవించేది కాదు. వ్యక్తి తనదైన సాధనతో సాగాలి. స్వాధ్యాయం సాగించాలి. స్వయంగా, సొంతంగా సిద్ధింపజేసుకోవాలి. సాఫల్యం అంటే అదే! అంతరంగంలో ఆత్మసాక్షాత్కారంతో ప్రాప్తించిన మహాప్రజ్ఞగా దాన్ని భావించాలి.

ఎవరిమీదనో ఆధారపడి ప్రాప్తించేది కాదు రుషిత్వం! అంతటి ప్రజ్ఞను సంతరించుకున్నవాడే 'రుషి' అవుతాడు. అప్పుడు ఆ మహనీయుడు ప్రకృతితో మమేకమై ఉంటాడు. సహజంగా అలరారుతుంటాడు. ఓ వృక్షంలా, పర్వతంలా, జీవనదిలా, ఉత్తుంగ తరంగంలా కనిపిస్తుంటాడు. ఏదీ ఎక్కువ మాట్లాడడు. దేన్నీ అదేపనిగా విశ్లేషించడు. అన్నింటినీ విభజించి చూసే మనసు అతడికి అసలే ఉండదు.

ఒకప్పుడు ఊరికి దూరంగా కుటీరంలో ఒక రుషి ఉండేవాడు. ఓ రాత్రిపూట అందులోకి దొంగ ప్రవేశించి దొరికిపోయాడు. అతణ్ని ఆ స్థితిలో చూసిన ఆయన కాస్తంత భావోద్వేగానికి లోనయ్యాడు. 'తీసుకుపోయేందుకు నా ఆశ్రమంలో ఏదీ లేదు. ఇంత దూరం వచ్చి కూడా ఉత్త చేతులతో తిరిగి వెళ్లాల్సి వస్తోందని అనుకుంటున్నావా, నువ్వు బాధపడుతున్నావా' అని ప్రశ్నించాడు. దొంగ చలించిపోయాడు. 'అదేమిటి... మీరు ఎందుకు ఇలా అనుకుంటున్నారు, అంటున్నారు? ఎందుకని ఇంతగా బాధపడుతున్నారు' అని వరసగా ప్రశ్నలు గుప్పించాడు.

రుషి ఇలా అన్నాడు 'నా వద్ద ఏదీ లేదనే బాధపడుతున్నాను. అసలు నా కుటీరంలో ఏముంటుంది గనక? ఇంతకీ నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావో చెప్పాలి. ఏదో ఒకటి అపహరించి తీసుకుపోవాలనుకున్నావు. కానీ నా కుటీరంలో నువ్వు కావాలనుకున్నవి ఏమీ లేవు. ఏం చేయాలిప్పుడు... పోనీ, నా దుప్పటి పట్టుకుపోతావా? దీన్ని వద్దనకు. ఇచ్చేందుకు ఇంకేమీ లేదు నా దగ్గర. దీన్నే తీసుకో. నేను బీదవాణ్ని కాబట్టి ఇదొక్కటే ఉంది'.



ఏం జరుగుతోందో ఆ దొంగకు అర్థం కాలేదు. ఏం చెప్పాలో తెలియలేదు. అందువల్ల 'వద్దు' అని చెప్పలేకపోయాడు. ఆయన ఇచ్చిన దుప్పటి తీసుకుని అక్కడి నుంచి మాయమయ్యాడు.

అలా ఉంటుంది రుషి మనసు!

కొన్నాళ్ల తరవాత, మరో దొంగ అదే రుషి కుటీరంలోకి చొరబడ్డాడు. అప్పుడు ఆయన లోపల ఏదో రాసుకుంటున్నాడు. కంగుతిన్నాడు దొంగ. అంతలోనే 'ఎందుకొచ్చావు నువ్వు, నీకు ఏం కావాలి' అని అడిగాడాయన. అంతటితో ఆగలేదు. 'ఆ మూల కొంత డబ్బుంది. తీసుకెళ్లు' అన్నాడు. మళ్లీ రాసుకోవడం మొదలుపెట్టాడు.


దొంగ ఆ డబ్బంతా తీసుకువెళుతుంటే 'ఆగు' అన్నాడు రుషి. అతడు ఆగి, వెనక్కు తిరిగి ఆయన వంక చూశాడు.

'ఎవరైనా నీకు ఏదైనా ఇస్తే, కృతజ్ఞతలు చెప్పాలి. దాని వల్ల నీకు మేలు కలుగుతుంది' అన్నాడు ఆ రుషి. దొంగ అలాగే చెప్పి వెళ్లిపోయాడు.

కొంతకాలానికి ఆ దొంగ రక్షక భటులకు దొరికాడు. వారు రుషినీ న్యాయస్థానానికి పిలిపించారు. అక్కడ ఆయన 'ఈ మనిషి నాకు బాగా తెలుసు. కానీ నా నుంచి ఇతడు దేన్నీ దొంగిలించలేదు. నా దగ్గర ఉన్నవి నేనే ఇచ్చాను. అందుకు కృతజ్ఞత కూడా చెప్పాడు. అంతే జరిగింది. అక్కడితో అది అయిపోయింది. ఇతడు దొంగ కాడు' అని వివరించాడు!

అందుకే రుషి పూజనీయుడు. ఆయన తత్వం పూజనీయం. 'మనసు కలిగి ఉండటం' అంటే అదే!

– ఆనందసాయి స్వామి



ప్రమాద స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

మియామిలో కూలిన వంతెన .. పలువురి మృతి?

మియామి: అమెరికాలోని మియామిలో కొత్తగా నిర్మించిన వంతెన ఒకటి గురువారం కూలిపోయింది. ఈ ఘటనలో వంతెన శిథిలాల కింద పలుకార్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో పలువురు మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఫ్లోరిడా అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి, విద్యార్థులు బస చేసే ప్రాంతాన్ని కలిపే వంతెన ఇది. ప్రమాదం స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా మూడు జలాశయాలు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా మూడు జలాశయాలు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. పెన్‌గంగ ప్రాజెక్టులో భాగంగా పిప్పల్‌కోటి వద్ద 1.42 టీఎంసీల సామర్థ్యం, గోమూత్రి వాగుపై రూ. 0.7 టీఎంసీ సామర్థ్యంతో రెండు జలాశయాలు నిర్మించనున్నారు. భూసేకరణతో కలిపి ఈ రెండింటికి రూ.583.78 కోట్లు వ్యయంకానుంది. కడెంనదిపై కుప్టి వద్ద 5.30 టీఎంసీలతో రూ.870 కోట్లతో మరో జలాశయం నిర్మించనున్నారు. ఈ మేరకు మంత్రి మండలి సమావేశంలో ఆమోదం లభించింది.



అమ్మవారికి దబ్బనంలో ఇమిడే చీర బహూకరణ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతిదేవికి ఓ నేత కార్మికుడు దబ్బనంలో ఇమిడే అతి పలుచని చీరను బహూకరించారు. సిరిసిల్లకు చెందిన నల్ల విజయ్ గురువారం ఆలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి(ఈవో) దూస రాజేశ్వర్‌కు చీరను అందజేశారు. తన కోర్కెలు తీరినందున అమ్మవారికి చీరను బహూకరించి మొక్కు చెల్లించుకున్నట్లు ఆయన తెలిపారు.

– న్యూస్‌టుడే, వేములవాడ

సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు నుంచి ఆమరణ దీక్ష

తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు ఒకటి నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్ ప్రకటించారు. సీపీఎస్ రద్దు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సీపీఎస్ విధానం రాష్ట్ర పరిధిలోకి వస్తుందని సహచట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు కేంద్రం సూటిగా సమాధానం ఇచ్చిందని గురువారం హైదరాబాద్‌లో విలేకరులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టమైతేనే ఈ విధానంలో కొనసాగవచ్చని తెలిపిందన్నారు. సీపీఎస్‌లోకి మారతారా? ఓపీఎస్‌లోనే కొనసాగుతారా? అంటూ కేంద్రం తెలంగాణకు లేఖ రాస్తే.. ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా కొత్త పెన్షన్ పథకంలో కొనసాగుతామని జవాబిచ్చిందన్నారు. సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు పడిదల సురేష్, రావుల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కుదించడం దారుణం

తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఈనాడు, దిల్లీ: రిజర్వేషన్ల స్ఫూర్తికి తూట్లు పొడిచేలా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని తెరాస ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. కేంద్రం పరిధిలోని విద్యా సంస్థల్లో విభాగాలను యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ ఆదేశాలు జారీ చేసిందని..ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం చేసేలా ఉందని ఆరోపించారు. గురువారం ఆయన విజయ్ చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల అమలు రాష్ట్రాలకు అప్పగించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం వస్తుందన్నారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో తెరాస చేస్తున్న ఉద్యమానికి ఏపీ నుంచి తెదేపా, ఉత్తర భారతదేశం నుంచి సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ వంటి పార్టీలూ మద్దతుగా నిలిచాయని తెలిపారు. అన్ని వర్గాలకు ఉపయుక్తంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని రాష్ట్రాలూ మార్గదర్శకంగా తీసుకునేలా ఉందని వ్యాఖ్యానించారు.

తోహాస్ అక్రమాలపై మంత్రి ఆగ్రహం

లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి కమిటీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ట్రక్ ఆపరేటర్స్ హైవే ఎమినిటీస్ సొసైటీ(తోహాస్) అక్రమాలపై రవాణా శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తోహాస్ అక్రమాల మీద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్ గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే రవాణాశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు సహా పెద్ద అంబర్‌పేటలో తోహాస్‌కు కేటాయించిన భూమిని దుర్వినియోగం చేశారని తేలడంతో కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ సభ్యులు, అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించారు. ఎట్టి పరిస్థితుల్లో ఓవర్ లోడ్, అక్రమ రవాణాను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.







కేసీఆర్ పాలనతో విసిగిపోయిన ప్రజలు

- ఆయనను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారు..
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- దీక్ష విరమించిన కోమటిరెడ్డి, సంపత్

హైదరాబాద్ - న్యూస్‌టుడే

కేసీఆర్ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారని.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలు కేసీఆర్ కుటుంబానికి, తెలంగాణ సమాజానికి మధ్య జరుగుతాయన్నారు. ఐకాస ఛైర్మన్ కోదండరాంపై సీఎం వాడిన భాషను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తెలంగాణ కోసం పోరాడినోళ్లు విలన్లుగా.. ఉద్యమాన్ని అడ్డుకున్నోళ్లు హీరోల్లా కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు చేపట్టిన 48 గంటల ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష గురువారం ముగిసింది. ఉత్తమ్, భట్టివిక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే గీతారెడ్డి.. తదితరులు వారికి నిమ్మరసం తాగించి దీక్షను విరమింప చేశారు. అంతకుముందు కోదండరాం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తామని.. హత్యా రాజకీయాలపై నిలదీస్తామనే భయంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి బయటికి గెంటేశారని ధ్వజమెత్తారు. కోదండరాం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి, సంపత్ కుమార్‌ల శాసనసభ సభ్యత్వం రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఓటమే లక్ష్యంగా ఇకపై రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని.. తమకు న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందనే విశ్వాసముందని కోమటిరెడ్డి తెలిపారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. తెరాసలో చేరితే రూ.కోట్లు, కాంట్రాక్టులు ఇస్తామని మభ్యపెట్టే ప్రయత్నం చేశారని. వారి మాట వినకపోవడంతోనే సభ్యత్వం రద్దు చేశారని ఆరోపించారు.



గాంధీభవన్‌లో చేపట్టిన నిరాహార దీక్ష అనంతరం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి తదితరులు

ఏకపక్షంగా సభ తెరాసకే సాధ్యం: జీవన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కాంగ్రెస్ లేకుండా ఏకపక్షంగా శాసనసభను నడపడం తెరాస ప్రభుత్వానికే చెల్లుతుందని.. కాంగ్రెస్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. గురువారం అసెంబ్లీకి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గత యాభై ఏళ్ల పాలనలో రూ.70వేల కోట్ల అప్పు అయితే.. తెలంగాణ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే కేసీఆర్ రూ.70 వేల కోట్ల అప్పు చేశారన్నారు. కాంగ్రెస్ ఓట్లను చీల్చే కుట్రలో భాగంగా మోదీ సూచనతోనే కేసీఆర్ నూతన కూటమిని తెరపైకి తెచ్చారన్నారు. అది 'మూడో ఫ్రంట్ కాదు.. ఎన్డీయే-బీ టీం' అని ఎద్దేవా చేశారు.

ప్రజల కోణంలో రాష్ట్ర బడ్జెట్

- గవర్నర్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి
- ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌ను ప్రజల కోణంలో రూపొందించామని, సంపూర్ణ వికాసమే లక్ష్యంగా కేటాయింపులు జరిపామని ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌కు తెలిపారు. ఈసారి బడ్జెట్‌ను నూటికి నూరుశాతం వినియోగించేందుకు కృషి చేస్తామని చెప్పారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ముఖ్యమంత్రి కలిశారు. దాదాపు రెండు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బడ్జెట్ ప్రతిని అందజేసి, ముఖ్యాంశాలను వివరించారు. వ్యవసాయం, సంక్షేమం, నీటిపారుదల, విద్య, వైద్యం, పరిశ్రమలు తదితర కీలక రంగాలకు విశేష ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి బిల్లుపై మరింత కసరత్తు చేస్తున్నామని, పంచాయతీరాజ్ బిల్లుపై ఏకాభిప్రాయానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. 18న ఉగాదిని పురస్కరించుకొని జరిగే పంచాంగ శ్రవణానికి రావాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించారు.

ఉద్యోగులు, పాత్రికేయుల వైద్య పథకం యథాతథం

ఉద్యోగులు, పాత్రికేయుల వైద్యసేవల పథకం ప్రస్తుతం నడుస్తున్న మాదిరే యథాతథంగా కొనసాగుతుందని, దానిని ఆరోగ్యశ్రీలో కలిపేది లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేరుస్తూ మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరగ్గా.. గురువారం టీజీవో నేతలు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ప్రగతిభవన్‌లో సీఎంను కలిశారు. ప్రస్తుత పథకం బాగా నడుస్తోందని, దానిని ఆరోగ్యశ్రీలో కలిపితే ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రస్తుత విధానం కొనసాగించాలని ఉద్యోగులు, అధికారులు కోరుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఉద్యోగులు, పాత్రికేయుల వైద్యసేవల పథకాన్ని ఆరోగ్యశ్రీలో కలపాలని మంత్రిమండలిలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టంచేశారు. ఈ పథకానికి అవసరమైన ఉద్యోగుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు వివరించారు.

అజ్మీర్ ఉర్సుకు ప్రత్యేకరైళ్లు

ఈనాడు, హైదరాబాద్: అజ్మీర్ ఉర్సుకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం వివిధ ప్రాంతాల నుంచి 10 ప్రత్యేకరైళ్లను నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఉమాశంకర్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 20 నుంచి 26 తేదీల్లో కాచిగూడ-మదర్, హైదరాబాద్-అజ్మీర్, మచిలీపట్నం-విజయవాడ, నెల్లూరు-అజ్మీర్ స్టేషన్ల మధ్య రెండేసి ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి.




గురువారం వైద్యులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మండలి ఛైర్మన్ స్వామి గౌడ్

ఆసుపత్రి నుంచి మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ డిశ్చార్జి

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు విసిరిన హెడ్ ఫోన్ తగిలి కంటికి గాయం కావడంతో హైదరాబాద్ సరోజినిదేవి నేత్రాలయంలో చికిత్స పొందుతున్న శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రవీందర్‌గౌడ్ నేతృత్వంలో వైద్యులు గురువారం ఉదయం స్వామిగౌడ్‌కు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. కార్నియా గాయం మానడంతోపాటు కంటిలో ఏర్పడిన ఎరుపు పూర్తిగా నయమైంది. దీంతో స్వామిగౌడ్ పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధరించిన వైద్యుల బృందం ఆయన్ను ఆసుపత్రి డనుంచి డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా చట్ట సభల్లోకి అడుగుపెట్టిన సభ్యులందరూ రాజ్యాంగ అధినేత అయిన గవర్నర్‌ను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తులను గౌరవించికపోయినా రాజ్యాంగాన్ని గౌరవించి తీరాలన్నారు. ఆసుపత్రిలో తనకు అండగా ఉన్న బంధువర్గం, ప్రజలు, అన్ని పార్టీల నేతలకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

కేసీఆర్‌ది ఫ్రంట్ కాదు.. కేవలం స్టంట్

- ఎమ్మెల్యేల అనర్హతపై జాతీయస్థాయిలో పోరాడుతాం
- కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్పష్టీకరణ



ఈనాడు, దిల్లీ: గవర్నర్ ప్రసంగంలోని అంశాలకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన ఇద్దరు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడం కేసీఆర్ నియంతృత్వ పాలనకు అద్దంపడుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. దీనిపై జాతీయస్థాయిలో పోరాటం చేస్తామని ప్రకటించారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్న కేసీఆర్ ప్రకటనను ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ది ఫ్రంట్ కాదు.. కేవలం స్టంట్ అంటూ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బలహీనమైనందకే ఈ మాట చెబుతున్నారని ఆరోపించారు. కేసీఆర్.. మమతాబెనర్జీ గురించి చెప్పారని, కానీ ఆమె జాతీయస్థాయిలో కాంగ్రెస్‌కు సహకరిస్తోందని ఉదహరించారు. కాంగ్రెస్, భాజపాల్లేకుండా జాతీయస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటుచేయడం ప్రాంతీయపార్టీలకు సాధ్యం కాదని స్పష్టం చేశారు. గురువారం ఆయన పార్లమెంటులోని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో జరుగుతున్న పరిణామాలు బాధాకరంగా ఉన్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు గవర్నర్‌కు వ్యతిరేకంగా కాకుండా ఆయన ప్రసంగంలోని తప్పుడు సమాచారానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. మా పార్టీలోనూ కొందరు ఎమ్మెల్యేలు కొంతమేర మించి ముందుకెళ్లినట్లు నాకు అనిపించింది. ఆ మాత్రం దానికి అనర్హత వేటు వేయడం సరికాదు. హైదరాబాద్‌లో కేసీఆర్ నియంతృత్వ ధోరణి విలయనాట్యం చేస్తోంది. ఇలాంటి నియంతలు చాలా మంది వచ్చిపోయారు. కేసీఆర్ కూడా అంతే. ప్రజాస్వామ్య పద్ధతులను పక్కనపెట్టి ఇలాంటి చర్యలు తీసుకోవడం దుర్మార్గం. దీనివల్ల కాంగ్రెస్‌కే లాభం జరిగింది. ఇద్దరు ఎమ్మెల్యేలు కొంతమేరకు హద్దుమీరితే ప్రభుత్వం మొత్తంగా హద్దుమీరింది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను ఇంటికి పంపేందుకు మీరెవరూ. ఉప ఎన్నికలకు మేం భయపడటం లేదు. కానీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుంటే మిన్నకుండలేం. ఎమ్మెల్యేలను కోర్టులకు పంపే పరిస్థితి సృష్టించడం ద్వారా ముఖ్యమంత్రి తప్పు చేశారు. అందుకు క్షమాపణలు కోరాలి' అని జైపాల్ రెడ్డి అన్నారు.

క్రిమీలేయర్ తీసేసి చట్టబద్ధత కల్పించాలి: వీహెచ్

ఈనాడు, దిల్లీ: ఓబీసీలకు క్రిమీలేయర్ తీసేసి వెనకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు తెలిపారు. తెలంగాణలో ఎన్నికల హామీలు నిలబెట్టుకోలేక బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు ఏదో చేసేస్తున్నామన్న భావన అందరిలోనూ కల్పించాలన్న దురుద్దేశంతో పార్లమెంటులో ఎంపీలు నిరసనలు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

కేసీఆర్‌తో దేశ రాజకీయాల్లో పెనుమార్పులు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకురాబోతున్నారని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. దేశానికి కావాల్సిన ఎజెండాను ఆయన రూపొందిస్తున్నారని తెలిపారు. గురువారం శాసనసభ ప్రాంగణంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "తెలంగాణ బిడ్డగా సీఎం రాష్ట్రాన్ని సాధించారు. భారత దేశ పౌరునిగా దేశంలో గుణాత్మక మార్పును ఆకాంక్షిస్తున్నారు. దేశంలో జాతీయ రాజకీయ పార్టీలు కష్టకాలంలో ఉన్నాయి. మోదీ, సోనియా, రాహుల్ ప్రాతినిధ్యం వహించే చోటే ఆ పార్టీలు ఓడిపోయాయి. కాంగ్రెస్ ధరావత్ కోల్పోవడం విశేషమేమీ కాదు. ఆ పార్టీ పరిస్థితే అలా ఉంది. ప్రాంతీయ పార్టీలే దేశానికి మార్గనిర్దేశం చేయబోతున్నాయి. కేసీఆర్ దీనిని నిరూపించబోతున్నారు. కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వం రద్దు చేస్తే ప్రజలు పట్టించుకోవడం లేదు. అందుకే వారు గాంధీభవన్‌లో టెంట్ వేసుకొని కూర్చుకున్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అసెంబ్లీలో మేం చేసిన దానికి ఇప్పుడు కాంగ్రెస్ సభ్యులు చేసిన దానికి చాలా తేడా ఉంది. మా రాష్ట్రం కోసం మేం అసెంబ్లీలో నిరసనలు తెలిపాం.. తప్ప అధికారం కోసమో, ఉనికి కోసమో ఆందోళన చేయలేదు. అప్పుడు మాకు ప్రజల మద్దతుంది కాబట్టే కాంగ్రెస్ మాపై వేటు వేసే సాహసం చేయలేదు. మా బడ్జెట్ అద్భుతంగా ఉంది. ఏపీలో జరుగుతున్న రాజకీయాల గురించి మాకు అవసరం లేదు" అని అన్నారు.

సభలో రెండు పార్టీలే ఉంటాయి: మంత్రి జగదీశ్‌రెడ్డి

వచ్చే శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి తెరాస, మజ్లిస్ పార్టీలే సభలో ఉంటాయని, మిగిలిన పార్టీల జాడే ఉండదని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన శాసనసభ ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడుతూ..ఇద్దరు శాసన సభ్యులను బహిష్కరించిన తర్వాత కాంగ్రెస్ నాయకులకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదన్నారు. విధి లేకే వారు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు.

రాజ్యసభ బరిలో నలుగురు అభ్యర్థులు

- ఉపసంహరణకు ముగిసిన గడువు
- అనివార్యమైన ఎన్నిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మూడు స్థానాలకు జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. మూడు స్థానాలకుగానూ నలుగురు అభ్యర్థులు బరిలో మిగలడంతో..ఎన్నికలు అనివార్యమయ్యాయి. తెరాస తరఫున జోగినపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్, కాంగ్రెస్ తరఫున బలరామ్ నాయక్‌లు బరిలో ఉన్నారు. ఈ నెల 23న ఎన్నిక జరగనుంది. బరిలో ఉన్న అభ్యర్థుల ఆస్తుల వివరాలను ఎన్నికల అధికారులు వెల్లడించారు.

అభ్యర్థుల ఆస్తుల వివరాలు www. eenadu.net లోచూడండి...

అధికారులందరికీ సర్కారీ చరవాణులు

ధరల విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సహాయ, ఉప కార్యదర్శులు, గెజిటెడ్ అధికారులందరినీ ఒకే మొబైల్ గ్రూపు (సీయూజీ) కిందకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. అధికారుల హోదా ప్రకారం చరవాణుల కొనుగోలుకు గరిష్ఠ ధరలను నిర్ణయించింది. ఈ మేరకు ఐటీశాఖ కార్యదర్శి జయేష్ రంజన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొబైల్ సర్వీసు ప్రొవైడర్ ఎంపిక, తక్కువ టారిఫ్‌లో మెరుగైన సేవలు అందేలా చూసే బాధ్యతను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీఎస్‌టీఎల్) ఎండీకి అప్పగించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతుల హోదా వరకు చరవాణి కొనుగోలుకు గరిష్ఠ ధర రూ.60 వేలుగా, నెలవారీ అద్దె రూ.2 వేలుగా నిర్ణయించారు. ఉప కార్యదర్శులు ఆపై స్థాయి అధికారులకు చరవాణి కొనుగోలుకు రూ.25 వేలు, గరిష్ఠ అద్దె రూ.1,375గా ఖరారు చేశారు. మిగిలిన గెజిటెడ్ అధికారుల చరవాణి కొనుగోలుకు రూ.20వేలు, నెలవారీ అద్దె రూ.625గా పేర్కొన్నారు.

ఔషధ నియంత్రణ సంస్థ ఇన్‌ఛార్జి సంచాలకులుగా ప్రీతిమీనా

తెలంగాణ ఔషధ నియంత్రణ సంస్థ ఇన్‌ఛార్జి సంచాలకులుగా ఐఏఎస్ అధికారిణి ప్రీతిమీనాను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆమె ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులుగా పనిచేస్తున్నారు. ఈ ఆదేశాలు సత్వరమే అమల్లోకి వస్తాయని వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బహిష్కరణపై కోర్టుకెక్కిన కాంగ్రెస్

- నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయండి
- ఎన్నికలు నిర్వహించకుండా ఈసీని ఆదేశించండి
- బహిష్కరణ నిర్ణయం ఏకపక్షం
- గవర్నర్ ప్రసంగం సభావ్యవహారాల పరిధిలోకి రాదు
- ఉమ్మడి హైకోర్టులో కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ పిటిషన్
- నేడు విచారణ

ఈనాడు - హైదరాబాద్

శాసనసభ నుంచి తమను బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్గొండ, అలంపూర్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎ.సంపత్‌కుమార్‌లు హైకోర్టును గురువారం ఆశ్రయించారు. తమను బహిష్కరిస్తూ తీసుకున్న తీర్మానంతో పాటు నియోజకవర్గ స్థానాలను ఖాళీగా ప్రకటిస్తూ శాసనసభ కార్యదర్శి జారీ చేసిన ప్రత్యేక గెజిట్‌ను సస్పెండ్ చేయాలని, ఆ గెజిట్ ఆధారంగా రెండు నియోజకవర్గాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

న్యాయవాది అభ్యర్థనతో శుక్రవారం విచారిచేందుకు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు అనుమతించారు. తమ వాదన వినకుండా స్పీకర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. హెడ్ ఫోన్‌ను విసిరివేయడంతో మండలి ఛైర్మన్ గాయపడ్డారన్న ఆరోపణలకు సంబంధించి వీడియో ఫుటేజీని సమర్పించాలని ఆదేశాలు జారీ చేయాలని కోరారు. చర్చల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో ముఖ్యమంత్రి వ్యక్తిగత కక్షలకు బాధితులమవుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో సభలో అడుగుపెట్టనివ్వబోమని సీఎం స్వయంగా ప్రకటించారని చెప్పారు.

అప్పుడు చెప్పలేదు

గవర్నరు ప్రసంగ సమయంలో సభలో హుందాగా ప్రవర్తించలేదంటూ తొలుత చెప్పలేదన్నారు. ఈ విషయంలో తమకు ఎలాంటి నోటీసులివ్వలేదని, వివరణ కోరలేదన్నారు. గవర్నరు ప్రసంగాన్ని తమతో పాటు మిగిలిన పార్టీ వారూ బహిష్కరించారని, ఇది హుందాతనానికి విరుద్ధమే అయినపుడు వారిపై చర్యలు తీసుకోకుండా తమపైనే ఎలా చర్య తీసుకుంటారన్నారు. రాజ్యాంగ విధుల్లో భాగంగా సభలనుద్దేశించి చేసే గవర్నరు/రాష్ట్రపతి ప్రసంగం సభా వ్యవహారాల పరిధిలోకి రాదని పేర్కొన్నారు. గవర్నరు ప్రసంగం ముగిసిన తరువాతనే సభా వ్యవహారాలు ప్రారంభమవుతాయని, అలాంటప్పుడు ముందుగా జరిగినవాటిపై స్పీకరు నిర్ణయం తీసుకోవడం చెల్లదన్నారు. శాసనమండలి ఛైర్మన్‌పై హెడ్‌ఫోన్ విసరడం వల్ల గాయపడ్డారనే ఆరోపణతో బహిష్కరించారని, ఆ సంఘటన అనంతరం చాలాసేపు గవర్నరుతో మాట్లాడి, కారుదాకా వెళ్లి వీడ్కోలు పలికిన ఛైర్మన్ సాయంత్రమయ్యేసరికి కట్టుతో కనిపించారన్నారు. తమ చర్య వల్ల ఛైర్మన్ గాయపడినట్లయితే దానికి సంబంధించిన వీడియో ఫుటేజీని తాము కోరినా ఇవ్వలేదని, కోర్టుకు సమర్పించేలా ఆదేశించాలని కోరారు. ప్రతివాదులుగా న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘాన్ని పేర్కొన్నారు.

తీర్పు వచ్చేదాకా ఆ స్థానాల విషయంలో నిర్ణయం తీసుకోవద్దు

- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలను రద్దు చేస్తూ సభాపతి వెల్లడించిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, వి.హన్మంతరావు ఇతర నేతలు గురువారం దిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఓంప్రకాష్ రావత్‌ను కలిసి అసెంబ్లీలో జరిగిన వ్యవహారాన్ని వివరించారు. ఇద్దరు ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలను రద్దు చేసే అధికారం లేకపోయినా సభాపతి నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై న్యాయపరంగా పోరాడుతున్నామని, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. హైకోర్టు తీర్పు వెలువరించే వరకు ఆ ఇద్దరు ఎమ్మెల్యేల స్థానాలు ఖాళీ అయినట్లుగా తెలంగాణ ప్రభుత్వం పంపిన గెజిట్‌నోట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ప్రధాన కమిషనర్‌ను కోరినట్లు మర్రి శశిధర్ రెడ్డి విలేకరులకు తెలిపారు.

22న భారత్‌కు జర్మనీ అధ్యక్షుడు

దిల్లీ: జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ స్టైన్‌మైర్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 22న భారత్‌కు రానున్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఆయన పర్యటన దోహదపడనుందని కేంద్ర విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జర్మనీ అధ్యక్షుని హోదాలో స్టైన్‌మైర్ భారత్‌కు రావటం ఇదే ప్రథమం.

కేంద్రంపై వైకాపా అవిశ్వాసం

- లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసును సమర్పించిన ఎంపీ వైవీ

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై వైకాపా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. ఈ మేరకు నోటీసు ప్రతిని ఆ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు అందజేశారు. దీనిని శుక్రవారం పరిగణనలోకి తీసుకోవాలని గురువారం జరిగిన లోక్‌సభా వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశంలో స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు విజ్ఞప్తి చేసినట్లు వైకాపా లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి వెల్లడించారు. ఒకటి రెండ్రోజుల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఈ నెల 21న కాకుండా శుక్రవారమే అవిశ్వాసాన్ని పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. దీనికి మద్దతునివ్వాలని జగన్ రాసిన లేఖల ప్రతులను కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ, సీపీఎం, ఆప్, తెరాస, తెదేపా పక్ష నేతలకు అందజేశామని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విలేకరులతో చెప్పారు. ఇందులోభాగంగానే... "కేంద్రంపై వైకాపా అవిశ్వాస తీర్మానం పెట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల హక్కుల కోసం, రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధనకు మా పోరాటాన్ని కొనసాగిస్తాం..." అని జగన్ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. అవిశ్వాసానికి అవసరమైన ఎంపీల మద్దతును కూడగడతానన్న వ్యక్తి ఇప్పుడేమయ్యారో? ఆయన మద్దతు కూడగడతారో లేదో కూడా తెలియదని పరోక్షంగా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు.

మద్దతుకు తెరాస విముఖత: వైకాపా పెట్టిన అవిశ్వాసం తెలంగాణ రాష్ట్రం లేదా జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశం కానందున మద్దతునివ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నామని తెరాస ఎంపీలు అనధికారిక తమ సంభాషణల్లో స్పష్టం చేశారు. "మా తెలంగాణకు సంబంధించిన అంశాలపై మేం పోరాటం చేస్తున్నాం... వాటిపై మేం స్పందిస్తాం.." అని పేర్కొన్నారు.

పార్టీల మద్దతు కోరుతూ జగన్ రాసిన లేఖలో...: "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల హక్కు ప్రత్యేకహోదా సాధన పోరులో మీ మద్దతు ఆవశ్యకత గురించే మీకు ఈ లేఖ రాస్తున్నా.. ప్రస్తుత ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ప్రత్యేకహోదా అంశాన్ని పట్టించుకోలేదు. హోదా ఇవ్వనందుకు కేంద్రంపై అవిశ్వాసం పెడుతున్నాం. మీ పార్టీల మద్దతు కావాలి..." అని వివిధ పార్టీలకు రాసిన లేఖల్లో వైకాపా అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు.

ఎస్పీవై, బుట్టా, కొత్తపల్లి గీత సహా పార్టీ ఎంపీలకు విప్ జారీ: వైకాపా ఎంపీలకు ఆ పార్టీ విప్ జారీ చేసింది. పార్టీ మారిన నలుగురు ఎంపీలు ఎస్పీవై రెడ్డి, బుట్టా రేణుక, కొత్తపల్లి గీత, తెలంగాణకు చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సహా ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్న అందరు ఎంపీలకూ ఈవిప్ జారీచేసింది. "కేంద్రంపై వైకాపా అవిశ్వాసం తీర్మానంపెట్టింది. ఈ తీర్మానం శుక్రవారం సభముందుకు రావచ్చు. పార్టీకి చెందిన అందరు ఎంపీలు హాజరవ్వాలి. తీర్మానానికి కావాల్సిన 50 మంది ఎంపీల సంఖ్యను భర్తీ చేసేందుకు నిలబడి మద్దతునివ్వాలి. మద్దతుగా ఓటు వేయాలి..."అంటూ విప్‌ను ఎంపీలకు వైకాపా చీఫ్ విప్ వైవీ సుబ్బారెడ్డి గురువారం జారీ చేశారు.

కృత్రిమ గుండె సిద్ధం

రూపొందించిన చైనా శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: రాకెట్ నిర్మాణ సాంకేతికతను ఉపయోగించి చైనా శాస్త్రవేత్తలు కృత్రిమ గుండెను రూపొందించారు! ఇప్పటికే వీటిని ఆరు గొర్రెలకు అమర్చగా... అవన్నీ ఆరోగ్యంగా జీవనం సాగిస్తుండటం విశేషం. 'చైనా అకాడమీ ఆఫ్ లాంచ్ వెహికిల్ టెక్నాలజీ' శాస్త్రవేత్తలు... విద్యుత్తును చోదకశక్తిగా మార్చే రాకెట్ సర్వో సిస్టంను ఆధారం చేసుకుని కృత్రిమ గుండె (స్పేస్‌హార్ట్)ను తయారుచేశారు. ఇందుకు టెడా ఇంటర్నేషనల్ కార్డియోవాస్క్యులర్ ఆసుపత్రి వైద్యుల సహాయం తీసుకున్నారు. వారి సూచనల మేరకు ద్రవ-వాయువులను నియంత్రించే అయస్కాంత కృత్రిమ గుండెను తయారుచేశారు. ఇదెంతో ప్రభావవంతంగా పనిచేస్తోందనీ, దీర్ఘకాల జీవితానికి భరోసా ఇవ్వగలదని చెబుతున్నారు. ఇప్పటికే గత ఏడాదిలో ఆరు గొర్రెలకు ఈ 'స్పేస్‌హార్ట్'లను పరిశోధకులు విజయవంతంగా అమర్చగలిగారు. వైద్య పరీక్షలన్నీ పూర్తిచేసుకుని 2020 నాటికల్లా ఇది రోగులకు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

ఎన్డీయేకు రాంరాం

- తెదేపా నిర్ణయం

ఈనాడు – అమరావతి

ఎన్డీఏతో తెలుగుదేశం పార్టీ బంధం తెంచేసుకుంది. భాజపాతో పొత్తుకి స్వస్తి పలికింది. విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి తన పార్టీ మంత్రుల్ని వెనక్కి తీసుకున్న తెదేపా తాజాగా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌తో కేంద్రంపై లోక్‌సభలో వైకాపా ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శాసనసభలోను, ఎంపీలు, పార్టీ వ్యూహ కమిటీ సభ్యులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లోను మాట్లాడారు. శుక్రవారం ప్రత్యేకంగా జరిగే తెదేపా పొలిట్‌బ్యూరో సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించాక ఎన్డీఏతో తెగదెంపుల నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.


> ఏ పార్టీ అయినా, వ్యక్తులైనా కావొచ్చు. మీకు స్వార్థాలు, భయాలు ఉంటే ఉండొచ్చు. నేను కేంద్రంపై పోరాడుతున్నప్పుడు, ప్రధాని రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని నేను గళం విప్పినప్పుడు నన్ను బలపర్చాలేగానీ, బలహీనపరచకూడదు. నన్ను విమర్శించేవారు, నేనంటే పడనివారు, సొంత రాజకీయ ప్రయోజనాలు ఉన్నవారు కూడా దీన్ని ఆలోచించుకోవాలి.

మద్దతివ్వాల్సింది పోయి లాలూచీ రాజకీయాలా?

రాజకీయ పార్టీలు, వ్యక్తుల పేర్లు ప్రస్తావించకుండానే అసెంబ్లీలో విపక్షాలపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. కొన్ని పార్టీలు, వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం లాలూచీ పడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేంద్రంతో తాను పోరాడుతుంటే... మద్దతివ్వాల్సిందిపోయి, లాలూచీ రాజకీయాలతో ఈ కుట్రలేంటని ధ్వజమెత్తారు. "కొందరు కావాలని, లేనిపోనివి చేసి అవిశ్వాస తీర్మానాలు పెడతామంటున్నారు. ఎవరు అవిశ్వాస తీర్మానం పెట్టినా తెదేపా సహకరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం ఎవరు పోరాడినా సహకరిస్తాం. మీరు లాలూచీ పడే ఆ కార్యక్రమం చేస్తున్నా... దాన్ని ఎండగడుతూనే, మద్దతిస్తాం. రాష్ట్ర ప్రయోజనాల్ని పణంగా పెడితే మాత్రం చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. ఇది నా నలభై ఏళ్ల రాజకీయ అనుభవంతో, ప్రజల మాటగా చెబుతున్నాను" అని పేర్కొన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకోవడం మంచిది కాదని హెచ్చరించారు.

రాష్ట్రం కోసం కేంద్రం చుట్టూ తిరగడం నా బలహీనతా?

"రాష్ట్రంలోని అన్ని పార్టీలను అడుగుతున్నాను. నేను కేంద్రంపై పోరాడుతున్నాను. నాలుగేళ్లుగా కేంద్రాన్ని అడుగుతున్నాను. 29 సార్లు దిల్లీ చుట్టూ తిరిగాను. కొందరు అది నా బలహీనత అంటున్నారు. నాది బలహీనత కాదు. మిత్రధర్మం. సమస్యలు పరిష్కారం కానప్పుడు విధిలేని పరిస్థితుల్లో మొదట పోరాటం ప్రారంభించింది నేనే. మీరెవరూ పోరాడలేదు. మా ఎంపీలు పార్లమెంటులో పోరాడుతున్నారు. మేం ఇక్కడ పోరాడుతున్నాం. విపక్ష నాయకులు లాలూచీ రాజకీయాలతో నన్ను విమర్శిస్తున్నారు" అని చంద్రబాబు ధ్వజమెత్తారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎంతో మంది ఎన్నో విధాల రాజీపడటం చూశానన్నారు. దేశం, రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలే తప్ప తమకు మరేవీ ముఖ్యం కాదన్నారు. తెలుగుజాతికి, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. 'మన ప్రజలు ఎంత భావోద్వేగంతో ఉంటారో, అంత సున్నిత మనస్కులు. ఏది న్యాయమో, ఏది అన్యాయమో పసిగడతారు. లాలూచీ పడ్డవారికి తగిన గుణపాఠం చెబుతారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచి పద్ధతి కాదు" అని పేర్కొన్నారు.



> ఎవరు ఎవరితో లాలూచీ పడుతున్నారో వచ్చే ఒకటి రెండు రోజుల్లో వివరంగా చెబుతా. చెప్పాల్సినవి చాలా ఉన్నాయి. నాకేం దాపరికాలు లేవు. అన్నీ మాట్లాడతాను. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా నిజాన్ని ఎవరూ మార్చలేరు. నిజం నిప్పులాంటిది. దానితో చెలగాటం మంచిది కాదు.

ప్రజల తరఫున మరోసారి కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నా...

తనకు ప్రజలే హైకమాండ్ అని, విభజన చట్టంలోని అంశాలు, హామీల్ని అమలు చేయాల్సిందిగా వారి తరఫున కేంద్రాన్ని మరోసారి డిమాండ్ చేస్తున్నానని చంద్రబాబు అన్నారు. "40 ఏళ్లలో ఎదుర్కొన్న కష్టాల గురించి సహచరులు చెబుతున్నప్పుడు కళ్లల్లో నీళ్లు వచ్చాయి. నేనూ మనిషినే. యంత్రాన్ని కాదు. మనం ప్రజల కోసం ఇంత కష్టపడ్డామా? అన్న ఆనందం, భావోద్వేగంలో కన్నీళ్లు వస్తాయి. ఏం జరిగినా, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నేను చలించను. మనో నిబ్బరం, దృఢమైన వ్యక్తిత్వం నాకుంది. ధర్మం కోసం పోరాడుతున్నాను. నా జీవితంలో ఏమీ కోరుకోలేదు. నేను ఎప్పుడూ గడియారం, ఉంగరాలు పెట్టుకోలేదు. వస్తువులు నాకెప్పుడూ సంతోషం కలిగించవు. డబ్బు సంపాదించాలన్న ఆలోచన లేదు. ఈ దేశంలో అవినీతి పూర్తిగా పోవాలంటే పెద్ద నోట్లు రద్దు చేయాలని, డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలని ప్రధానికి చెప్పాను. రాజకీయాల్లో అవినీతి నిర్మూలన జరిగేంత వరకు తెదేపా కృషి చేస్తుంది' ' అని సీఎం పేర్కొన్నారు.

ప్రజల సంతోషం కోసం ఎన్నాళ్లైనా కష్టపడతా

- నేను సుఖపడితే వాళ్లు కష్టపడాలి
- అందుకే నిరంతరం శ్రమిస్తున్నా
- ఎన్టీఆర్ నాకు స్ఫూర్తి.. నా దైవం
- శాసనసభలో అభినందన తీర్మానం సందర్భంగా చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్ర ప్రజల సుఖమే నాకు కావాలి. నేను సుఖపడితే వాళ్లంతా కష్టపడాలి. అందుకే వాళ్ల సుఖం కోసం నేను 40 ఏళ్లుగా కష్టపడుతున్నా. దేశంలోనే నంబరువన్ రాష్ట్రంగా ఎదిగే వరకు కష్టపడుతూనే ఉంటా'నని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. 'ఏ రాజకీయ నాయకుడు నాలా కష్టపడలేదు. ఇన్ని సంక్షోభాలూ ఎదుర్కోలేదు. ప్రతిది అవకాశంగా, ఛాలెంజ్‌గా తీసుకున్నా. భయమంటే తెలియదు' అని పేర్కొన్నారు. శాసనసభ్యుడిగా 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని 41వ ఏట అడుగిడుతున్న సందర్భంగా గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలంతా కలిసి అభినందన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. తన బాల్యం నుంచి ఇప్పటివరకు చోటు చేసుకున్న సంఘటనలను నెమరు వేసుకున్నారు. 'నా తల్లి కట్టెలపొయ్యితో వంట చేయడం చూశా. ప్రతి ఇంటికి వంట గ్యాస్‌కనెక్షన్లు ఇప్పించా. మరుగుదొడ్లు లేక వీధులకు ఇరువైపులా బహిర్భూమికి వెళుతున్న ప్రజల కష్టాలు చూసి ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. ఏప్రిల్ కల్లా బహిరంగ మల, మూత్ర విసర్జిత రహిత రాష్ట్రంగా ప్రకటించనున్నాం'అని పేర్కొన్నారు. ఆయన అనుభవాలు, అనుభూతులివి..

- 'మా వైస్‌ఛాన్సలర్.. లెక్చరర్ పోస్టు ఇస్తానంటే ఎమ్మెల్యే అవుతున్నానని చెప్పా. మొట్టమొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఏ ఊరుకూ రోడ్డు ఉండేది కాదు. రెండు మిలిటరీ జీపులిచ్చేవారు. 1983 వరకు మూడేళ్లు మంత్రిగా ఉన్నా. మంత్రిగా ఉండి మద్రాసులో పెళ్లి చేసుకున్నా. లోకేశ్‌కు పెళ్లి సందర్భంలో లుంబిని పార్కులో పేలుళ్లు ...చాలా మంది చనిపోయారు. పెళ్లయిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లిపోయా. గెలిపించిన చంద్రగిరి నియోజకవర్గం, కుప్పం ప్రజలకు ధన్యవాదాలు.
- '2004-09లో విపక్షంలో ఉన్నపుడు మామూలు వాళ్లయితే అన్ని సమస్యలు ఎదుర్కోలేరు. పరిటాల రవిని పార్టీ కార్యాలయంలో చంపేశారు. అనంతపురంలో కొన్ని హత్యలు జరిగాయి. ఇలాంటి సంఘటనల్లో చనిపోయిన వారి పిల్లల కోసం ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ పెట్టి మంచి చదువు చెప్పిస్తున్నాం.
- 'మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు కడితే పోరాడినందుకు నన్ను అరెస్టు చేశారు. నేను తప్పు చేయలేదు. మా సరిహద్దు దాటి వచ్చి మీ వాళ్లే అరెస్టు చేశారని వాదించా. చాలా దారుణంగా ప్రవర్తించారు. పాదయాత్ర చేస్తున్నపుడు గ్రామగ్రామాన కరెంటు లేక రాత్రుళ్లు మంటలు వేసుకుని కాపలాకాసిన వారిని చూశా. నీళ్ల కోసం మైళ్ల దూరం నడిచి వెళుతున్న మహిళలను గమనించా.
- 'మొదటి నుంచి ఎన్టీఆర్‌తో కలిసి జాతీయ రాజకీయాల్లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. కాంగ్రెసేతర ప్రతిపక్షాలను, సిద్ధాంతపరంగా వేర్వేరు దారుల్లో ఉన్న పార్టీలను ఏకతాటిపైకి తెచ్చింది ఎన్టీఆర్. నేషనల్ ఫ్రంట్‌కు ఎన్టీఆర్ ఛైర్మన్, వీపీ సింగ్ ప్రధాని... అదీ తెదేపా సత్తా. 1985లో పార్లమెంటులో తెదేపా ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. భాజపా రెండే సీట్లు గెలుచుకుంది. ప్రజల కోసం రాజీలేకుండా పోరాడతా. ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం.
- 'ఎన్టీఆర్ నుంచి క్రమశిక్షణ, కఠోర శ్రమ, నిరంతరం ప్రజల గురించి ఆలోచించడం, ధైర్యంగా ముందుకువెళ్లే చొరవ అలవడ్డాయి. మా తల్లిదండ్రులకంటే గొప్పగా ఎన్టీఆర్‌ను గుర్తుపెట్టుకుంటా. ఇక్కడ ఎమ్మెల్యేలకు, పార్టీ కార్యకర్తలకు ఏ క్రమశిక్షణ ఉందో లోకేష్‌కు, బ్రాహ్మణికి, దేవాంశ్‌కు అదే క్రమశిక్షణ...నా భార్య లోకేష్‌ను, బ్రాహ్మణిని బాగా చదివించేందుకు స్టాన్‌ఫోర్డ్‌కు పంపించేందుకు చేసిన కృషిని మర్చిపోలేను. శుభసందర్భాల్లో కొంత సమయం ఇవ్వమని ఆమె అడిగారు. వారానికి గంట రెండు గంటలు సమయం అడుగుతారు. ఆ కోరిక తీర్చలేకపోతున్నా'

అనుబంధం మరువలేనిది....

ఇక్కడున్న ప్రతి ఒక్క వ్యక్తితో అనుబంధం ఉంది. దేవినేని రమణ, ఎర్రన్నాయుడు, లాల్‌జాన్‌బాషా, మాధవరెడ్డి., బాలయోగి, ముద్దుకృష్ణమనాయుడి మరణాల సందర్భంలో మనస్సు ధైర్యం చేసుకున్నా. 2003 అక్టోబరులో సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి నన్ను కాపాడారు. 23 క్లైమోర్‌మైన్స్ పెడితే.. బతికే పరిస్థితి ఉండదు. అప్పుడు కూడా అధైర్యపడలేదు. ధైర్యంగా పోరాడా. నలభై ఏళ్లు నాకు అండదండగా నిలబడ్డ ప్రతి ఒక్కరికీ, తల్లిదండ్రులకు, మార్గదర్శి..నాకు దేవుడైన ఎన్టీఆర్‌కు, 24 గంటలూ నన్ను అంటిపెట్టుకున్న నా కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజానీకానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు. నాపై ఉంచిన ఎనలేని విశ్వాసం, నమ్మకం నాకు పెద్ద టానిక్ అని వ్యాఖ్యానించారు.

దార్శనిక నేత చంద్రబాబు: సభలో తీర్మానం

శాసనసభ్యుడిగా 40 ఏళ్లు పూర్తవుతున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తూ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. 'సుదీర్ఘ రాజకీయ జీవితంలో తనకు ఎదురయ్యే సవాళ్లు, సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని దార్శనిక నేతగా ఎదిగారు. దేశంలో అందరికంటే అనుభవజ్ఞుడైన ప్రజానాయకుడు ఆయనే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా, మరో పదేళ్లు ప్రతిపక్ష నేతగా, నవ్యాంధ్రలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రిగా కొనసాగుతూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటున్నారని పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ వెనుక పెద్దలు

- తెదేపాను దెబ్బతీసేందుకు కుట్ర: చంద్రబాబు ఆరోపణ

ఈనాడు, అమరావతి: హక్కుల కోసం పోరాడాల్సిన ఈ కష్టకాలంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కేంద్రాన్ని నిలదీయకుండా తనను విమర్శిస్తే రాష్ట్రానికి వచ్చే ప్రయోజనం ఏముంటుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. నరేంద్రమోదీని నిలదీయాల్సిన వ్యక్తులు, తనను నిలదీస్తున్నారన్నారు. డబ్బులివ్వాల్సింది నరేంద్రమోదీ.. న్యాయం చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అటు పవన్ ఇటు మోదీపై ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా తీవ్రంగా ధ్వజమెత్తారు. "తెదేపాను తీవ్రంగా దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోంది. ఇందులో పవన్ కల్యాణ్ ఇరుక్కోవడం బాధాకరం. తాజా పథక రచనలో చాలా మంది పెద్దలు, స్థానిక నాయకులు ఉన్నారు. ఆయన చేసిన ఆరోపణలు అర్థరహితం. నేను ఎవరికీ భయపడేది లేదు. నరేంద్రమోదీ, ఎన్‌డీఏ ప్రభుత్వం ఇబ్బందులు పెడితే భయపడే పిరికి పందను కాను. ఒక్కో రాష్ట్రంలో ఉండే నాయకత్వాన్ని బలహీనపర్చడానికి, ఇష్టమొచ్చినట్టు ఆడుకోవడం వీళ్లకు అలవాటైపోయింది. కేసులుండే వాళ్లయితే వీళ్ల చెప్పుచేతల్లో ఉంటారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను ఎన్నో సంక్షోభాలను చూశాను. ఎప్పుడూ భయపడ లేదు. భయమనేది నా జీవితంలో లేదు. కొందరు రాజకీయ పెద్దలు నిన్నటిదాకా జగన్, విజయసాయి రెడ్డిలతో నాటకాలాడారు. అది వికటించేసరికి కొత్త నాటకం మొదలు పెట్టారు. ఇక్కడి ప్రజలకు రాజకీయ చైతన్యం ఎక్కువ. తమిళనాడు తరహా రాజకీయాలు నడవవని వారు గుర్తుంచుకోవాలి. ఇంతకుముందు వైకాపా చేసిన పసలేని ఆరోపణలే ఇప్పుడు పవన్ చేస్తున్నారు. 2013లో రాష్ట్ర పాలనపై ఎన్‌సీఏఈఆర్ ఇచ్చిన నివేదిక పట్టుకొని అవినీతి పెరిగిపోయిందనడం హాస్యాస్పదం. 2015లో అదే సంస్థ ఏపీలో అవినీతి గణనీయంగా తగ్గిపోయిందని నివేదిక ఇచ్చింది. పార్టీని, రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకుంటారు" అని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తనకు నరేంద్రమోదీ, ఎన్‌డీయే ప్రభుత్వంతో గొడవ ఏముందని ప్రశ్నించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కావాలని రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కష్ట సమయంలో ఎవరైనా కేంద్రాన్ని, మోదీని నిలదీయాలన్నారు. నాలుగు బడ్జెట్‌లు ఎదురుచూసినా కేంద్రం చెప్పిన మాట నిలబెట్టుకోలేదని, అలాంటి వారికి కొందరు రాష్ట్రంలోని నాయకులు వంత పాడుతుండడం బాధాకరమన్నారు. వైకాపా నాయకులు తనను విమర్శిస్తూ కేంద్రాన్ని పల్లెత్తు మాట అనడం లేదంటే ఎంత నీచమో ఆలోచించాలని చెప్పారు. ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకూ జపాన్ తరహాలో ఒకవైపు ఎక్కువ పనిచేసుకుంటూ ఉద్యమం చేస్తామని వెల్లడించారు.

లోకేష్‌కు ముడిపెట్టడం ఎంతవరకు సమంజసం?

"శేఖర్‌రెడ్డి వ్యవహారాలన్నీ తమిళనాడుకు చెందినవి. తితిదే బోర్డు సభ్యుడిగా ఆ ప్రభుత్వ సిఫార్సు మేరకు నియమించాం. సోదాలు జరిగిన వెంటనే బోర్డు నుంచి తొలగించాం. లోకేష్‌ను తానెప్పుడూ కలవలేదని శేఖర్ రెడ్డే చెప్పారు. ఈయన ఉదంతంతో లోకేష్‌కు ముడిపెట్టడం ఎంతవరకు సమంజసం?" అని చంద్రబాబు వివరించారు.





నడిరోడ్డుపై కంటైనర్ లారీ నుంచి మంటలు

పేలుడు పదార్థాలతో వెళ్తున్న ఓ వాహనంలో మంటలు చెలరేగి దగ్ధమైంది. గురువారం రాత్రి హైదరాబాద్ శివారు శామీర్‌పేట మండల పరిధి అవుటర్ రింగ్ రోడ్డు చౌరస్తా-రాజీవ్ రహదారి మొదటి వంతెన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి పరిధిలోని సాల్వో కంపెనీకి చెందిన కంటైనర్ జిలిటెన్‌స్టిక్స్ తదితర పేలుడు పదార్థాలతో కీసర నుంచి కరీంనగర్ మార్గంలో సింగరేణికి వెళ్తుంది. వాహనం అవుటర్ రింగ్ రోడ్డు చౌరస్తా వద్దకు రాగానే కంటెనర్‌లో పొగలు రావటం మొదలయ్యాయి. అటుగా వెళ్తున్న పోలీసులు గుర్తించి లారీ డ్రైవర్‌కు అప్రమత్తం చేశారు. డ్రైవర్ వాహనాన్ని నిలిపి పరిశీలించేలోగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఆ మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. రెండు గంటలకు పైగా పోలీసులు శ్రమించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

– న్యూస్‌టుడే, శామీర్‌పేట

అశాస్త్రీయంగా రాష్ట్ర విభజన: సుజనాచౌదరి

ఈనాడు, దిల్లీ: ఆనాడు రాష్ట్రాన్ని తొందరపాటుతో, అన్యాయంగా, అశాస్త్రీయంగా విభజించారని తెదేపా నేత, కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి అన్నారు. ఆంధ్రపదేశ్ అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలనూ, మౌలికవసతుల కల్పన, పారిశ్రామికీకరణ, రెండురాష్ట్రాల్లో ఉపాధి కల్పనలకు అన్నిరకాలా భరోసా ఇచ్చిన తర్వాత ఆర్టికల్ 3, 4 ప్రకారం విభజనకు ప్రయత్నించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. నాటి ప్రభుత్వం విభజనకు ముందు పదేళ్లపాటు రెండు ప్రాంతాలనూ సమానస్థాయిలో అభివృద్ధి చేసి ఉంటే ఈ గుండెమంట తప్పేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంపట్ల ప్రజల్లో భావోద్వేగాలు తీవ్రంగా పెరిగిపోయాయని వివరిస్తూ దీనిపై స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఆర్థిక తార్కికాలకంటే ప్రజల నిజమైన భావోద్వేగాలే గొప్పవన్న విషయాన్ని మనం గుర్తించాలన్నారు. కేంద్రమంత్రివర్గం నుంచి వైదొలిగిన తర్వాత అందుకు కారణాలను వివరిస్తూ గురువారం ఆయన మాట్లాడారు. ."అశాస్త్రీయ విభజన ఆంధ్రప్రదేశ్‌ను అవశేష రాష్ట్రంగా మిగిల్చింది. ప్రజలకు సంస్థలు, మౌలికవసతులు, రాజధానిని దూరం చేసింది. తరచూ సంభవించే కరవులు, తీవ్రమైన తుపాన్ల కారణంగా అత్యల్ప తలసరి ఆదాయ రాష్ట్రంగా మారిపోయింది. విభజన జరిగిన తీరు, ప్రజాస్వామ్య ప్రక్రియపై అప్పట్లో తీసుకొచ్చిన ఒత్తిడి బహుశా ప్రపంచ ప్రజాస్వామ్యచరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. పూర్తి వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ జాతీయ సగటు వృద్ధిరేటు కంటే అధిక వృద్ధిరేటు సాధించేలా ప్రజలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం సంధానకర్తగా వ్యవహరించింది. భూమితో భావోద్వేగాలు ముడిపడి ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఏర్పాటుచేసే సంస్థలు, రాజధాని కోసం రైతులు దాన్ని త్యాగం చేశారు. పార్లమెంటు స్థాయిలో ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోకుండా మళ్లీ అవి చర్చనీయాంశం కావడాన్ని చూసి వారంతా అయోమయానికి గురవుతున్నారు. తెదేపా స్వర్గీయ ఎన్‌టీ రామారావు నేతృత్వంలో ఏర్పాటైన విషయం అందరికీ తెలుసు. ఇది జాతీయ దృక్పథం ఉన్న పార్టీ. కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా కూటములు ఏర్పాటుచేయడంలో తెదేపా ఎంత కీలకపాత్ర పోషించిందో దేశ రాజకీయ చరిత్ర చూస్తే తెలుస్తుంది. భారతీయులుగా ఉన్నందుకు తెలుగువారంతా గర్విస్తున్నారు. భారతదేశం ఎప్పుడూ సమైక్యంగానే ఉంటుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల ఆకాంక్షలను తప్పని సరిగా గుర్తించాలి. ఈ నేపథ్యంలో విభజన సమయంలో లేవనెత్తిన హామీలన్నింటికీ తార్కిక ముగింపు పలుకుతారని నేను ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ముందస్తుగా స్పీకర్ అనుమతించిన ప్రసంగపాఠాన్ని చదివారు. గత కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రతిపక్ష సభ్యులకు తెదేపా లోక్‌సభాపక్షనేత తోట నరసింహం ముందుగానే విజ్ఞప్తి చేయడంతో వారంతా అశోక్ గజపతిరాజు మాట్లాడుతున్నంత సేపు నిశ్శబ్దంగా వెల్‌లో నిల్చున్నారు.

హామీలన్నీ అమలుచేయండి: అశోక్ గజపతిరాజు

ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటులో ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికైనా సత్వరం అమలు చేయాలని కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతి రాజు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సాక్షాత్తు పార్లమెంటులోనే ఇచ్చిన హామీలు అమలుకాకుండా మళ్లీ చర్చనీయాంశాలుగా మారడాన్ని చూసి ఆంధ్రప్రదేశ్ ప్రజలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. కేంద్రమంత్రివర్గం నుంచి వైదొలిగిన సందర్భంగా తన రాజీనామాకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ ఆయన గురువారం లోక్‌సభలో 199వ నిబంధన కింద ప్రకటన చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు విధినిర్వహణలో సహకరించిన ప్రధాన మంత్రి, ఇతర మంత్రివర్గ సహచరులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆపై రాష్ట్ర విభజనపై ఆయన మాట్లాడుతూ.

ఊడిగం కుదరదు

- సమకాలీన నాయకులు అలా చేయాలని కోరుకుంటున్నారు
- ఎన్ఆర్ఐల సమావేశంలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 'సమకాలీన రాజకీయాలు ఎలా తయారయ్యాయంటే.. ఏమీ మాట్లాడకుండా వారికి ఊడిగం చేయాలనుకుంటున్నారు. అది ఇక కుదరదు. రాజకీయాల్లో ఎవరికీ వ్యక్తిగత శత్రువులు ఉండరు. సత్యం మాట్లాడితేనే శత్రువులు వస్తారు. ఒకటి మాత్రం నిజం. సత్యం మాత్రమే గెలుస్తుంది' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. 'ఎక్కడా పోరాటం ఆపం. సామాజిక రాజకీయ మార్పు కోసం పోరాడదాం' అని ప్రవాస తెలుగు ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా వివిధ దేశాల నుంచి వచ్చిన తెలుగువారితో పవన్‌కల్యాణ్ గురువారం ఉదయం విజయవాడలోని ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. వారిని పేరు పేరునా పరిచయం చేసుకున్నారు. 'మెరుగైన జీవితం కోసం విదేశాలకు వెళ్లి కష్టపడి వృద్ధిలోకి వస్తున్న వారు ఎన్ఆర్ఐలు. వారి నుంచి డబ్బులు పిండేద్దాం అనుకుంటున్నారు. ఆ పద్ధతి పోవాలి. మీ నుంచి జనసేనకు మేధో సహకారం కావాలి. మీరు మీ పనులు చేసుకుంటూనే ఎన్నో మార్పులు తీసుకురావచ్చు. మీకున్న పరిచయాలతో, ప్రజా సంబంధాలతో రాష్ట్రానికి ఏం చేయాలో ఆలోచించండి..' అని పవన్ సూచించారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలపై 'జనసేన' ప్రస్తావించినప్పుడు ఎన్నారై సబ్బిశెట్టి తన పరిచయాలతో హార్వర్డ్ వైద్య నిపుణులను సంప్రదించి రాష్ట్రానికి తీసుకొచ్చారు. అలాగే మీకున్న పరిచయాలతో ఎన్నో చేయవచ్చని పవన్‌కల్యాణ్ సూచించారు. గుంటూరులో భూగర్భ డ్రైనేజీకి కేంద్ర నిధులు ఖర్చు చేశామన్నారు. అవి ఏమయ్యాయి? మంచినీటిలో మురుగు కలిసి పది మంది అతిసారంతో చనిపోయారు. ఎంత బాధాకరం? ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏం చేయగలం. విదేశాల్లో భూగర్భ మురికినీటి వ్యవస్థ ఎలా ఉంది? అక్కడి నిపుణులు ఏమంటున్నారో ఎన్నారైలుగా మీరు ఆలోచన చేయాల'ని సూచించారు.



ప్రత్యేక హోదా కోసం ఐక్య పోరాటం: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు రైల్వేజోన్, విభజన హామీల సాధనకు జనసేనతో కలిసి పోరాడతామని వామపక్ష నేతలు ప్రకటించారు. ఈ మేరకు ప్రాథమిక నిర్ణయం తీసుకున్నామని, అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నామని, తదుపరి సమావేశాల్లో కార్యాచరణ రూపొందించుకుంటామని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ ప్రకటించారు.

సిద్ధరామయ్యపై యడ్యూరప్ప వ్యాజ్యం

ఈనాడు, బెంగళూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా తనకు వ్యతిరేకంగా సీఎం సిద్ధరామయ్య అవహేళన వ్యాఖ్యలు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ భాజపా కర్ణాటక శాఖ అధ్యక్షుడు, ఆ పార్టీ సీఎం అభ్యర్థి యడ్యూరప్ప గురువారం హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి నరేంద్ర తదుపరి విచారణను ఈనెల 26కు వాయిదా వేశారు. ప్రతివాదులు సిద్ధరామయ్యతో పాటు పీసీసీ కార్యాధ్యక్షుడు దినేశ్ గుండూరావు, విధానపరిషత్తు సభ్యుడు ఉగ్రప్పకు తాఖీదులు జారీ చేశారు. వారి వ్యాఖ్యలను ప్రచురిస్తున్న ముద్రణ, దృశ్య మాధ్యమాలకూ నోటీసులు పంపారు. సభల్లో సిద్ధరామయ్య తదితరులు తనను పదేపదే 'చెరసాలకు వెళ్లి వచ్చిన వ్యక్తి'గా వ్యాఖ్యానించి ప్రజల దృష్టిలో పలుచన చేస్తున్నారని పేర్కొన్నారు. 'నేను న్యాయనిర్బంధాన్ని అనుభవించానే కానీ నేరగాడిగా కాదు. నాకు వ్యతిరేకంగా దాఖలైన అవినీతి వ్యాజ్యాలన్నింటినీ కొట్టివేసి నిర్దోషిగా ప్రకటించడాన్ని గుర్తించాలి' అని యడ్యూరప్ప పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▼ 150	33686
నిఫ్టీ ▼ 51	10360
డోజోన్స్ 24,852 ▲ 91	
నాస్‌డాక్ 7475 ▼ 21	
రూపాయి 64.93 ▲ (ఒక అమెరికా డాలరుకు) 10 పైసలు	
ముడి చమురు 65.15 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)	

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఈనాడు బిజినెస్

ఘనం (+)


నిఫ్టీ	15న	మార్పు%
ASIAN PAINTS	1160.80	2.09
BAJAJ FINA	1726.25	0.94
M&M	734.85	0.91
INDIABULLS HSG FIN	1237.95	0.90
HDFC BANK	1880.80	0.87
COAL INDIA	295.50	0.82
INDUSIND BANK	1741.75	0.48
UPL	721.15	0.39

గ్రహణం (-)


నిఫ్టీ	15న	మార్పు%
YES BANK	311.85	-2.20
RELIANCE INDU	911.80	-1.86
GAIL (INDIA)	450.35	-1.67
ICICI BANK	301.45	-1.50
TATA STEEL	611.75	-1.42
BOSCH	18025.20	-1.42
SBI	253.70	-1.30
HINDUSTAN UNILEV	1299.95	-1.29

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.08	68.50	బహ్రెయిన్ దీనార్	159.99	183.34
పౌండ్ స్టెర్లింగ్	82.58	95.77	కువైట్ దీనార్	178.88	222.68
యూరో	73.13	84.80	ఒమన్ రియాల్	156.67	179.24
జపనీస్ యెన్/100	55.74	64.65	సౌదీ రియాల్	15.71	18.62
ఆస్ట్రేలియా డాలరు	46.55	53.85	యూఏఈ దిర్హమ్	16.08	18.80
సింగపూర్ డాలరు	45.09	53.40	మలేషియా రింగిట్	14.77	18.17
థాయ్ బాత్/100	189.54	226.69	చైనీస్ యువాన్	7.28	11.81



పూర్తిగా ఉద్దేశపూర్వక మోసమే

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన కుంభకోణం పూర్తిగా ఉద్దేశపూర్వకంగా జరిగిన మోసమని.. అయితే.. దీని ఆధారంగా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థను తప్పుపట్టడానికి వీలులేదని భారత్‌లోని కేపీఎంజీ ఛైర్మన్, ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈఓ) అరుణ్ ఎం కుమార్ అంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యల వల్ల భవిష్యత్తులో సేవల రంగంలో అనేక కొత్త వ్యాపార మోడళ్లు రాగలవని, ఇవి ఉద్యోగావకాశాలను కల్పించగలవని అభిప్రాయపడుతున్నారు. కొన్ని అనుకూల అంశాల కారణంగా వచ్చే కొన్ని సంవత్సరాల పాటు భారత వృద్ధిరేటు 7–7.5 శాతం స్థాయిలో కొనసాగగలదని 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, ఐటీ పరిశ్రమ తదితర రంగాల్లో వస్తున్న మార్పులు మొదలైన వాటిపై ఆయన వెల్లడించిన ముఖ్యాంశాలు..

- పీఎన్‌బీ కుంభకోణం ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థను తప్పుపట్టలేం
- నూరు శాతం అరికట్టడం కష్టమే
- సేవల రంగంలోనే ఉద్యోగావకాశాలు
- తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి
- ఆంధ్రప్రదేశ్‌లో కేపీఎంజీ కార్యాలయం



ఇంటర్వ్యూ: కేపీఎంజీ ఛైర్మన్ అరుణ్ ఎం కుమార్

? పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన కుంభకోణం అనంతరం ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న అభిప్రాయాన్ని కొంత మంది వ్యక్తం చేశారు. ఇది సమస్యకు పరిష్కారమా

పంజాబ్ నేషనల్ బ్యాంకులో నీరవ్ మోదీ చేసింది పూర్తిగా ఉద్దేశ పూర్వక మోసం. ఇటువంటి మోసాలు జరగడానికి వీలు లేదు. వీటిని నియంత్రించవచ్చు. ఇది చాలా పెద్ద మోసం. అందులో సందేహం లేదు. అయితే.. ఒక బ్యాంకులో జరిగిన ఒక సంఘటన ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థ బలాలు, బలహీనతలపై ఒక నిర్ణయానికి రావడం సరైన విధానం కాదు. ఇటువంటి మోసాలు అన్ని చోట్ల జరుగుతునే ఉంటాయి. పూర్తిగా అరికట్టగలమని నూరు శాతం చెప్పలేం. నియంత్రణ వ్యవస్థల ద్వారా ఇటువంటి వాటిని నియంత్రించవచ్చు. ముందుగానే కనుక్కోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానాలు, మెరుగైన, సమర్థమంతమైన ప్రాసెస్ విధానాలు, నియంత్రిత విధానాలు మొదలైన వాటిని సమర్థంగా అమలు చేయడం ద్వారా ఇటువంటి మోసాలను ముందుగా పసిగట్టవచ్చు.

? భారత వృద్ధిరేటుపై కేపీఎంజీ అంచనాలు

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు వచ్చే కొన్ని సంవత్సరాల పాటు 7-7.5 శాతం కొనసాగే అవకాశం ఉంది. దేశంలో కొన్ని రాష్ట్రాలు దేశీయ వృద్ధిరేటు కంటే చాలా ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేస్తున్నాయి. మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, పెరుగుతున్న వినియోగ గిరాకీ, వ్యాపారాన్ని ప్రారంభించే ప్రక్రియను సులభతరం చేయడం వంటి అంశాలు వృద్ధిరేటు కొనసాగడానికి దోహదం చేయనున్నాయి. గత రెండేళ్లను పరిశీలిస్తే.. విదేశీ మదుపర్లకు భారత్ అత్యంత ఉత్తమమైన పెట్టుబడుల గమ్యస్థానంగా కనిపిస్తోంది. భారత్ మార్కెట్ భవిష్యత్తులో బాగా ఆకర్షణీయంగా ఉండగలదని విదేశీ మదుపర్లు గుర్తిస్తున్నారు. అందుకే ఇక్కడకు వస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు పాలన పరంగా చాలా పటిష్ఠంగా ఉన్నాయి. యువ జనాభా, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం వంటి అనేక అనుకూల పరిణామాలను మనం ఆర్థిక వ్యవస్థలో చూస్తున్నాం. ఇవి వృద్ధికి ఎంతో దోహదం చేయగలవు. నాణ్యమైన మౌలిక సదుపాయాలకు గిరాకీ పెరుగుతోంది. విమానయానం వంటి రంగాల్లో భారీ వృద్ధి అవకాశాలు ఉన్నాయి.

? వృద్ధి రేటుకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయా

ఇటీవలి కాలంలో ప్రభుత్వం మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి అనేక కీలకమైన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం చేపట్టిన ఇటువంటి కార్యక్రమాలు ఉద్యోగావకాశాల కల్పనపై ప్రభావం చూపనున్నాయి. చిన్న, చిన్న నైపుణ్యాలతో గ్రామీణ ప్రాంతాల్లో అనేక మందికి సేవల అధారిత ఉద్యోగాలు బాగా లభించనున్నాయి. నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగావకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. కొన్ని కొత్త తరం కంపెనీలు అవసరమైన ఉద్యోగులు లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రస్తుతం ఇటువంటి కంపెనీల్లో 5,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కృత్రిమ మేధ, ఐఓటీ, రోబోటిక్స్ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల వల్ల ఐటీ రంగంలో కొత్త ఉద్యోగావకాశాలు తప్పకుండా లభిస్తాయి. ఇవి కొత్త గిరాకీలను, కొత్త వ్యాపార మోడళ్లను, కొత్త ఉద్యోగావకాశాలను కల్పిస్తాయని చరిత్ర చెబుతోంది.

? దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పెట్టుబడుల ఆకర్షణ, వ్యాపార అనుకూల విధానాల్లో తెలుగు రాష్ట్రాలు ఎలా ఉన్నాయి

రెండు తెలుగు రాష్ట్రాలు చాలా 'డైనమిక్'గా ఉన్నాయి. ఒకదానితో ఒకటి పోటీపడి పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉద్యోగావకాశాల కల్పనకు ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మోడల్ రాష్ట్రాలుగా నిలుస్తున్నాయి. చాలా సమర్థమంతమైన నాయకత్వం ఉంది.

? ఆంధ్రప్రదేశ్‌కు కేపీఎంజీ కార్యకలాపాలను విస్తరించే ఆలోచన ఉందా

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కొత్తగా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. 50 మంది సిబ్బందితో వచ్చే నెల చివర్లో దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర నగరాల్లోని ఖాతాదారుల అవసరాలను ఈ కార్యాలయం తీరుస్తుంది. హైదరాబాద్ కార్యాలయంలో ప్రస్తుతం 500 మంది పని చేస్తున్నారు. ఆడిటింగ్ వంటి వివిధ విభాగాల్లో అవసరమైన నిపుణుల లభ్యత హైదరాబాద్‌లో చాలా బాగా ఉంది. కేపీఎంజీకి ఇది కీలకమైన కార్యాలయం. వచ్చే రెండేళ్లలో ఈ కార్యాలయంలో మరో 200 మందికి ఉద్యోగావకాశం కల్పించనున్నాం.

–ఈనాడు, హైదరాబాద్

యూఎస్‌లో ఇన్ఫీ టెక్నాలజీ కేంద్రం

- 2022కల్లా 1,000 ఉద్యోగాలు

దిల్లీ: అమెరికాలోని కనెక్టికట్‌లో మరో సాంకేతిక, వినూత్న కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఇన్ఫోసిస్ సన్నాహాలు చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా 2022 నాటికి అమెరికన్లకే 1,000 ఉద్యోగాలు ఇవ్వనుంది. బీమా, ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగాలపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. న్యూ ఇంగ్లండ్ ప్రాంతంలోని ఖాతాదారులకు సేవలందించేందుకు ఈ కేంద్రం ఉపకరిస్తుందని సంస్థ తెలిపింది. ఇప్పటికే ఇండియానాపోలిస్‌లో తొలి కేంద్రానికి శ్రీకారం చుట్టిన సంస్థ, నార్త్ కరోలినాలో మరొకటి ఏర్పాటు చేయనున్న సంగతి విదితమే. రోడ్‌ఐలాండ్‌లో కూడా డిజైన్, వినూత్నత కేంద్రాన్ని నెలకొల్పనుంది. రెండేళ్లలో ఇలాంటి కేంద్రాలు నెలకొల్పడం ద్వారా 10,000 మంది అమెరికన్లకు ఉద్యోగాలిస్తామని ఇన్ఫోసిస్ గతేడాది ప్రకటించిన సంగతి విదితమే. పొరుగు సేవల ద్వారా అమెరికన్ల ఉద్యోగాలను తన్నుకుపోతున్నాయని విమర్శిస్తున్న ట్రంప్ యంత్రాంగాన్ని ఆకట్టుకునేందుకు ఇలాంటి కేంద్రాలను ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి.

పబ్లిక్ ఇష్యూకు కేప్సిటన్

- రూ.21 కోట్ల సమీకరణ
- 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'లో మరో హైదరాబాద్ కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సెక్యూరిటీ, ఫెసిలిటీ మేనేజిమెంట్ సేవల కంపెనీ కేప్సిటన్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. చిన్న, మధ్య తరహా కంపెనీల కోసం ఎన్ఎస్ఈ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'లో ఈ షేర్లు నమోదవుతాయి. ఇష్యూ ద్వారా రూ.21.19 కోట్లను సమీకరించనుంది. వ్యాపార విస్తరణ, ప్రస్తుతం కంపెనీకి ఉన్న రుణాలు తీర్చడానికి, ఇతర అవసరాలకు పబ్లిక్ ఇష్యూ ద్వారా లభించిన నిధులను వినియోగిస్తామని కేప్సిటన్ ఫెసిలిటీస్ మేనేజిమెంట్ కంపెనీ ఎండీ కొడాలి శ్రీకాంత్ తెలిపారు. రూ.10 ముఖ విలువ కలిగిన 23,04,000 షేర్లను రూ.92కు జారీ చేస్తారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఇప్పటికే ఉన్న మదుపర్లు షేర్లను విక్రయించడంతోపాటు కొత్త షేర్లను కూడా జారీ చేస్తారు. 26.5 శాతానికి సమానమైన వాటాలను విక్రయిస్తున్నట్లు శ్రీకాంత్ వివరించారు. గత అయిదేళ్లలో కంపెనీ అయిదింతలైందని, 2018, మార్చితో ముగిసే ఏడాదికి స్థూల ఆదాయం రూ.117 కోట్లు, నికర లాభం రూ.6 కోట్లు ఉండగలదన్నారు. పబ్లిక్ ఇష్యూ తర్వాత కంపెనీ చెల్లించిన మూలధనం రూ.7.54 కోట్ల నుంచి రూ.8.64 కోట్లకు చేరుతుంది. 2009లో కార్యకలాపాలను ప్రారంభించిన కేప్సిటన్ దక్షిణాది రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 6,500 ఉద్యోగులు, 400కు పైగా ఖాతాదారులు ఉన్నారు. కంపెనీకి లభిస్తున్న ఆదాయంలో 70 శాతం సెక్యూరిటీ సేవల ద్వారా లభిస్తోంది. మొత్తం ఉద్యోగుల్లో 60 శాతం మంది ఈ విభాగంలోనే ఉన్నారు. నిధులు సమీకరించడానికి చిన్న కంపెనీలకు ఎన్ఎస్ఈ ఎమర్జ్ అనువైన వేదికగా కనిపిస్తోంది. కేప్సిటన్ ఫెసిలిటీ మేనేజిమెంట్ సేవల కింద హౌస్ కీపింగ్, ఆఫీస్ సపోర్ట్, ఇంజినీరింగ్ వంటి సేవలను అందిస్తోంది. ఇష్యూ వచ్చే వారంలో ప్రారంభమయ్యే వీలుంది. ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో గతంలో హ్యాసిస్, సిల్లీ మంక్స్ కంపెనీలు నమోదయ్యాయి.

స్మార్ట్ సిటీల ప్రాజెక్టులు నత్తనడక!


- మున్సిపల్ చట్టంలో మార్పులు చేయాలి
- స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా డైరెక్టర్ ప్రతాప్
- 22 నుంచి హైదరాబాద్‌లో 'స్మార్ట్ అర్బనేషన్'

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం ప్రకటించిన నగరాలను స్మార్ట్ నగరాలుగా అభివృద్ధి చేయాలంటే.. కొన్ని విధానపరమైన మార్పులు అవసరమని స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతాప్ పడోడే అన్నారు. ప్రభుత్వం 99 నగరాలను స్మార్ట్ నగరాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రాజెక్టులు వేగిరంగా ముందుకు సాగడానికి మున్సిపల్ చట్టంలో మార్పులు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని ప్రవేశపెట్టాలని, ప్రైవేట్ స్మార్ట్ సిటీల విధానాన్ని తీసుకురావాలని ప్రతాప్ అభిప్రాయపడ్డారు. 'స్మార్ట్ సిటీస్ మిషన్'ను ప్రకటించి 2018, జూన్‌తో మూడేళ్లు నిండనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈనెల 22, 23 తేదీల్లో 'స్మార్ట్ అర్బనేషన్' పేరుతో స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా సదస్సును అంతర్జాతీయ సమావేశ మందిరం (హెచ్ఐసీసీ)లో నిర్వహించనుంది. దేశ, విదేశాల నుంచి 1,500 మంది ప్రతినిధులు రానున్నారు. 40కి పైగా అంకుర కంపెనీలు తమ స్మార్ట్ సొల్యూషన్లను ప్రదర్శిస్తాయి. దాదాపు 50 మంది వక్తలు ప్రసంగిస్తారు. 150 కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచుతాయని రాంకీ గ్రూప్ వైస్ ఛైర్మన్ ఎం.గౌతమ్ రెడ్డి తెలిపారు. విద్యుత్ ఆదా, భద్రత, నగరాల ఆదాయం పెరుగుదల, ప్రజలకు మెరుగైన జీవనం తదితర ప్రయోజనాలు స్మార్ట్ నగరాల వల్ల కలుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. నగరీకరణ వేగంగా పెరుగుతున్నందున పల్లెల నుంచి పట్టణాలకు భారీ వలసలు జరుగుతాయని, పట్టణాలకు వచ్చే వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి నగరాలు స్మార్ట్ నగరాలుగా మారాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా ప్రపంచ స్థాయి కన్సార్టియం. ఇందులో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో పాలు పంచుకునే భాగస్వాములందరూ ఉంటారు.

22 నుంచి ఐసీఐసీఐ సెక్యూరిటీస్ పబ్లిక్ ఇష్యూ

- రూ.4,000 కోట్ల సమీకరణ

ముంబయి: ఐసీఐసీఐ బ్యాంక్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వారం రోజుల్లో పబ్లిక్ ఇష్యూకు రాబోతోంది. ఈ ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇష్యూ ధరల శ్రేణిని రూ.519-520లుగా నిర్ణయించింది. ఈ నెల 22న ఇష్యూ మొదలై 26న ముగుస్తుంది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ శిల్పా కుమార్ మాట్లాడుతూ 'సంస్థకు 60 శాతం ఆదాయం బ్రోకరేజీ ద్వారానే వస్తోంది. 10 శాతం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, 30 శాతం మ్యూచువల్ ఫండ్ పంపిణీ, థర్డ్ పార్టీ ఉత్పత్తుల ద్వారా వస్తోంది. ఆదాయంలో అస్థిరతను తగ్గించుకోవడానికి కొత్త ఉత్పత్తులు, సేవలను ప్రవేశపెట్టి పంపిణీ వ్యాపారాన్ని పెంచుకుంటామ'ని తెలిపారు.




కోడిగుడ్లు — 15వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
16వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

బ్యాంకులు మళ్లీ బేర్

- తాజా ఎల్ఓయూ కేసు నేపథ్యం
- ఆజ్యం పోసిన వాణిజ్య యుద్ధ భయాలు
- నష్టాల్లోనే సూచీలు



సమీక్ష

మార్కెట్‌ను మూడో రోజూ నష్టాలు పలుకరించాయి. కొత్తగా మరో 'ఎల్ఓయూ' మోసం తెరపైకి రావడంతో బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనుకావడం ఇందుకు ప్రధాన కారణం. పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాడీ హౌస్ శాఖ ద్వారా చంద్రి పేపర్స్‌కు రూ.9 కోట్ల రుణానికి ఇచ్చిన ఎల్ఓయూ మోసపూరితం అని తేలడంతో సీబీఐ తాజాగా మరో కేసు నమోదు చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో భారత ఎగుమతి ప్రోత్సాహక పథకాలను అమెరికా సవాలు చేయడం కూడా సూచీల నష్టాలకు ఆజ్యం పోసింది. అయితే భారత్‌పై ఫిచ్ వెల్లడించిన వృద్ధి రేటు అంచనాలు ప్రోత్సాహకరంగా ఉండటం నష్టాలను కొంత మేరకు తగ్గించింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా ప్రారంభమవడమూ తోడ్పడింది.

ఆద్యంతం ఊగిసలాట: ఉదయం 33,843.47 పాయింట్ల వద్ద సానుకూలంగా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత వెంటనే నష్టాల్లోకి అనంతరం జారుకుంది. అనంతరం పుంజుకొని 33,866.28 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. అనంతరం ఆ లాభాలన్నింటినీ పోగొట్టుకొని 33,637.28కు దిగివచ్చింది. ఆద్యంతం ఇలా ఒడుదొడుకుల మధ్య చలించి ఆఖరుకు 150.20 పాయింట్లు కోల్పోయి 33,685.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 50.75 పాయింట్ల నష్టంతో 10,360.15 వద్ద స్థిరపడింది.

యెస్ బ్యాంక్ విలవిల

సెన్సెక్స్ 30 షేర్లలో అత్యధికంగా యెస్ బ్యాంక్ షేరు 1.23% క్షీణించింది. ఎస్‌బీఐ, ఫెడరల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు కూడా ఇదే స్థాయిలో డీలాపడ్డాయి. హెచ్‌యూఎల్, టాటా స్టీల్, ఐటీసీ, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. గీతాంజలి జెమ్స్ షేరు పతనం కొనసాగింది. 4.78% క్షీణించి రూ.12.95కి పడిపోయింది. ఏషియన్ పెయింట్స్ 2.14%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.79% పెరిగాయి.

వెలుగులోకి ఎరువుల షేర్లు

ఎరువుల సబ్సిడీని 2020 వరకు కేంద్రం పొడిగించడంతో ఈ రంగ కంపెనీల షేర్లు వెలుగులోకి వచ్చాయి. నాగార్జున ఫెర్టిలైజర్స్ 9.82%, నేషనల్ ఫెర్టిలైజర్స్ 5.15%, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 4.11%, కోరమాండల్ ఇంటర్నేషనల్ 5.37%, చంబల్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ 2.13%, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ 1.57% మేర రాణించాయి.

మార్కెట్ కబుర్లు

- 10,000 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ మీటర్లను సరఫరా చేయడం, ప్రారంభించడం, సమాచార సేకరణ, అయిదేళ్ల పాటు వార్షిక నిర్వహణ తదితర సేవలు అందించడానికి ఝార్ఖండ్ బిజిలీ వితరణ్ నిగమ్ నుంచి జీనస్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌కు రూ.54 కోట్ల విలువైన కాంట్రాక్టు దక్కింది.
- రూ.33.5 కోట్ల నిధులను సేకరించడం కోసం వస్తున్న బెనారా బేరింగ్స్ పబ్లిక్ ఇష్యూ ధరల శ్రేణిని రూ.60-63గా నిర్ణయించింది. ఈనెల 20న ఇష్యూ మొదలై 22న ముగియనుంది.
- భారత్ డైనమిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ ముగింపురోజున, 1.30 రెట్ల అధిక స్పందన లభించింది. 2.24 కోట్ల షేర్లు జారీ చేయనుండగా, 2.92 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. రూ.413-428 ధరల శ్రేణి కలిగిన ఇష్యూ ద్వారా రూ.960 కోట్లు సమీకరించాలన్నది సంస్థ లక్ష్యం.
- తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ముసాయిదా పత్రాలను సెబీకి దాఖలు చేసింది.
- రూ.4,473 కోట్ల సమీకరణ కోసం ఐపీఓకు వచ్చిన బంధన్ బ్యాంక్ ఇష్యూ తొలిరోజున 42 శాతం బిడ్లు దాఖలయ్యాయి. రూ.370-375 ధరల శ్రేణితో వచ్చిన ఇష్యూ, ఈనెల 19న ముగియనుంది.
- తమ గ్రూప్ సంస్థలైన ఇండియన్ హోటల్స్ కంపెనీ (ఐహెచ్‌సీ)లో 6.64 శాతం వాటా, టాటా మోటార్స్‌లో 0.06 శాతం వాటా షేర్ల కొనుగోలుకు టాటా సన్స్ రూ.1,088.88 కోట్లు వెచ్చించింది.
- ఈ ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర డివిడెండ్‌గా రూ.849.80 కోట్లు ప్రభుత్వానికి చెల్లించినట్లు ఎన్‌హెచ్‌పీసీ తెలిపింది.
- రూ.4,230 కోట్ల సమీకరణ లక్ష్యంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఐపీఓ నేడు ప్రారంభమై, ఈనెల 20న ముగియనుంది. ఈ ఇష్యూకు రూ.1,215-1,240 ధరల శ్రేణిని నిర్ణయించారు.
- 18 వేల మెట్రిక్‌టన్నుల మేలిమి సీసం సరఫరా కోసం రూ.300 కోట్ల ఆర్డరు సింగపూర్ సంస్థ క్రైన్ రీసోర్సెస్ నుంచి లభించినట్లు లోహ పునర్వినియోగ తయారీ సంస్థ గ్రావిటా ఇండియా వెల్లడించింది.
- రూపాయి బాండ్ల జారీ ద్వారా రూ.2,300 కోట్లు సమీకరించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది.

ఫిబ్రవరి ఎగుమతుల్లో వృద్ధి 4.5 శాతమే

దిల్లీ: గత ఫిబ్రవరి నెలలో దేశ ఎగుమతులు కేవలం 4.5 శాతమే పెరిగి 2580 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1.67 లక్షల కోట్లు)కు చేరాయి. గత నాలుగు నెలల్లో అతితక్కువ స్థాయి పెరుగుదల ఇది. ఇంజినీరింగ్, జౌళి, రత్నాలు-ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. ఇదే సమయంలో వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) మాత్రం అయిదు నెలల కనిష్ఠ స్థాయి అయిన 1200 కోట్ల డాలర్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే ఫిబ్రవరి నెలలో ఈలోటు 952 కోట్ల డాలర్లుగా ఉంది. ఇక దిగుమతుల విషయానికొస్తే గత నెలలో ఇవి 10.4 శాతం పెరిగి 3780 కోట్ల డాలర్లకు చేరాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-ఫిబ్రవరి నెలల మధ్య ఎగుమతులు 11 శాతం పెరిగి 27,370 కోట్ల డాలర్లకు చేరితే, దిగుమతులు 21 శాతం పెరిగి 41,687 కోట్ల డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 14,313 కోట్ల డాలర్లుగా నమోదైంది. గత నవంబరు నెల నుంచి ఎగుమతుల వృద్ధిరేటు ప్రతినెలా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఆ నవంబరు నెల ఎగుమతులు ఏకంగా 30.5 శాతం వృద్ధి రేటు నమోదు చేసిన విషయం తెలిసిందే. గత సెప్టెంబరులో వాణిజ్య లోటు 898 కోట్ల డాలర్లుగా నమోదైంది. 'ఆగస్టు 2016 నుంచి ఫిబ్రవరి 2018 వరకు ఎగుమతులు సానుకూల పథంలోనే కొనసాగాయి. అక్టోబరు 2017లో మాత్రం కొంచెం వెనకడుగు పడింద'ని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.



స్వాధీన ఆస్తులు ఎన్‌బీసీసీకి!

- నిర్వహించి ఆదాయం పొందచ్చు
- ప్రభుత్వ ప్రతిపాదన

దిల్లీ: మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద స్వాధీనం చేసుకున్న స్థిరాస్తులను ఎన్‌బీసీసీ (నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్)కి అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వాటిని నిర్వహించడం ద్వారా ఆదాయం ఆర్జించే అవకాశం కూడా ఉందని భావిస్తోంది. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటి పరారైన వాణిజ్యవేత్తలతో పాటు పీఎంఎల్ఏ కింద స్వాధీనం చేసుకున్న, స్తంభింప చేసిన ఆస్తులను ఎలా నిర్వహించాలనే విషయమై ఈనెల 13న సమావేశం జరిగింది. ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా, ఆర్థిక శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ కమల్ సింగ్, ఎన్‌బీసీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ కుమార్ మిత్తల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్వాధీన ఆస్తుల నిర్వహణ, అద్దెకు ఇవ్వడం, వేలం వేయడంపైనా చర్చించారు. సరైన నిర్వహణ లేనందున, స్వాధీన ఆస్తులు దెబ్బతింటున్నాయని, ఇందుకోసం మళ్లీ డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని అనుకున్నారు. అయితే సదరు ఆస్తులను అద్దెకు ఇచ్చే అవకాశం పీఎంఎల్ఏ కింద లేనందున, ఆదాయమూ రావడం లేదు. సంస్థ స్వాధీనం చేసుకుంటున్న ఆస్తుల్లో కర్మాగారాలు, ఫ్లాట్లు, భవనాలు, దుకాణాలు, వేలకొద్దీ ఎకరాల భూములు ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్‌బీసీసీకి ఆస్తుల నిర్వహణలో అపార అనుభవం ఉంది. పీఎంఎల్ఏ ఆస్తులు ఈ సంస్థకు అప్పగిస్తే, క్రమంగా పోలీస్, నిఘా విభాగాల నుంచీ ఇలాంటి కాంట్రాక్టులు లభించే వీలుంది.

విదేశాలకు పారిపోనివ్వరు



91 మంది ఎగవేతదార్లపై దృష్టి

దిల్లీ: ఉద్దేశ పూర్వకంగా బ్యాంకులకు రుణాలు ఎగవేసిన సంస్థలకు సంబంధించిన వారు విదేశాలకు పారిపోకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలాంటి కేసుల్లో 400 మందికి పాత్ర ఉండగా, ఇప్పటికే 91 మంది పేర్లతో నిషేధిత జాబితా రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం. సంబంధిత కంపెనీలపై చట్టబద్ధ చర్యలు ఆరంభించాలని, రుణ సంస్థలను ప్రభుత్వ యంత్రాంగం ఆదేశించింది కూడా. రూ.50 కోట్లు, అంతకుమించిన రుణాలు తీసుకున్న సంస్థల నిర్వాహకుల పాస్‌పోర్ట్‌ల వివరాలు ఇవ్వాలనీ బ్యాంకులకు స్పష్టం చేసింది.

ప్రజాగ్రహం వల్లే..: దేశంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో దాదాపు రూ.13 వేల కోట్ల మోసానికి పాల్పడిన నీరవ్‌మోదీ, ఆయన సంబంధీకులు, ఆ కుంభకోణం బయటకు వెల్లడయ్యే ముందే, విదేశాలకు పారిపోవడం వల్ల నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం నెలకొంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఎన్నికలు జరిగే వీలున్నందున, సంపన్న ఎగవేతదార్లపై చర్యలు తీసుకోక తప్పని స్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. అందువల్లే ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ మోసం గురించి వెలుగులోకి వచ్చిన నెల వ్యవధిలోనే 'అక్రమార్కుల ఆస్తుల స్వాధీన బిల్లును' ప్రభుత్వం రూపొందించింది. రూ.100 కోట్లు అంతకుమించి ఆర్థిక నేరాలకు పాల్పడి, విదేశాలకు పారిపోయిన నేరస్తుల ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం ఇందువల్ల లభిస్తుంది. ఇదేవిధంగా, రూ.50 కోట్లు, అంతకుమించి మోసం, ఉద్దేశపూర్వక ఎగవేత కేసుల్లో భాగస్వాములైన వారి పాస్‌పోర్ట్ వివరాలు విదేశీ మంత్రిత్వశాఖకు ఇవ్వాలని ఆదేశించింది. ఇందువల్ల ప్రత్యేక 'పరిశీలనా జాబితా' రూపొందించి, దేశం విడిచిపోకుండా చూడవచ్చన్నది ప్రభుత్వ అంచనా. తమ దగ్గర నిధులున్నా, కావాలని రుణం ఎగవేసే వారిని ఉద్దేశపూర్వక ఎగవేతదార్లుగా ప్రభుత్వం గుర్తిస్తోంది.

మరే బ్యాంక్ అనధికార ఎల్‌ఓయూ ఇవ్వలేదు

● అన్నీ పరిశీలించుకున్నాయ్ ● ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీ ఎం.ఎస్.శాస్త్రి

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న మోసపూరిత లావాదేవీల అనంతరం ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లన్నీ తాము జారీచేసిన అంగీకార పత్రాలు (ఎల్‌ఓయూ) సరిచూసుకున్నాయని, వాటిల్లో అనధికారికంగా జారీ అయినవి ఏమీ లేవని తేలిందని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎస్.శాస్త్రి వెల్లడించారు. పీఎన్‌బీ అధికారులతో కుమ్మక్కయిన వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ ఛోక్సీ మోసపూరిత ఎల్‌ఓయూలతో రూ.12,968 కోట్ల మేర అక్రమంగా పొందిన సంగతి విదితమే. 'ప్రతి బ్యాంక్ తాము ఇచ్చిన ఎల్‌ఓయూ/



ఎల్‌ఓసీలకు సంబంధించి జరిగిన లావాదేవీలను పునఃపరిశీలన జరిపాయి. అవన్నీ సక్రమంగా ఉన్నాయని, నకిలీలు ఏమీ లేదని ధ్రువీకరించాయి' అని శాస్త్రి తెలిపారు.

ఆ లావాదేవీలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకే: పీఎన్‌బీ ఘటన అనంతరం, మరిన్ని నియంత్రణలనూ బ్యాంకులు తెస్తున్నాయని వెల్లడించారు. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్)తో స్విఫ్ట్ సందేశాల అనుసంధానంపై నియంత్రణ ఉండాలని, ఈ ఏడాది ఏప్రిల్ 30 లోగా ఇది పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ లావాదేవీలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే అనుమతించనున్నారు.

ఆ ఎల్‌ఓయూలను పీఎన్‌బీ ఆమోదించాలి

నీరవ్ మోదీ, అతని సంబంధీకులకు పీఎన్‌బీ పేరిట జారీ అయిన ఎల్‌ఓయూలకు ఆ బ్యాంక్ కట్టుబడి ఉండాలనేది బ్యాంకర్ల అభిప్రాయమని శాస్త్రి పేర్కొన్నారు. ఆ ఎల్‌ఓయూల ఆధారంగానే, ఇతర బ్యాంకులు చెల్లింపులు జరిగాయని తెలిపారు. అయితే ఈ వ్యవహారంపై పూర్తి విచారణ తరవాతే, నకిలీ ఎల్‌ఓయూలుగా చెబుతున్న వాటికి బాధ్యులెవరో తేలుతుందని వివరించారు. చెల్లింపులు సత్వరం జరగకపోతే, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా ప్రకటించాల్సి వస్తుందని, అందువల్ల ఈ త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై ప్రభావం పడుతుందన్నది ఇతర బ్యాంకర్ల వాదన. పీఎన్‌బీ జారీ చసిన ఎల్‌ఓయూలకు చెల్లింపులు జరిపిన వాటిలో ఎస్‌బీఐ, అలహాబాద్ బ్యాంక్, బీఓబీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి పాతిక వరకు బ్యాంకులున్నాయి.

బ్యాంకుల నుంచి సమాచారం కోరిన పీఎన్‌బీ: 'ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అందువల్ల ఇప్పుడు దీనిపై ఊహాగానాలు సరికాదు' అని పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ శరణ్ తెలిపారు. అయితే తాము కోరిన సమాచారం ఇవ్వాలని ఇతర బ్యాంకులను పీఎన్‌బీ విజ్ఞప్తి చేసిందని సమాచారం.

బ్యాంకింగ్ వ్యవస్థపైనే ప్రజలకు విశ్వాసం పోతోంది

ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

బ్యాంకింగ్ వ్యవస్థపైనే సందేహాలు రేకెత్తించేలా చోటుచేసుకుంటున్న మోసాలపై చర్చ జరగాలని, ఇందుకు పార్లమెంటు సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ మోసం'పై ఏ పద్ధతిలో చర్చించాలనే విషయమై అధికార, విపక్ష సభ్యుల మధ్య వివాదం రేగుతున్న క్రమంలో ఆయన ఇలా వ్యాఖ్యానించారు. ఈనెల 5 నుంచి జరుగుతున్న బడ్జెట్ సమావేశాల రెండోదశలో, విపక్షాల ఆందోళనల వల్ల లోక్‌సభ, రాజ్యసభ తరచు వాయిదా పడుతున్నాయి. ఓటింగ్ జరపాల్సిన నిబంధన కింద చర్చ జరపాలని విపక్షం కోరుతుంటే, ఓటింగ్ అవసరం లేని, స్వల్పకాల వ్యవధి కింద చర్చించాలని అధికారపక్షం వాదిస్తోంది. చర్చకు రాజ్యసభలో తాను అనుమతించినా, భిన్న వాదనల వల్ల జరగడం లేదని క్రెడాయ్ సమావేశానికి హాజరైన వెంకయ్యనాయుడు తెలిపారు.

'నీరవ్‌మోదీ, ఛోక్సీ, విజయ్‌మాల్యాలు వేలకోట్ల రూపాయల మేర బ్యాంకులకు చెల్లించకుండా విదేశాలకు పరారవడం వల్ల, బ్యాంకింగ్ వ్యవస్థకే కాక, దేశ ప్రతిష్ఠపైనా ప్రభావం పడుతోంది. ప్రజలు మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థనే ప్రశ్నిస్తున్నారు. ఈ మోసాలకు సంస్థాగత లోపాలు కారణమా, వేర్వేరు స్థాయిల్లోని వ్యక్తులు కుమ్మక్కు అవ్వడం వల్ల జరిగిందా అనేది తేలాలి. ఎందుకు చర్య తీసుకోలేదో వెల్లడి కావాల్సి ఉంది. ఇందుకు నిర్మాణాత్మక, అర్థవంత చర్చలు దోహద పడతాయి' అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. 'ఎవరి హయాంలో చోటుచేసుకుంది అనేది ప్రశ్నకాదు. బ్యాంకింగ్ వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం పోతోంది. ఇది అత్యంత ప్రమాదకరం. ఇందుకు బాధ్యత ఎవరిదో తేల్చాలి. డిపాజిటర్ల నగదుకు ఎలాంటి హామీ ఇస్తారో వెల్లడించాలి' అని వెంకయ్యనాయుడు వివరించారు.

పీఎన్‌బీలో మరో మోసం

రూ.9 కోట్ల వ్యవహారంలో సీబీఐ కేసు

పీఎన్‌బీలో మరో రూ.9 కోట్ల మోసపూరిత ఎల్‌ఓయూ వెలుగులోకి వచ్చింది. ముంబయిలోని బ్రాడీహౌస్ శాఖ నుంచి చాంద్రీ పేపర్స్ అండ్ అలైడ్ ప్రోడక్ట్స్‌కు జారీ అయిన మోసపూరిత ఎల్‌ఓయూపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. నీరవ్ మోదీ తరహాలోనే ఇదీ చోటుచేసుకుంది.

పీఎన్‌బీలో పనిచేసి, పదవీవిరమణ పొందిన గోకుల్‌నాథ్ శెట్టి, ఈ శాఖ ఏకగవాక్ష విభాగ ఉద్యోగి మనోజ్ ఖారత్‌పై ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను సీబీఐ నమోదు చేసింది. దీంతోపాటు కంపెనీ, డైరెక్టర్లు ఆదిత్య రాసివాసియా, ఐశ్వర్‌దాస్ అగర్వాల్‌ల పేర్లూ చేర్చింది. వీరితో కుమ్మక్కయిన బ్యాంక్ అధికారులు, 2020 జనవరి 20న చెల్లుబాటు అయ్యేలా, ఎస్‌బీఐ అంత్వేప్ (బెల్జియం) పేరిట రూ.9.09 కోట్లు (1.4 మిలియన్ డాలర్)కు ఎల్‌ఓయూలు రెండు జారీ చేశారు. క్రెడిట్ పరిమితి , పూచీకత్తు లేకున్నా ఇలా చేశారని ఆరోపణ. ఈ కేసుకు సంబంధించి పలు ప్రాంతాల్లో సోదాలను కూడా సీబీఐ నిర్వహించింది.



హోండా కొత్త డ్రీమ్ యుగ

కొత్త లివో, సీబీ షైన్ ఎస్‌పీలూ

దిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) 2018 శ్రేణిలో మూడు కొత్త మోడళ్లను తీసుకొచ్చింది. లివో, డ్రీమ్ యుగ, సీబీ షైన్ ఎస్‌పీ పేరుతో విడుదలైన ఈ బైకుల ధరల్ని రూ.52,741-62,032ల మధ్య కంపెనీ నిర్ణయించింది. లివో 110 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందింది. దీని ధర రూ.56,230. డ్రీమ్ యుగ కూడా ఇదే ఇంజిన్ సామర్థ్యంతో రూపొందింది. ధర రూ.52,741. సీబీ షైన్ ఎస్‌పీ 125 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందింది. దీని ధర రూ.62,032. 'తొలిసారి కొనుగోలు చేసే వినియోగదారులతోపాటు ఇప్పటికే ప్రీమియం బైకులు వాడుతున్న వారు సైతం కొనేందుకు అనువుగా ఈ మూడు రకాల బైకులు ఉన్నాయ'ని హెచ్ఎంఎస్ఐ సీనియర్ ఉపాధ్యక్షుడు (అమ్మకాలు, మార్కెటింగ్) యద్వీందర్ సింగ్ తెలిపారు.



భారత్‌లోకి కొత్త గిబ్లి కారు

దిల్లీ: ఇటాలియన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మసెరాటి నవీకరించిన సెడాన్ గిబ్లి కార్లను భారత్‌లో విడుదల చేసింది. వీటి ధరలు రూ.1.33-1.42 కోట్లు (ఎక్స్‌షోరూం). 'రూపకల్పన, ప్రగతిశీల సాంకేతికతపరంగా ఈ కారు తన స్థానాన్ని ఎప్పటిలానే నిలబెట్టుకుంటుంది. గత కొన్నేళ్లుగా మసెరాటి సంస్థకు గిబ్లి కార్లు విజయవంతమైన ఉత్పత్తులుగా పేరు తెచ్చాయి. ఈ విజయయాత్రను కొనసాగించడానికి నవీకరించిన గిబ్లి కార్లు మరింత దోహదం చేస్తాయ'ని మసెరాటి ఇండియా అధిపతి (కార్యకలాపాలు) బోజన్ జంకులోవ్‌స్కి ఓ ప్రకటనలో తెలిపారు. 2018 గిబ్లి కారు 3.0 లీటర్ వీ6 ఇంజిన్ సామర్థ్యంతో రూపొందింది. 6.3 సెకన్లలో 0 నుంచి 100 కి.మీ వేగాన్ని అందుకోవడం, 250 కి.మీ. గరిష్ఠ వేగం, ఎలక్ట్రిక్ పవర్ స్టీరింగ్ దీని ప్రత్యేకతలు.

2018-19లో 7.3 శాతం

● 2019-20లో 7.5% ● భారత వృద్ధిరేటుపై ఫిచ్ అంచనా

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) భారత వృద్ధి రేటు 7.3 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఫిచ్ తెలిపింది. 2019-20లో మరింత పుంజుకొని 7.5 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. ప్రపంచ దేశాలపై వృద్ధి అంచనాలతో రూపొందించిన నివేదికలో ఫిచ్ పై విషయాలు వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017-18) భారత్ 6.5 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది. కేంద్ర గణక కార్యాలయం అంచనా వేసిన 6.6 శాతం కంటే ఇది తక్కువ కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో (2016-17) భారత వృద్ధి రేటు 7.1 శాతంగా నమోదైంది.



సానుకూలతలు ఇవే..

భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ప్రధానంగా కొన్ని అంశాలు దన్నుగా నిలుస్తాయని ఫిచ్ పేర్కొంది. అవేమిటంటే..

- జీఎస్‌టీ అమలుకు సంబంధించి అవరోధాలు క్రమక్రమంగా తగ్గుతుండటం
- మౌలిక రంగంలో పెట్టుబడులు పెరగడం
- బడ్జెట్లో గ్రామీణ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం. కనీస మద్దతు ధర పెంచడం, ఉచిత ఆరోగ్య బీమా లాంటి చర్యలు చేపట్టడం.
- పెద్ద నోట్ల రద్దు చర్య అనంతరం నగదు లభ్యత మెరుగవ్వడం

ద్రవ్యోల్బణం పైపైకి...: ఆహార ధరలు పెరుగుతుండటం ద్రవ్యోల్బణం మరింత పైకి వెళ్లేందుకు కారణమవుతుందని ఫిచ్ తెలిపింది. అయితే అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలకు తగ్గట్లుగా దేశంలో చమురు ధరలు పెరగకుండా ప్రభుత్వం నియంత్రించడం కొంతలోకొంత ద్రవ్యోల్బణం అదుపులో ఉండే అవకాశం ఉందని పేర్కొంది. వీటన్నింటి దృష్ట్యా 2018, 2019లో రిటైల్ ద్రవ్యోల్బణం 5 శాతం లోపే ఉండొచ్చని భావిస్తున్నామని వివరించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా వచ్చే ఏడాది నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచొచ్చని అంచనా వేసింది.

ప్రపంచమూ రాణింపే: అమెరికా, ఐరోపా దేశాలు, చైనాల వృద్ధి కూడా ఈ ఏడాది మెరుగయ్యే అవకాశం ఉందని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. 2019 వరకు ప్రపంచ ఆర్థిక వృద్ధి 3 శాతం కంటే పైనే కొనసాగొచ్చని తెలిపింది. 2000 మధ్యకాలం తర్వాత ఇదే అత్యుత్తమ ప్రదర్శన అని వివరించింది.

41 లక్షల ఖాతాలు మూశాం కానీ..

● కనీస నిల్వ లేకపోవడం వల్ల కాదు ● ఎస్‌బీఐ స్పష్టీకరణ

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017-18)లో 41 లక్షల ఖాతాలను మూసివేసిన మాట నిజమేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తెలిపింది. అయితే మీడియా కథనాలు పేర్కొన్నట్లు కనీస సగటు నిల్వ లేకపోవడం వల్ల వాటిని మూయలేదని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. 'ఏప్రిల్ 2017లో ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకులను విలీనం చేసిన నేపథ్యంలో మూసిన ఖాతాలవి. వినియోగదార్లకు వివిధ అనుబంధ బ్యాంకులు, ఎస్‌బీఐలలో ఉన్న బహుళ ఖాతాలు ఉండడంతో అలా చేశాం. అందుకే ఈ ఏడాది మూసిన ఖాతాల సంఖ్య భారీగా ఉంద'ని వివరణ ఇచ్చింది. 'ఎస్‌బీఐ వద్ద 41 కోట్ల సేవింగ్స్ ఖాతాలుండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.1 కోట్ల కొత్త ఖాతాలను వినియోగదార్లు తెరచారు. అందులో 1.1 కోట్ల ఖాతాలు ప్రధాన్ మంత్రి జన్-ధన్ యోజన(పీఎమ్‌జేడీవై) కిందవి కావడం విశేషమ'ని బ్యాంకు ఒక ప్రకటనలో వెల్లడించింది. సగటు నెలవారీ నిల్వను ఉంచలేని వారు తమ సేవింగ్స్ ఖాతాల నుంచి ప్రాథమిక సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాకు ఎటువంటి రుసుము లేకుండా మారవచ్చని ఎస్‌బీఐ తెలిపింది. కాగా, ఏప్రిల్ 1 నుంచి నెల వారీ కనీస నిల్వ లేకపోతే వసూలు చేసే ఫీజులను 75 శాతం వరకు తగ్గిస్తున్నట్లు మంగళవారం ఎస్‌బీఐ ప్రకటించిన విషయం విదితమే.



హైదరాబాద్ బిగ్-సి షోరూంలో గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ మొబైళ్లను ఆవిష్కరిస్తున్న బిగ్-సి సీఎండీ బాలు చౌదరి, సినీ నటి సమంత, శామ్‌సంగ్ ఉపాధ్యక్షుడు ఉదయ్ భట్, బిగ్-సి డైరెక్టర్లు వై.స్వప్న కుమార్, జి.బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి

బిగ్-సిలో ఎస్9, ఎస్9 ప్లస్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో శాంసంగ్ ఎస్ 9, ఎస్9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లు బిగ్-సిలో అందుబాటులోకి వచ్చాయి. కూకట్‌పల్లి బిగ్-సి షోరూంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు, సీఎండీ ఎం.బాలు చౌదరి, సినీనటి సమంత, శాంసంగ్ భారత విభాగం వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ భట్ ఈ మొబైళ్లను ఆవిష్కరించి, విపణిలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలు చౌదరి మాట్లాడుతూ.. తెలంగాణలో ఒక్క బిగ్-సిలో మాత్రమే వీటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లేదా పేటీఎం మాల్ ద్వారా కొనుగోలు చేసినప్పుడు రూ.6వేల వరకూ నగదు వెనక్కి ఇస్తున్నట్లు తెలిపారు. వీటిని కొన్నవారికి ఆఫర్లతోపాటు, శాంసంగ్ రివార్డు పాయింట్లూ లభిస్తాయని పేర్కొన్నారు. 64 జీబీ ఎస్9 ధర రూ.57,900 ఉండగా, ఎస్9ప్లస్ రూ.64,900కు లభిస్తుంది. 254 జీబీ ఫోన్లు వరుసగా రూ.65,900, రూ.72,900కు లభిస్తున్నాయి.

పారిశ్రామికాభివృద్ధికి దోహదం

తెలంగాణ బడ్జెట్‌పై ఎఫ్‌ట్యాప్సీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేసేదిలా ఉందని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ట్యాప్సీ) అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ అన్నారు. పరిశ్రమల శాఖకు రూ.1,286 కోట్లను కేటాయించడం ద్వారా ఈ రంగానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. టీఎస్ఐపాస్ కింద ఇప్పటికే దాదాపు 6200 కొత్త పరిశ్రమలు రూ.1.18 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయనీ, ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి చేస్తున్న కృషికి ఇది నిదర్శనమన్నారు. విద్యుత్ రంగానికి నిధులు కేటాయించడం ద్వారా నిర్మాణంలో ఉన్న విద్యుత్ కేంద్రాలు వేగంగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అక్కడ స్థలాల రేట్లు ఎంత ఎక్కువో

- స్థిరాస్తి ధరలు దిగిరావాలి
- ఈ రంగం పుంజుకోవడం శుభపరిణామం
- ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు

దిల్లీ



స్థిరాస్తి రంగం తిరిగి పుంజుకుంటోదన్న సంకేతాలు కనిపిస్తున్నాయని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది శుభ పరిణామమని తెలిపారు. అయితే స్థలాల ధరలు అధికంగా ఉంటుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ, మరికొన్ని ప్రాంతాల్లో స్థలాల ధరలు న్యూయార్క్, వాషింగ్టన్ స్థాయిలో ఉండటం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. స్థలాల విలువ అధికంగా ఉండటం వల్లే గృహ నిర్మాణ వ్యయం పెరిగిపోతోందని చెప్పారు. మధ్యవర్తుల చేతుల్లోనే స్థలాలు ఎక్కువగా ఉంటున్నాయని అన్నారు. ఏదేమైనా ధరల్లో దిద్దుబాటు రావాల్సిన అవసరం ఉందని ఇక్కడ జరిగిన క్రెడాయ్ వార్షిక సమావేశంలో తెలిపారు. దేశ వృద్ధిలో స్థిరాస్తి, నిర్మాణ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పించే రెండో రంగం ఇదేనని చెప్పారు. కొత్త స్థిరాస్తి చట్టం రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ)కు అనుగుణంగా ఉత్తమ ప్రమాణాల అమలుకు క్రెడాయ్ సిద్ధంగా ఉందని భావిస్తున్నాని పేర్కొన్నారు. తాను పట్టణాభివృద్ధి మంత్రిగా ఉన్న సమయంలోనే రెరా చట్టానికి ఆమోదం లభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సొంతంగా ఓ నిబంధనావళిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మోసాలకు పాల్పడేవారిని దూరం పెట్టాలని సంఘానికి సూచించారు.

నియంత్రణే ముఖ్యం..: నిర్మాణదార్లపై గృహ కొనుగోలుదార్లు కేసులు వేసిన సంఘటనలను గురించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ నిబంధనల బలోపేతం కంటే నియంత్రణ సంస్థల అవసరం ఉందని ఆయన అన్నారు. నియంత్రణ లేకుంటే విజయ్ మాల్యా, నీరవ్ మోదీ లాంటి వాళ్లు మరికొంత మంది పుట్టుకొస్తారని తెలిపారు. గృహాల కొరత అధికంగా ఉండటంపైనా ఉపరాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. అందుబాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు రానున్న నెలల్లో స్థిరాస్తి రంగ వృద్ధికి ఊతంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు గృహాలను అందుబాటులోకి తెచ్చే విషయంలో ప్రైవేట్ సంస్థలకు కీలక పాత్ర ఉందని అన్నారు. గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అనుమతులు ఆలస్యమవుతుండటంపై ఆయన మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారం స్థానిక ప్రభుత్వాల చేతిలో ఉందని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగించొద్దనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలని సూచించారు. అంతకుముందు క్రెడాయ్ అధ్యక్షుడు జాక్సే షా మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల నైపుణ్యాభివృద్ధి, వ్యర్థ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ లాంటి వాటిపై సంఘం చేపట్టిన వివిధ రకాల చర్యలను వివరించారు. అందుబాటు గృహ నిర్మాణ ప్రాజెక్టు కార్యక్రమాన్ని సంఘంలోని సభ్యులు ఇప్పటికే ముందుకు తీసుకెళ్లడాన్ని ప్రారంభించారని తెలియజేశారు.

ఈ నగరాల్లో నివాసం ఎంత చౌకో!

ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ సర్వేలో దిల్లీ, బెంగళూరు, చెన్నైలకు చోటు

దిల్లీ



ప్రపంచంలోనే నివాసానికి అత్యంత చౌకగా ఉన్న 10 నగరాల్లో బెంగళూరు (5వ స్థానం), చెన్నై (8వ స్థానం), దిల్లీ (10వ స్థానం) ఉన్నాయని ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) సర్వే తెలిపింది. అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ వరుసగా అయిదో ఏడాదీ నిలిచింది. 'ప్రపంచవ్యాప్త జీవనవ్యయం 2018 సర్వే'ను సంస్థ విడుదల చేసింది. దక్షిణాసియా దేశాల్లో ముఖ్యంగా భారత్, పాకిస్థాన్‌లలో 'ఖర్చు పెట్టే ప్రతి పైసాకు తగిన విలువ లభిస్తుంది' అని వివరించింది.

'వేగవంతమైన ఆర్థిక వృద్ధి పథంలో భారత్ ఉంది. అయితే తలసరి ఆదాయ పరంగా చూసినా, వేతనాలు, ఖర్చులో వృద్ధి మాత్రం తక్కువగానే ఉంది. వేతన వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుంటే, తక్కువ వేతనాలే ప్రమాణంగా ఉంటున్నాయి. ఇందువల్ల కుటుంబాల వ్యయం పరిమితంగా ఉంటోంది. రిటైల్ ఉత్పత్తులు కూడా అన్ని శ్రేణుల్లో లభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి చౌక ఉత్పత్తులు భారీగా నగరాలకు తరలి వస్తున్నాయి. ఇందువల్ల సరఫరా వ్యవస్థల పరిమాణం తక్కువగానే ఉంటోంది. కొన్ని ఉత్పత్తులపై ప్రభుత్వ రాయితీ వల్ల వాటి ధరలు తక్కువగా ఉంటున్నాయి' అని నివేదిక తెలిపింది.

సిరియా రాజధాని డెమాస్కస్ అత్యంత చౌక నగరం

జీవనవ్యయం అత్యంత తక్కువగా ఉన్న నగరాల్లో సిరియా రాజధాని డెమాస్కస్ తొలిస్థానంలో ఉంది. రెండోస్థానంలో వెనెజులా రాజధాని కారకాస్, మూడో స్థానంలో కజక్స్థాన్ వాణిజ్యకేంద్రం ఆల్‌మటి, నాలుగో స్థానంలో లాగోస్ ఉన్నాయి. 6వ స్థానాంలో పాకిస్థాన్‌లోని కరాచీ ఉంది. ఆల్‌గీర్స్ (7వ స్థానం), బుచారెస్ట్ (9వ స్థానం) ఇదే జాబితాలో ఉన్నాయి.

ఆహారం, నీరు, దస్తులు, వ్యక్తిగత-గృహ సంరక్షణ ఉత్పత్తులు, ఇళ్ల అద్దెలు, రవాణా, వినియోగ బిల్లులు, ప్రైవేటు పాఠశాలలు, ఇంటి సహాయకులు (పనిమనుషులు), వినోద వ్యయాల వంటి 160 రకాల ఉత్పత్తులు, సేవలను 400 ప్రాంతాల్లో పరిశీలించి, ఈ నివేదిక రూపొందించారు.

డిమాండ్ నెరవేరే వరకు పోరాటం



గురువారం దిల్లీలో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో తెరాస ఎంపీల నిరసన

9వ రోజూ కొనసాగిన ఆందోళనలు

- గందరగోళం మధ్యే బిల్లులకు ఆమోదం

ఈనాడు, దిల్లీ: పార్లమెంటులో 9వ రోజూ ఆందోళనలు కొనసాగాయి. డిమాండ్ల సాధనకోసం తెలుగుదేశం, వైకాపా, తెరాస, తృణమూల్ కాంగ్రెస్, అన్నాడీఎంకే నాయకులు ఉభయ సభల లోపల, బయట ఆందోళనలు చేపట్టారు. లోక్‌సభలో సభ్యుల ఆందోళనల మధ్యే గురువారం మధ్యాహ్నం గ్రాట్యుటీ చెల్లింపు సవరణ బిల్లు, నిర్దిష్ట ఉపశమన (సవరణ) బిల్లును ఎలాంటి చర్చ లేకుండానే సభ ఆమోదించింది. వామపక్ష సభ్యుడు ప్రేమచంద్రన్, కాంగ్రెస్ సభ్యుడు అధిర్‌రంజన్ చౌధురిలు తాము ప్రతిపాదించిన సవరణలపై ఓటింగ్ కోరినప్పటికీ.. మూజువాణి ఓటుతో బిల్లులు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. సవరణలు ప్రవేశపెట్టడానికి వీరికి అవకాశం ఇచ్చిన వెంటనే మైక్ కట్ చేయడంతో వారు ఓటింగ్‌ను కోరిన విషయం స్పీకర్‌కు వినిపించలేదు. ఇందుకు నిరసనగా సీపీఎం సభ్యులు చివరలో కాగితాలను చించి, గాల్లోకి విసిరేశారు. రాజ్యసభ కూడా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదాపడింది. సాయంత్రం రాజ్యసభలో ముఖ్యమైన ఆర్థిక, ద్రవ్య వినిమయ బిల్లులను ఆమోదించాల్సి ఉన్నందున, 5 నిమిషాలపాటు ఆందోళన విరమించాలని ఉపసభాపతి కురియన్ కోరినప్పటికీ తెదేపా, అన్నాడీఎంకే సభ్యులు పట్టించుకోలేదు. మరోవైపు చర్చలేకుండా 5నిమిషాల్లో బిల్లులు ఆమోదించడానికి తాము అనుమతించబోమని ప్రధాన ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్ చెప్పారు. ‘‘మీ నినాదాల కారణంగానే ఆర్థిక బిల్లు చేపట్టడం సాధ్యం కావడంలేదు. ఇందుకు మీదే బాధ్యత’’ అంటూ వెల్‌లో ఉన్న సభ్యులనుద్దేశించి కురియన్ వ్యాఖ్యానించారు. సభను శుక్రవారానికి వాయిదావేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలుచేయాలని తెదేపా, వైకాపా సభ్యులు పార్లమెంటు ప్రాంగణంలో ఆందోళన చేశారు. రిజర్వేషన్ల కోటా పెంపు కోసం తెరాస సభ్యులు నిరసన కొనసాగించారు.



లోక్‌సభలో తెరాస, తెదేపా ఎంపీల ఆందోళన

లోక్‌సభ అజెండాపై కాంగ్రెస్ నిరసన: లోక్‌సభ కార్యకలాపాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. గురువారం సభాపతి సుమిత్రా మహాజన్ ఛాంబర్‌లో వచ్చే వారం లోక్‌సభలో చేపట్టాల్సిన అజెండాను నిర్ణయించేందుకు సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) భేటీ అయ్యింది. వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ నెల 5వ తేదీ నుంచి వివిధ పార్టీల సభ్యుల ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతో సభ నిర్వహణ ముందుకు సాగలేదు. అయినప్పటికీ బుధవారం ప్రభుత్వం ఆర్థిక బిల్లును, నిధుల కేటాయింపుల బిల్లులను చర్చించకుండానే ఆమోదించిందంటూ కాంగ్రెస్ డిప్యూటీ చీఫ్‌విప్ కేసీ వేణుగోపాల్ అభ్యంతరం తెలుపుతూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు.

• రిజర్వేషన్లపై పార్లమెంటు సెంట్రల్ హాలులో తెరాస ఎంపీల నిరసన

ఈనాడు, దిల్లీ: రిజర్వేషన్ల అమలులో రాష్ట్రాలకే హక్కులుండాలని డిమాండ్ చేస్తూ తెరాస ఎంపీలు గురువారం సరికొత్తగా నిరసన తెలిపారు. లోక్‌సభాపక్ష నేత జితేందర్ రెడ్డి నేతృత్వంలో ఉపనేత వినోద్‌కుమార్, ఎంపీలు కల్వకుంట్ల కవిత, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్, పి.దయాకర్, బీబీపాటిల్, మల్లారెడ్డి పార్లమెంటు సెంట్రల్ హాలులో నిరసన చేపట్టారు. తెదేపా సహా పలువురు ఎంపీలు వారికి మద్దతు పలికారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుమన్ మీడియాతో మాట్లాడారు. ‘పార్లమెంటు సెంట్రల్ హాలులో నిరసన తెలపడం ఇదే తొలిసారి. దేశం మొత్తం వేర్వేరు రిజర్వేషన్లు ఉండకూడదు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. భాజపాపాలిత రాష్ట్రాలు కూడా అడుగుతున్నాయి. కేంద్రానికి అర్థమవడం లేదా మొండి వైఖరా తెలియడం లేదు. దళితులు, బీసీలు, మైనార్టీల విషయంలో కేంద్రం దున్నపోతుమీద వానపడ్డట్లు వ్యవహరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల కోసం తెరాస పోరాటాన్ని కేంద్రం అర్థం చేసుకోవాలి. కేంద్రం దిగివచ్చే వరకు నిరసన కొనసాగిస్తాం’’ అని తెలిపారు. తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రిజర్వేషన్ల పెంపు, ఎయిమ్స్ తదితర అంశాలను బీఏసీ సమావేశం దృష్టికి తీసుకెళ్లానన్నారు. అత్యవసర బిల్లులపై చర్చలకు సహకరించాలని సభాపతి సుమిత్రా మహాజన్ కోరారన్నారు. తమకిచ్చిన హామీలు అమలు చేస్తే సభ సజావుగా సాగడానికి సహకరిస్తామని సభాపతికి చెప్పానన్నారు.

కేంద్ర మంత్రి గెహ్లోత్‌తో భేటీ

యూనివర్సిటీల్లోని అధ్యాపకుల పోస్టుల విషయంలో రిజర్వేషన్ల అమలుకి వర్సిటీని కాకుండా విభాగాన్ని యూనిట్‌గా తీసుకోవాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయించడాన్ని తెరాస ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, సుమన్, దయాకర్ ఖండించారు. దీనివల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు నష్టపోతారని గురువారం పార్లమెంటులో కేంద్ర మంత్రి తావర్‌చంద్ గెహ్లోత్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాను మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు ఇప్పటికే లేఖ రాశానని ఆయన చెప్పారన్నారు.

ప్రత్యేకహోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పలేదు: ఇంద్రజిత్‌సింగ్

ఈనాడు, దిల్లీ: దేశంలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేకహోదా కట్టబెట్టవద్దని 14వ ఆర్థిక సంఘం తన సిఫార్సుల్లో ప్రత్యేకంగా ఎక్కడా చెప్పలేదని కేంద్ర ప్రణాళిక శాఖ మంత్రి రావు ఇంద్రజిత్‌సింగ్ వెల్లడించారు. రాష్ట్రాలకు పంచే కేంద్ర పన్నుల వాటాలో ప్రత్యేక, సాధారణ కేటగిరీ రాష్ట్రాల మధ్య ఉండే తేడాను తొలగించినట్లు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికైనా ప్రత్యేకహోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందా? దీని కిందకు పారిశ్రామిక రాయితీలు కూడా వస్తాయా? అని తెదేపా సభ్యుడు సీఎం రమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర మంత్రి పైమేరకు సమాధానం ఇచ్చారు. తద్వారా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పలేదని కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించినట్లయింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2015-20 మధ్యకాలానికి కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటాను 32% నుంచి 42%కి పెంచినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. దీని వల్ల రాష్ట్రాలకు మరిన్ని వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. పన్నుల వాటా పంపిణీ ద్వారా రాష్ట్రాలకు ఎదురయ్యే వనరులను సాధ్యమైనంత మేర భర్తీ చేయడమే దీని ఉద్దేశమని చెప్పారు. కేవలం పన్నుల వాటా వల్ల వనరుల లోటు భర్తీ కాని రాష్ట్రాలకు రెవెన్యూలోటు గ్రాంట్లు కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రణాళిక మద్దతుకు ఇది వరకు జాతీయ అభివృద్ధి మండలి కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేకహోదా ఇచ్చిందని, దాని పరిధిలోకి పారిశ్రామిక రాయితీలు రావని పేర్కొన్నారు.

కందుల కొనుగోలుకు సహకారమేదీ

- కేంద్రం వాటా నిధుల విడుదలలోనూ జాప్యమే
- మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు ఆవేదన
- కేంద్ర మంత్రులతో భేటీ

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో ఉత్పత్తి అయిన కందుల కొనుగోలు అంశంలో కేంద్ర సహకారం తక్కువగా ఉంటోందని నీటిపారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారమిక్కడ ఎంపీలు జితేందర్‌రెడ్డి, బీబీ పాటిల్, కొత్త ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఆయన కేంద్రమంత్రులు రాధామోహన్‌సింగ్, నితిన్ గడ్కరీలతో భేటీ అయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ బ్యాంకు గ్యారెంటీ ఇవ్వడం వల్ల రాష్ట్రంలో రూ.1,400 కోట్ల విలువైన కందులు కొనుగోలు చేయగలిగామన్నారు. 2,54,000 మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రం కొనుగోలు చేయగా..అందులో కేవలం 75వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొనుగోలు చేసిందన్నారు. దానికి సంబంధించి రూ.400కోట్లు ఇవ్వాల్సి ఉండగా..ఇప్పటివరకు రూ.220 కోట్లు మాత్రమే విడుదలైనట్లు చెప్పారు. మిగతా రూ.180కోట్లు విడుదలచేయాలని కేంద్ర మంత్రికి విన్నవించగా..మూడు రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. శనగల కొనుగోలుకు సంబంధించిన నిధుల అంశాన్ని ప్రస్తావించగా..శుక్రవారం నాటికి విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. మినుములు, పొద్దుతిరుగుడు, పెసర ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని కోరగా.. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



దిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన మంత్రి హరీశ్‌రావు, తెరాస ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్, బీబీ పాటిల్

రివర్ నావిగేషన్ అంశంపై చర్చ: తెలంగాణ రివర్ నావిగేషన్ అంశంపై కేంద్ర నౌకాయాన మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్లు హరీశ్‌రావు ఈ సందర్భంగా తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి మీదుగా ప్రాణహిత వరకు..విదర్భ నుంచి సముద్ర ప్రయాణానికి సంబంధించిన నావిగేషన్ సదుపాయంపై చర్చించామన్నారు. దీనిపై ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని, డీపీఆర్ తయారు చేయాలని కేంద్రమంత్రి సూచించారని వివరించారు. మిషన్ కాకతీయలో భాగంగా రూ.185 కోట్లతో 176 చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లగా..నిధులు మంజూరుకై అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టుకూ నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు.

బ్యాంకు హామీలపై నిబంధనల సడలింపు

జిన్నింగ్, రైస్ మిల్లుల యజమానుల ప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు సమావేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జిన్నింగ్, రైసు మిల్లుల యజమానులు లావాదేవీలను బట్టి వ్యవసాయ మార్కెట్ కమిటీకి బ్యాంకు గ్యారంటీ(హామీ)లను సమర్పించాలన్న నిబంధనను మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు సడలించారు. అసెంబ్లీ హాలులో గురువారం జిన్నింగ్, రైస్ మిల్లుల యాజమానుల సంఘాల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. కోటి రూపాయల లావాదేవీలున్నవారు రూ.5లక్షలు, అది దాటితే రూ.10లక్షల బ్యాంకు గ్యారంటీ చెల్లించాలని ఉన్న నిబంధనతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కోటి రూపాయల లావాదేవీలు చేసే వారు రూ.50వేలు, కోటిపైగా ఉంటే రూ.లక్ష, ఐదుకోట్లు దాటితే రూ.2లక్షల గ్యారంటీ సమర్పించాలని మినహాయింపులు ఇచ్చారు. మరోవైపు బ్యాంకు గ్యారంటీ జీవోకు వ్యతిరేకంగా కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకోవాలని మంత్రి పెట్టిన షరతుకు ప్రతినిధులు అంగీకరించారు. కొందరు మార్కెటింగ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ కమీషన్ వసూలు చేస్తూ రైతులను పీడిస్తున్నారని.. దీనికి స్వస్తి చెప్పని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి ఈటల రాజేందర్‌పై కొందరు కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా చేసిన ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టలేకపోయారని మిల్లర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విధానాల వల్ల మూతపడిన 700 రైస్‌మిల్లులు తెరుచుకున్నాయని, ఇప్పుడిప్పుడే వ్యాపారులు కోలుకుంటున్నారని మంత్రికి వివరించారు. అనుమతిస్తే త్వరలోనే లక్షమందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని చెప్పారు. సానుకూలంగా స్పందించిన హరీశ్‌రావు ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

కందిరైతులకు బకాయిలు చెల్లించాలి

కందిరైతుల బకాయిల చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్, హాకా, నాఫెడ్ సంస్థలను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. అసెంబ్లీ కమిటీ హాలులో గురువారం కందులు, మినుములు, సెనగల కొనుగోళ్లు, చెల్లింపులపై మరో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రైతుల నుంచి రూ.వెయ్యికోట్ల విలువచేసే కందులు కొనుగోలు చేసి రూ.600కోట్లే చెల్లించిందని, మిగిలింది ఇవ్వాల్సి ఉందని అధికారులు వివరించారు. దీంతో ఏజెన్సీల పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన మంత్రులు, వెంటనే చెల్లింపులు చేయాలని ఆదేశించారు.

26 వరకు కార్తీని ఈడీ అరెస్టు చేయకుండా సుప్రీం ఆదేశాలు

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా అక్రమ నగదు చలామణీ కేసులో కార్తీ చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయకుండా దిల్లీ హైకోర్టు కల్పించిన రక్షణను.. సుప్రీం కోర్టు మరింతకాలం పొడిగించింది. ఈడీ అరెస్టు అధికారంపై వివిధ హైకోర్టుల భిన్నాభిప్రాయాలతో నెలకొన్న అయోమయాన్ని.. ఈ సమయంలో తొలగిస్తామని వ్యాఖ్యానించింది. దిల్లీ హైకోర్టు కార్తీకి అరెస్టు నుంచి మార్చి 22 వరకు రక్షణ కల్పించగా.. సుప్రీం ఈ వ్యవధిని మార్చి 26 వరకు పొడిగించింది. ఈడీ అధికారాలపై దిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలతోపాటు ఈడీ అరెస్టు నుంచి రక్షణ కోరుతూ కార్తీ దాఖలు చేసిన పిటిషన్ విచారణలను.. సుప్రీం కోర్టు తనకుతాను బదలాయించుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. ఈడీ అధికారాలకు సంబంధించి అక్రమ నగదు చలామణీ నిరోధక చట్టంలోని సెక్షన్-19 విషయంలో తలెత్తిన సందేహాలకు.. ఈడీ అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ హైకోర్టులు ఉత్తర్వులు జారీ చేయవచ్చా అన్న ప్రశ్నలకు సుప్రీం బదులిస్తుందని స్పష్టం చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థ విదేశీ పెట్టుబడుల స్వీకరణకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ అయ్యేలా చేసేందుకు.. మాజీ కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ ముడుపులు స్వీకరించారని ఆరోపిస్తూ సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్తీ జైల్లోనే ఉన్నారు.

చారీలాం అసెంబ్లీ ఎన్నికలో త్రిపుర ఉపముఖ్యమంత్రి గెలుపు

అగర్తలా: త్రిపురలోని చారీలాం (ఎస్టీ రిజర్వ్‌డ్) అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జిష్ణు దేబ్‌బర్మన్ ఘనవిజయం సాధించారు. ఎన్నికలో ఆయనకు 26,580 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి పలాష్ (సీపీఎం)కు కేవలం 1,030 ఓట్లే వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి అర్జున్‌కు 775 ఓట్లు పడ్డాయి. తాజా ఫలితంతో రాష్ట్ర అసెంబ్లీలో భాజపా బలం 36 సీట్లకు చేరుకుంది. ఒక్క చారీలాం తప్పితే.. మిగతా 59 అసెంబ్లీ సీట్లకూ ఫిబ్రవరి 18న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. పోలింగ్‌కు ముందు సీపీఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ మృతిచెందడంతో.. చారీలాం ఎన్నిక అప్పుడు వాయిదాపడింది.

ఇక అత్యంత కచ్చితమైన తర్జుమా

కృత్రిమ మేధో వ్యవస్థను ఆవిష్కరించిన మైక్రోసాఫ్ట్

వాషింగ్టన్: కంప్యూటర్ తర్జుమా ప్రక్రియలో ఇదో మైలురాయి! అచ్చం మనిషిలాగే... అత్యంత స్పష్టతతో, కచ్చితత్వంతో మాండరిన్ (చైనీస్) నుంచి ఆంగ్లంలోకి అనువదించే కృత్రిమ మేధో వ్యవస్థను రూపొందించింది... సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్! ఇది చైనీస్ వార్తలను అత్యంత సహజంగా ఆంగ్లంలోకి తర్జుమా చేస్తున్నట్లు పరిశోధకుడు జుదాంగ్ హుయాంగ్ వెల్లడించారు. ఒక భాషలోని ‘పదార్థాల’ను ఉన్నది ఉన్నట్టుగా విభిన్న భాషల్లోకి మార్చడం ఐటీ రంగానికి దశాబ్దాలపాటు సవాలుగానే నిలిచింది. అయితే...‘‘సాధారణంగా ప్రజలకు ఆసక్తి కలిగించే వార్తలు, విశేషాలకు సంబంధించి చైనీస్, ఆంగ్లంలో ఉన్న పదబంధాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశాం. సందర్భానుసారంగా ఏయే పదాలను వాడాలన్న సూచనలతో ప్రోగ్రాం రాశాం. కచ్చితత్వం కోసం మరిన్ని టెక్నిక్స్‌ను అభివృద్ధిచేశాం. ఎట్టకేలకు అత్యంత సహజమైన రీతిలో భాషాంతర సాంకేతికతను సాధించాం’’ అని మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ (ఏషియా) ముఖ్య పరిశోధక నిర్వాహకుడు టై-యాన్ లీ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని భాషలకు ఈ సాంకేతికతను విస్తరించే వీలుందని భావిస్తున్నారు.

ఆర్జేడీ గెలుపుతో అది ఉగ్రవాద కేంద్రమవుతుంది!

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

దిల్లీ: బిహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానంలో ఆర్జేడీ గెలుపుపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గురువారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడీకి చెందిన సర్ఫ్‌రాజ్ ఆలమ్ విజయం సాధించిన నేపథ్యంలో అరారియా ‘ఉగ్రవాద కేంద్రం’గా మారుతుందని.. దీంతో బిహార్‌కే కాకుండా దేశానికే ముప్పువాటిల్లుతుందని ఆరోపించారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ‘‘ఆర్జేడీ కొత్త సంస్కృతిని ప్రారంభించింది.. తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చెందిస్తోంది..’’ అంటూ వ్యాఖ్యలు చేశారు. భాజపా నేత గిరిరాజ్ సింగ్ గతంలోనూ కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాగా సింగ్ వ్యాఖ్యలను ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ గట్టిగా తిప్పికొట్టారు. ‘‘ఆయన కేంద్ర మంత్రి.. దురదృష్టవశాత్తూ బిహార్, దిల్లీలనూ తామే పరిపాలిస్తున్న విషయం ఆయనకు తెలియనట్లుంది. ఆయనకు లేదా భాజపాకు బిహార్‌లోని నీతీశ్ ప్రభుత్వంపై నమ్మకం లేకపోతే దిగిపొమ్మని చెప్పడం లేదా మద్దతు ఉపసంహరించడం చేయాలి. అది నీతీశ్‌కు సిగ్గుచేటు..’’ అంటూ ధ్వజమెత్తారు.

‘ట్రంప్‌తో ఒప్పందం’ రద్దుకు... కోర్టుకెక్కిన శృంగార తార!

లాస్ ఏంజెలిస్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తన ‘అన్యోన్యత’ను బయటపెట్టకుండా కుదిరిన ఒప్పందం రద్దు కోరుతూ... శృంగార తార స్టార్మీ డానియెల్స్ కోర్టుకెక్కారు! దీనిపై స్థానిక న్యాయస్థానం జులై 12న విచారణ చేపట్టనుంది. ఆమె అసలు పేరు స్టెఫనీ క్లిఫోర్డ్. 2006 వేసవిలో ట్రంప్‌తో తనకు అన్యోన్యత ఏర్పడిందనీ, మరుసటి ఏడాదివరకూ ఆ బంధం కొనసాగిందని ఆమె తన వ్యాజ్యంలో ఆరోపించారు. తమ మధ్య సంబంధంపై మౌనం వహించేందుకు అధ్యక్ష ఎన్నికల ముందు 1,30,000 డాలర్లకు ఒప్పందం కుదిరిందంటూ... దానికి సంబంధించిన పత్రాన్ని జతచేశారు. తమ మధ్య జరిగిన రాతపూర్వక సంభాషణను బహిర్గతం చేసేందుకు అనుమతించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే... ట్రంప్-డానియెల్స్ మధ్య ఎలాంటి లైంగిక సంబంధాలు లేవని శ్వేతసౌధం కొట్టిపారేసింది. కావాలంటే 1,30,000 డాలర్లను ఇచ్చి, గతంలో ట్రంప్‌తో తనకున్న సంబంధాలపై మాట్లాడుకోవచ్చని డానియెల్స్‌కు సూచించింది. ‘ఆమె నోరు విప్పాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నా. ఎవరు నిజాలు మాట్లాడుతున్నారో ఆ తర్వాత ప్రజలే నిర్ణయించుకుంటారు’ అని డానియెల్స్ న్యాయవాది వ్యాఖ్యానించారు.

ట్రంప్ ఆర్థిక సలహాదారుగా లేరీ కడ్లో

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆర్థిక సలహాదారుగా టీవీ వార్తల ప్రయోక్త.. లేరీ కడ్లో (70) నియమితులుకానున్నారు. ఈ విషయాన్ని గురువారం ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఆర్థిక సలహాదారు పదవికి రాజీనామా చేసిన గ్యారీ కొహెన్ స్థానంలో కడ్లో బాధ్యతలు చేపడతారు. అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై ట్రంప్ భారీగా సుంకం విధించటాన్ని వ్యతిరేకిస్తూ కొహెన్ పదవి నుంచి తప్పుకున్నారు. 2016లో అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో డోనాల్డ్ ట్రంప్‌నకు అనధికార ఆర్థిక సలహాదారుగా కడ్లో పనిచేశారు. అమెరికాకు దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై సుంకం విధింపునకు కడ్లో కూడా వ్యతిరేకి. అయితే, భిన్నాభిప్రాయం కలిగి ఉండటాన్ని తాను స్వాగతిస్తానంటూ కడ్లో ఎంపికను ట్రంప్ సమర్థించుకున్నారు. రీగన్ ప్రభుత్వ హయాంలోనూ ఆర్థిక విధానాల రూపకల్పనలో కడ్లో తన సేవలను అందించారు.

ఏకమవుతున్న విపక్షాలు!

భాజపాకు వ్యతిరేకంగా ఐక్య కూటమికి పిలుపు

శరద్ పవార్‌తో రాహుల్ గాంధీ భేటీ

ఐక్య వేదికకు బీఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ మద్దతు

లఖ్‌నవూ, ముంబయి, దిల్లీ: ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌ల్లో జరిగిన ఉప ఎన్నికల్లో భాజపాకు ఎదురుదెబ్బలు తగలడం విపక్షాలకు ఉత్సాహాన్నిస్తోంది! 2019 సార్వత్రిక ఎన్నికల్లో కమలనాథులను కలిసికట్టుగా ఎదుర్కొనే దిశగా వారు అడుగులు వేస్తున్నట్లే కనిపిస్తోంది. ఐక్య ప్రతిపక్ష వేదిక ఏర్పాటుకోసం పలు ప్రతిపక్ష పార్టీలు గురువారం పిలుపునిచ్చాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో చర్చలు జరిపారు. కేంద్రంలో భాజపాకు మరోసారి అధికారం దక్కకుండా అడ్డుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి ప్రజలకు పిలుపునిచ్చారు. చండీగఢ్‌లో గురువారం ఆమె ఓ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. భాజపాను ఓడించేందుకే గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ ఉప ఎన్నికల్లో తాము సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి మద్దతిచ్చామని వెల్లడించారు. భాజపా ముందస్తు సార్వత్రిక ఎన్నికలకు వెళ్లే అవకాశముందని ఆమె సూచించారు. మరోవైపు, ఉప ఎన్నికల ఫలితాలు విపక్షాలకు ఉత్సాహాన్నిస్తున్నాయని శివసేన అభిప్రాయపడింది. ప్రజలు ఊహా ప్రపంచం నుంచి ప్రస్తుతం బయటకొచ్చారని వ్యాఖ్యానించింది. పార్టీ పత్రిక ‘సామ్నా’లో ఈ మేరకు సంపాదకీయం వెలువరించింది. విపక్షాల ఐక్య వేదిక భాజపాను ఓడించగలదని తాజా ఫలితాలు నిరూపించాయని ఎన్సీపీ పేర్కొంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లౌకికవాదుల ఓట్లు చీలవని.. ఫలితంగా భాజపా ఓటమి తప్పదని ఎన్సీపీ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ వ్యాఖ్యానించారు. ఉపఎన్నికల్లో భాజపా ఓటమిపై ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ స్పందిస్తూ.. భాజపాను మునిగిపోతున్న పడవగా అభివర్ణించారు. భాజపాకు పోటీగా ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టడమే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించదగిన అత్యుత్తమ వ్యూహమని సీపీఐ అభిప్రాయపడింది.

శరద్ పవార్‌తో రాహుల్ చర్చలు: ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం రాత్రి సమావేశమయ్యారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ ఉపఎన్నికల్లో భాజపా ఓటమిపాలైన కొన్నిగంటల్లోనే పవార్ నివాసానికి రాహుల్ వెళ్లారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం భాజపాకు వ్యతిరేకంగా ఐక్య వేదికను ఏర్పాటుచేయడంపై వారిరువురు చర్చించినట్లు కాంగ్రెస్‌వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీతో కూడా రాహుల్ త్వరలోనే భేటీ అయ్యే అవకాశాలున్నట్లు సమాచారం. శరద్ పవార్ ఈ నెల 28న నిర్వహించనున్న విపక్షాల సంయుక్త సమావేశానికి మమత హాజరవుతారని అంచనా.

కాన్షీరాంకు రాహుల్ నివాళులు: బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి సందర్భంగా రాహుల్ ఆయనకు గురువారం నివాళులర్పించారు. కాన్షీరాంను గొప్ప సంఘ సంస్కర్తగా ట్విటర్‌లో అభివర్ణించారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని అఖిలేశ్.. బీఎస్పీకి అభినందనల సందేశం పంపారు.

బీఎస్పీతో గతం గతః.. అఖిలేశ్: బీఎస్పీతో తమకున్న శత్రుత్వాన్ని సమాధి చేసే దిశగా సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ సంకేతాలిచ్చారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ ఉపఎన్నికల్లో ఎస్పీ విజయంతో ఉత్సాహంగా ఉన్న అఖిలేశ్ లఖ్‌నవూలో విలేకర్లతో గురువారం మాట్లాడారు. బీఎస్పీతో శత్రుత్వాన్ని ఉద్దేశించి.. గతంగతః అన్నారు. ఆ పార్టీతో ఉన్న చేదు అనుభవాలను చాలా మంది ప్రస్తుతం గుర్తుచేస్తున్నారని. . అయితే, కొన్నిసార్లు గతాన్ని మర్చిపోవాల్సి ఉంటుందన్నారు.



విలేకర్ల సమావేశంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రవీణ్ నిషాద్, నాగేంద్ర ప్రతాప్‌సింగ్ పటేల్‌తో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

మళ్లీ వామపక్ష మధ్యేవాదం వైపు!

- ఆర్థిక సంస్కరణలపై కాంగ్రెస్ పునరాలోచన
- నెహ్రూకాలం నాటి విధానంపై కొందరి మొగ్గు
- సార్వత్రిక ఎన్నికల వ్యూహంపైనా సమాలోచన
- నేటి నుంచి మూడురోజుల పాటు దిల్లీలో పార్టీ ప్లీనరీ
- ఈసారి కార్యకర్తల వాణికి పెద్దపీట

ఈనాడు, దిల్లీ: ఆర్థిక సంస్కరణలపై ఎలాంటి వైఖరి అనుసరించాలనే అంశంతో పాటు రాజకీయ వ్యూహాలను ఖరారు చేయడానికి మూడురోజుల పాటు జరిగే కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో దీనిని నిర్వహించనున్నారు. మునుపెన్నడూ లేని రీతిలో నాయకుల ప్రసంగాల కంటే కార్యకర్తల వాణి వినడానికే ఈసారి పెద్దపీట వేయబోతున్నారు. పార్టీ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టాక జరుగుతున్న తొలి ప్లీనరీ సమావేశాలు ఇవే. భాజపాని గద్దె దించడం లక్ష్యంగా పార్టీ దార్శనికతను ఆయన ఈ వేదికపై ఆవిష్కరించి, శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. పొత్తులపై విధానాన్ని ప్లీనరీలో ఖరారు చేస్తారు. రాజకీయ, ఆర్థిక, విదేశీ విధానాలతో పాటు వ్యవసాయం- నిరుద్యోగం- పేదరిక నిర్మూలనపై విడిగా ఒక తీర్మానాన్ని చేయనున్నారు.

ఆర్థిక సంస్కరణలపై భిన్నాభిప్రాయాలు

ఆర్థిక సంస్కరణల్ని పూర్తిగా విడనాడి నెహ్రూ కాలం నాటి ‘వామపక్ష మధ్యే వాద’ (లెఫ్ట్ ఆఫ్ ది సెంటర్) విధానానికి మరలిపోవడం మంచిదా అనే కోణంలో ప్లీనరీలో తర్కించనున్నారు. దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు నేతృత్వంలో 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. స్వేచ్ఛా ఆర్థిక విధానాలపై పునరాలోచించాల్సిన అవసరం ఉందని... గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారు, కార్మిక సంఘాల నేపథ్యం ఉన్నవారు ఒత్తిడి తెస్తున్నారు. రైతులకు, కార్మికులకు అనుకూలంగా ఉండే వామపక్ష మధ్యే వాదం వైపు మళ్లాలని వారు గట్టిగా చెబుతున్నారు. దీనిపై నేతల అభిప్రాయాలను పార్టీ తెలుసుకుంటోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక విధానంలో మార్పునకు పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అనుకూలంగా ఉన్నారని పార్టీ నాయకుడొకరు చెప్పారు. ఆర్థిక విధానాలపై అభిప్రాయాన్ని మార్చుకోవడం అంత సులభం కాదనే వాదనా ఉంది. మోదీ సర్కారుపై అసంతృప్తితో ఉన్న పట్టణ ప్రాంత మధ్యతరగతి వర్గాలు భాజపాయేతర పార్టీలవైపు చూస్తున్నాయనీ, ఇలాంటి తరుణంలో పార్టీ మళ్లీ నెహ్రూ కాలం నాటి సామ్యవాదం వైపు మళ్లితే ఆ వర్గాలకు దూరమవుతామని కొన్నివర్గాలు వాదిస్తున్నాయి.

‘కాషాయీకరణ’పై గళం

ప్రభుత్వంలోని ముఖ్యమైన సంస్థల ‘కాషాయీకరణ’ జరుగుతోందంటూ ప్లీనరీలో కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేయనుంది. విభజనవాద అజెండాను ప్రతిఘటిస్తూ పోరాడాలని పిలుపునివ్వనుంది. సమాజంలో పెరుగుతున్న అసహనంతోపాటు మరో మూడు అంశాలను ప్లీనరీలో ప్రధానంగా చర్చించనుంది. రైతుల సమస్యలు, నిరుద్యోగం, ఇంధన ధరల పెరుగుదలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటం ఆరంభించాలని నిర్ణయం తీసుకోనుంది. ‘మైనార్టీలపై అసహనం’ అంశంపై పార్టీ చర్చించబోవడం లేదు. ఈ అంశాన్ని లేవనెత్తితే భాజపాకే ప్రయోజనం కలగవచ్చని కాంగ్రెస్ అంతర్గత వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ విషయాన్ని ప్రస్తావించకున్నా.. కాంగ్రెస్ పట్ల మైనార్టీలకు విశ్వాసం సన్నగిల్లదని తెలిపాయి. నీరవ్ మోదీ కుంభకోణం, రాఫెల్ జెట్ విమానాల ఒప్పందం, విదేశాలతో సంబంధాలు వంటి అంశాలపై ప్లీనరీలో చర్చించనున్నట్లు తెలిపారు.

సీడబ్ల్యూసీ ఎంపిక అధికారం రాహుల్‌కే..

పార్టీ నూతన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుల ఎంపిక అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకే అప్పగిస్తూ ప్లీనరీ నిర్ణయం తీసుకోనుంది. ఎంపిక కోసం అంతర్గత ఎన్నికలను నిర్వహించాలా లేదా సంప్రదాయ పద్ధతిలోనే సభ్యులను నియమించాలా అన్న విషయంపై రాహుల్ నిర్ణయం తీసుకుంటారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సీడబ్ల్యూసీ కూర్పును ప్లీనరీలోనే చేస్తారా, విడిగానా అనేది స్పష్టం కాలేదు. కాంగ్రెస్ నియమావళి ప్రకారం.. సీడబ్ల్యూసీకి సగం మంది (12) సభ్యులను బ్యాలెట్ విధానంలో ఎన్నుకోవాలి. మిగతా సగం మందిని అధ్యక్షుడు నామినేట్ చేయొచ్చు. మొత్తం సభ్యులనూ అధ్యక్షుడు నామినేట్ చేసేందుకు పార్టీ అనుమతిస్తూ వస్తోంది. ఎన్నికలు నిర్వహించినా.. అధ్యక్షుడి అభిమతం ప్రకారమే సభ్యులు ఎంపిక కావడం రివాజు.

కాంగ్రెస్ పేలవ ప్రదర్శన

- యూపీ ఉప ఎన్నికల్లో దక్కని ధరావతులు
- ఎస్పీతో కూటమి కట్టినా బేరమాడలేని స్థితి

ఈనాడు, దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం ధరావత్తు సొమ్మునైనా రాబట్టుకోలేకపోవడంతో రేపొద్దున ఇతర పార్టీలతో ఏర్పడే కూటమిపైనా ప్రభావం చూపించేలా ఉంది. కాంగ్రెస్ పరిస్థితి మరీ పేలవంగా ఉండడంతో ఆ పార్టీకి మునుపటి మాదిరిగా పెద్దసంఖ్యలో సీట్లు కేటాయించే పరిస్థితి కనిపించడం లేదు. గోరఖ్‌పూర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కి కేవలం 17,000 ఓట్లు వచ్చాయి. ఇది మొత్తం ఓట్లలో 2%. ఫూల్‌పూర్‌లో ఇంతకంటే కాస్త ఎక్కువగా 19,334 (అంటే 2.64%) ఓట్లు లభించాయి. అక్కడ అతీఖ్ అహ్మద్ అనే స్వతంత్ర అభ్యర్థికి 48,087 ఓట్లు రావడాన్ని బట్టి చూస్తే కాంగ్రెస్ ఎంతగా ప్రాభవాన్ని కోల్పోయిందో అర్థమవుతుంది. ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులకు బీఎస్పీ మాదిరిగా కాంగ్రెస్ కూడా మద్దతు ఇవ్వాలనే ప్రతిపాదన తొలుత వచ్చింది. దానికి కాంగ్రెస్ నిరాకరించింది. 2017 యూపీ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 102 స్థానాలను ఎస్పీ కేటాయించింది. వీటిలో కేవలం 7 చోట్ల కాంగ్రెస్ గెలిచింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తును కొనసాగించాలని భావించినా కాంగ్రెస్‌కి ఎస్పీ 25-30 స్థానాలను మించి ఇచ్చే అవకాశాల్లేవు. తదుపరి ఎన్నికల్లో భాజపాయేతర పార్టీలతో కుదుర్చుకోవాల్సిన పొత్తులపైనా కాంగ్రెస్ ప్లీనరీ చర్చించనుంది.



ఇవే టాప్

- మారుతిసుజుకీ విటారా బ్రెజ్జా (11,620)- ధర: రూ. 7.38లక్షలు
- మహీంద్రా స్కార్పియో (4,851)- ధర: రూ. 9.92లక్షలు
- హ్యుందాయ్ క్రెటా (9,278)- ధర:రూ. 9.28లక్షలు
- ఫోర్డ్ ఎకోస్పోర్ట్ (5,438)- ధర:రూ. 7.31లక్షలు
- హోండా డబ్ల్యూఆర్-వీ (3,364)- ధర:7.8లక్షలు
- టాటా నెక్సాన్ (4,163)- ధర:5.95లక్షలు
- టయోటా ఫార్చునర్ (1,961) - ధర: 26 లక్షలు
- జీప్ కంపాస్ (1,941)- ధర: 15.21లక్షలు

(ధరలు: ఎక్స్ షోరూం,
అమ్మకాలు: ఫిబ్రవరి 2018)

చూడ్డానికి స్టైలిష్‌గా ఆకట్టుకునేలా ఉండాలి... గేర్ వేశామంటే క్షణాల్లో వందమైళ్ల వేగం అందుకోవాలి...

సౌకర్యాల విషయంలో రాజీ పడేదే లేదు... ఇదీ ఈతరం కారు కొనుగోలుదారుల మాట...

ఆ మైండ్‌సెట్ మురిపించేలా రోజుకో స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం మార్కెట్లోకి దూసుకొస్తోంది...

చిన్నకార్లు చిన్నబోయేలా ఎస్‌యూవీల అమ్మకాలు జోరందుకుంటున్నాయి...

క్రాసోవర్లూ.. సందడి చేస్తున్నాయి... భారత్ సహా చాలా దేశాల్లో ఇదే ట్రెండ్ ఊపు మీదుంది అంటోంది ఆటోమొబైల్ రంగానికి సంబంధించిన ప్రముఖ అధ్యయనసంస్థ 'జాటో డైనమిక్స్'... ఆ విశేషాలు రయ్‌రయ్‌న ఈవారం.



ఎస్‌యూవీకే సై..

ఆకర్ష.. ఆకర్ష!

రివర్స్ గేర్‌లో పదేళ్లు వెనక్కి వెళ్తే భారతీయ మార్కెట్లో కనిపించే ఎస్‌యూవీలు అరుదు. ఉన్నా చిన్నకార్లతో పోలిస్తే ధర ఎవరికీ అందనంత ఎత్తులో ఉండేది. ప్రస్తుతం ఈ సీన్ మారుతోంది. తక్కువ ధరలోనే కోరుకున్న ఫీచర్లతో పరుగులు పెట్టే ఎస్‌యూవీలు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. లక్ష ఎక్కువైనా ఫర్వాలేదు ఫీచర్లు జబర్దస్త్‌గా ఉండాలి అనుకునేవాళ్ల కోసం ఆటోమొబైల్ కంపెనీలు వరుసబెట్టి మోడళ్లు దించేస్తూనే ఉన్నారు. అందుకేమరి గతేడాది మొత్తం కార్ల అమ్మకాల వృద్ధి పదిశాతంలోపు నమోదైతే.. ఎస్‌యూవీలు ముప్ఫైశాతం వేగంతో దూసుకెళ్లి ఏడులక్షల అరవై రెండు వేలు అమ్ముడయ్యాయి. వచ్చే మూడేళ్లలో ఇవి నాలుగింతలవుతాయని అంచనా. భారత ఆటోమొబైల్ వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) లెక్కలివి.

ఎస్‌యూవీ ఇప్పుడో బజ్‌వర్డ్. ఎక్కడ విన్నా ఎస్‌యూవీనే. అందరి మనసూ ఎస్‌యూవీపైనే. ఎంటట ఇందులో గొప్ప? అంటే చాలానే ఉన్నాయ్! ఆకట్టుకునే ఆకృతి.. ఎక్కువ సీట్ల సామర్థ్యం.. మెరుగైన గ్రౌండ్ క్లియరెన్స్.. అన్నీ మెచ్చేవే. స్టీరింగూ ఎత్తులో ఉండటంతో రోడ్డు స్పష్టంగా కనిపిస్తుంది. పెద్ద టైర్లు.. శక్తివంతమైన ఇంజిన్, మేటి ఫీచర్లుండటంతో హైవేల్లోనే కాదు.. కొండలోయలు, మట్టిరోడ్లపైనా దూసుకెళ్తుంది. ఫీచర్ల సంగతలా ఉంచితే అమ్మకాల ఊపును పెంచుతున్న సంగతులెన్నో ఉన్నాయ్. మధ్యతరగతివర్గం ఆదాయాలు పెరుగుతుండటం.. యువత చిన్నవయసులోనే మంచి కొలువుల్లో కుదురుకోవడం.. వ్యాపారవర్గాల అండ ఎస్‌యూవీల జోరు కారణం అంటున్నారు నిపుణులు. అయితే కొనేవాళ్లంత కోటీశ్వరులూ, బాగా డబ్బున్న వాళ్లేం కాదంటారు మారుతిసుజుకీ నెక్సా జనరల్ మేనేజర్. బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలిస్తుండటం.. నామమాత్రపు డౌన్‌పేమెంట్‌తో వాహనం సొంతమయ్యే మార్గం ఉండటంతో ఓ మోస్తరు సంపాదన ఉన్నవాళ్లు సైతం ఎస్‌యూవీలపై మోజు పడుతున్నారు అంటారాయన.

ఏదేమైనా కారు ప్రియులంతా ఎస్‌యూవీలకు ఫిదా అవుతున్న మాట వాస్తవం. అయితే అచ్చంగా ఎస్‌యూవీలంటే ధర కాస్త ఎక్కువే. ఇచ్చే మైలేజీ తక్కువ. ఇది భరించలేం అనుకునేవాళ్లని ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ కంపెనీలు 'కాంపాక్ట్ ఎస్‌యూవీ', 'క్రాసోవర్' అనే సరికొత్త వేరియంట్లను సృష్టించాయి. ఒకట్రెండు ఫీచర్లు తక్కువైనా సర్దుకుపోతాం అనుకునేవాళ్లు కాంపాక్ట్ ఎస్‌యూవీకి ఓటేయొచ్చు. సెడాన్, ఎస్‌యూవీలకు మధ్యే ఉంటూ రెండురకాల అనుభూతి పంచుతూ మంచి మైలేజీ ఇచ్చేవి క్రాసోవర్లు.



ఎందుకు ఇష్టమంటే..

- పెద్ద కుటుంబాలు, యువత, కార్పొరేట్ ఉద్యోగులు.. ఎస్‌యూవీని డ్రైవ్ చేయడం క్రేజీగా భావిస్తున్నారు.
- సీటింగ్ ఎత్తులో ఉండటంతో పెద్దవాళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవాళ్లకి సౌకర్యవంతంగా ఉంటుంది.
- భద్రతాపరంగా చూసినా ఈ వాహనాల్లో అత్యధిక ఫీచర్లుంటాయి. ఏడెనిమిది లక్షల్లోనే ఎస్‌యూవీని కొనుగోలు చేయొచ్చు. క్రాసోవర్ల ధర ఇంకాస్త తక్కువే.
- సిబిల్ స్కోరు బాగుంటే బ్యాంకర్లు కొనుగోలుదార్లకు వందశాతం ఆన్‌రోడ్ రుణాలిస్తున్నాయి.
- జీఎస్‌టీ పెరగడంతో కార్ల ధరలు పెరిగి దూకుడుకు కొంచెం బ్రేక్ పడ్డా ఇప్పుడు అమ్మకాలు మళ్లీ జోరందుకున్నాయి.
- ఎస్‌యూవీల మైలేజీ తక్కువ అనేది గతం. ఆధునిక సాంకేతిక దన్నుతో ఈ వాహనాలు సైతం లీటరుకి ఇరవైకిపైగా మైలేజీ ఇస్తున్నాయి.





తేడాలివే

కార్లలో చాలారకాలుంటాయి. వేటిని ఎలా పిలుస్తారో చాలామందికి అర్థం కాని విషయం. సింపుల్ ఇలా చెప్పేసుకుందాం రండి.



హ్యాచ్‌బ్యాక్: బేసిక్ కారు. రెండు అర(బాక్స్)ల ఆకృతి నిర్మాణం. రెండు వరుసల సీట్లతో పరిమాణం చిన్నగా ఉంటుంది. వెనక డోరు (ట్రంక్) ప్రయాణికుల విభాగానికి ఆనుకొని ఉంటుంది.

ఉదా: మారుతీ ఆల్టో



సెడాన్: మూడు బాక్స్‌ల ఆకృతి. రెండు వరుసల్లో సీట్లు.. నాలుగు డోర్లతో లోపలిభాగం కాస్త విశాలంగా ఉంటుంది. ట్రంక్ ప్రయాణికుల విభాగంతో సంబంధం లేకుండా విడిగా ఉంటుంది.

ఉదా: హోండా సిటీ



ఎస్‌యూవీ: శక్తివంతమైన ఇంజిన్, మెరుగైన సస్పెన్షన్ ఉంటుంది. బలమైన ఛాసిస్, అత్యధిక గ్రౌండ్ క్లియరెన్స్‌తో ఆఫ్‌రోడ్‌లో కూడా పరిగెత్తే సామర్థ్యం దీని సొంతం.

ఉదా: విటారా బ్రెజ్జా



ఎంయూవీ: మల్టీ యుటిలిటీ వాహనం. రూఫ్ పొడుగ్గా ఉన్నా రెండు అరల ఆకృతి. వ్యక్తిగతంతోపాటు, ఇతర అవసరాలకు సైతం వాడుకోవచ్చు. ఐదు డోర్లు, మూడు వరుసల సీట్లతో విశాలంగా ఉంటుంది.

ఉదా: టయోటా ఇన్నోవా



కూపే: విలాసవంతం, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే కారు. పొడవాటి డోర్లుంటాయి. రెండోవరుసలోని ప్రయాణికుల సీట్లు ఇరుకిరుకుగా ఉంటాయి.

ఉదా: ఆడీ ఆర్8





క్రాసోవర్: సెడాన్, ఎస్‌యూవీల్లోని ఫీచర్ల సమ్మిళితం. మైలేజీకి ప్రాధాన్యం ఇస్తూనే విలాసవంతమైన ఇంటీరియర్‌కి ప్రాధాన్యం ఇస్తారు.

ఉదా: మారుతిసుజుకీ ఎస్-క్రాస్

మెకానిక్‌గురూ

ప్రతి బైక్‌కీ ఓ లెక్కుంది



వివిధరకాల బైక్‌లను విప్పదీసి మళ్లీ బిగించడం అంటే నాకు భలే ఇష్టం. ప్రస్తుతం వేర్వేరు బైక్‌లకు చెందిన విడిభాగాలతో సొంతంగా, ఒక సరికొత్త ద్విచక్రవాహనం తయారు చేయాలనుకుంటున్నాను. ఆ అనుభవం నాకుంది. ఇలా తయారు చేసిన బైక్‌కి రవాణాశాఖ రిజిస్ట్రేషన్ చేస్తుందా?

- వింజమూరి హరీశ్

సారీ జెంటిల్‌మన్.. సొంతంగా బైక్ తయారు చేయడం మీరనుకున్నంత తేలికేం కాదు. కొత్త వాహనం ఏదైనా ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) అనుమతి తప్పనిసరి. అక్కడ వాహనం భద్రత, సామర్థ్యం పరీక్షలు చేస్తారు. ఛాసిస్‌కి వరుస సంఖ్యతోపాటు వాహనంలోని ప్రతి పార్ట్‌ని రిజిస్టర్ చేస్తారు. ఆపై మెటీరియల్ సర్టిఫికేషన్ తప్పనిసరి. ఛాసిస్ పాతదైతే దానికి రవాణాశాఖ రిజిస్ట్రేషన్‌కి అనుమతించదు. ఈ వివరాలన్నింటిపై సమగ్రంగా అవగాహన వచ్చాకే కొత్త వాహనం తయారు చేయాలనే ఆలోచన మొదలుపెట్టండి.

ఎనభై వేల రూపాయల్లో ఏదైనా స్కూటర్ కొనాలనుకుంటున్నాను. సమర్థంగా పనిచేసే, మంచి మైలేజీ ఇచ్చే మోడల్ సూచించండి.

- అరవింద్ కిన్నెర

ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని స్కూటర్ల పనితీరు ఇంచుమించు ఒకేలా ఉంది. హీరో మాస్ట్రో, టీవీఎస్ జూపిటర్, హోండా యాక్టివా, యమహా.. పదికిలోమీటర్లు అటుఇటుగా మైలేజీ ఇచ్చే స్కూటర్లు. వీటిలో ఏదైనా ఒకటి ఎంచుకోండి.

హోండా కంపెనీవాళ్లు నా సీబీ యూనికార్న్ 150బైక్‌కి 10డబ్ల్యూ-30 గ్రేడ్ ఇంజిన్‌ఆయిల్ వాడమని సూచించారు. కానీ నేను కేస్ట్రాల్ పవర్ 1 20డబ్ల్యూ-50 సెమీ సింథటిక్ ఇంజిన్ ఆయిల్ వాడుతున్నాను. దీనివల్ల నాకైతే ఇంతవరకు ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. పైగా మంచి పనితీరు కనిపిస్తోంది. కంపెనీ మెకానిక్ మాత్రం మేం సూచించిందే వాడమని చెబుతున్నాడు. ఎందుకలా? అసలు రకరకాల ఇంజిన్ ఆయిల్ గ్రేడ్‌లు ఏంటి?

- రఘునాథ్, వైజాగ్

ఆయిల్‌కి ఉండే నాణ్యత, స్నిగ్ధత ఆధారంగా వాటిని కొన్ని గ్రేడ్‌లుగా విభజించారు. వాహనం తయారీ క్రమంలో, ఇంజిన్ పరిశీలించే పలు దశల్లో రకరకాల గ్రేడ్‌ల ఇంజిన్ ఆయిల్‌ని పరీక్షించిన తర్వాతే ఏ రకమైన వాహనానికి ఎలాంటి ఆయిల్ వాడాలో వాహన తయారీ సంస్థ నిర్ణయిస్తుంది. వాళ్లు సూచించిన బ్రాండ్, గ్రేడ్ ఆయిల్ మాత్రమే ఉపయోగించాలి. దానికి భిన్నమైన ఇంజిన్‌ఆయిల్ వాడితే దీర్ఘకాలంలో అది ఇంజిన్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. ఈ సమస్య రాకుండా ఉండాలంటే మెకానిక్ సూచించిన ఆయిల్ మాత్రమే వాడండి.

- సాయిభరత్ బొప్పరాజు,
www.motofix.in

ఊరే గుర్తు

లోగోట్టు



కారు డిజైనే కాదు అత్యంత ఆకర్షణీయమైన లోగో ఉన్న కంపెనీల్లో మాసెరాటి ఒకటి అంటారు ఆటోమొబైల్ పండితులు. ప్రతి లోగో వెనక ఓ లోగుట్టు ఉన్నట్టే మాసెరాటికీ ఓ కథ ఉంది. ఈ కంపెనీ ఉపయోగించే ట్రిడెంట్ (త్రిశూల ఆకారం) గుర్తు బోలోగ్నా అనే పట్టణానికి సంప్రదాయ చిహ్నం. ఈ ఊరు మాసెరాటి కార్ల కంపెనీ వ్యవస్థాపకుడు ఆల్ఫీరీ మాసెరాటి సొంతూరు. ఆ అభిమానంతో కార్లు ఉత్పత్తి చేసే తొలి ప్లాంటు ఇక్కడే మొదలుపెట్టారు. తర్వాత అది మోడెనా నగరానికి మారింది. కాలక్రమేనా ఇదే లోగో కొద్దిపాటి మార్పులకు గురైంది ట్రిడెంట్‌తోపాటు వెనకాల నీలిరంగు బ్యాగ్రౌండ్ చేర్చడం మొదలుపెట్టి మరింత అందంగా తీర్చిదిద్దారు.

మీరెలాంటి బైకర్?

కుర్ర బైకర్ల చేతికి యాక్సిలరేటర్ అందితే బండి గిర్రున తిరగాల్సిందే. క్షణాల్లో వంద కిలోమీటర్ల వేగం అందుకోవాల్సిందే. నడిపే మాటెలా ఉన్నా మంచి బైకర్‌కి, చెడ్డ బైకర్‌కి కొన్ని తేడాలుంటాయి అంటారు నిపుణులు. సూటిగా.. సుత్తి లేకుండా ఇదిగో ఇలా చెప్పుకోవచ్చు.

హెల్మెట్

మంచి బైకర్: బైక్ ఖరీదెంత? ఇంజిన్, మైలేజీ సంగతేంటి? వీటి గురించి ఎంతలా పట్టించుకుంటాడో హెల్మెట్ ధరించడం కూడా అంతే ముఖ్యం అనుకుంటాడు. దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే తలకి దెబ్బ తగలకుండా.. బలంగా వీచే చలి గాలుల నుంచి ఇది రక్షణగా పని చేస్తుంది.

చెడ్డ బైకర్: హెల్మెట్ అంటే తలకి పెద్ద భారంలా భావిస్తాడు. పరిసరాలపై ఉన్న ధ్యాస రక్షణపై ఏమాత్రం ఉండదు.

ముఖ కవచం

మంచి బైకర్: అకస్మాత్తుగా ఎగిరిపడి వచ్చే రాళ్లు, కీటకాల నుంచి రక్షించుకునేందుకు మొహాన్ని కవర్ చేసుకునేందుకు ఏదైనా రక్షక కవచం లేదా పూర్తిస్థాయి హెల్మెట్ ధరిస్తాడు.

చెడ్డ బైకర్: ఎలాంటి రక్షణ చర్యలు పాటించడు. మొండి తల, మొండి ధైర్యం. కనీసం ఇతరులు చెప్పింది వినే ప్రయత్నం కూడా చేయడు. నిద్రమత్తు కళ్లు.. దుమ్ము కొట్టుకుపోయిన మొహం.. నీళ్లు కారే కళ్లు.. గాలికి రేగిపోయిన జుత్తు.. ఇతగాడి లక్షణాలు.



గ్లోవ్స్

మంచి బైకర్: బైక్ నడిపేటప్పుడు చేతులు, వేళ్లు సౌకర్యంగా ఉండేందుకు, త్వరగా అలసిపోకుండా వీటిని తప్పనిసరిగా వాడతాడు. సీజన్ మారితే గ్లోవ్స్ మారుతాయే తప్ప ధరించడం మానడు.

చెడ్డ బైకర్: యాక్సిలరేటర్, బ్రేక్‌ల్ని నియంత్రించేవి ఖాళీ చేతులు, చేతి వేళ్లే. లాంగ్‌డ్రైవ్‌లకు వెళ్లేవాళ్లు అదేపనిగా ఇదే విధానం పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదం తప్పదు.

ప్రత్యేకతమైన దుస్తులు

మంచి బైకర్: తీవ్రమైన ఎండ, చలిగాలులు, డీహైడ్రేషన్‌లాంటి రోగాలపై సైతం బైకర్ రైడ్ చేయాల్సిందే. అందుకే ఒంటికి నిండు చేతుల జాకెట్, లేతరంగు ప్యాంట్లు ధరిస్తాడు.

చెడ్డ బైకర్: రొటీన్‌గా ధరించే దుస్తులు లేదంటే షార్ట్‌లు, త్రీబైఫోర్‌లు, టీషర్ట్‌లు. ఇతగాడి ప్రాధాన్యం అంతా స్టైల్‌కే.

బూట్లు

మంచి బైకర్: పాదాలు, మడమలు గాయాలపాలు కాకుండా ఉండటానికి టూరులో తప్పకుండా బూట్లు వేసుకోవాలనే సంగతి ఈ రైడర్లకు తెలుసు. లాంగ్‌డ్రైవ్ అయినా.. ఓ మోస్తరు ప్రయాణానికైనా వీటిని మర్చిపోరు.

చెడ్డ బైకర్: స్లిప్పర్లు, సాండిల్స్.. రోజూ వాడే పాదరక్షలే ఆయుధాలు. కాలివేళ్లు చిట్లినా, మడమలపై భారం పడినా డోన్ట్‌కేర్ అన్నట్టుంటారు.

ఈనాడు సినిమా

ఆ ప్రయాణం ఈ అనుభవం



తమన్నా

తెలుగు, తమిళం, హిందీ... ఇలా భాష ఏదైనా తన నటనతో, గ్లామర్‌తో మెప్పించింది తమన్నా. అయితే ఇప్పటికీ 'నాకు తెలుగు పరిశ్రమ అంటేనే ప్రేమ' అంటూ టాలీవుడ్‌పై తన అభిమానం కురిపిస్తుంటుంది. "నిజంగానే తెలుగు సినిమాలు నా కెరీర్‌ని మలుపు తిప్పాయి. నేనిప్పటికీ తెలుగు కథానాయికనే. కాకపోతే తమిళ, హిందీ చిత్రసీమల్లో నటించడం వల్ల కొత్త విషయాలు తెలుస్తుంటాయి. ఎవరు ఎలా ఆలోచిస్తున్నారో అర్థం అవుతుంది. తెలియని భాషలో నటించడం ఎప్పుడూ ఓ సవాల్ లాంటిదే. ఒకప్పుడు తెలుగు నాకు కొత్త. భాష నేర్చుకుని, భావాల్ని అర్థం చేసుకుని నటించా. ఇప్పుడు పూర్తిగా తెలుగమ్మాయిలా మారిపోయా. ఆ ప్రయాణం, ఆ అనుభవం ఎంతో గొప్పది. మిగిలిన భాషల్లోనూ ఆ తరహా అనుభూతులు దొరుకుతున్నాయి" అంటోంది తమన్నా.

చట్టం వెంటనే శిక్షించి, దేవుడు నిదానంగా శిక్షించేది ఆ కాలం. చట్టం నిదానంగా శిక్షించి, దేవుడు వెంటనే శిక్షించేది ఈ కాలం.

చిత్రం : నరసింహ

- పంపినవారు : కమల్, శ్రీకాళహస్తి



రవిశంకర్, నవీన్ ఎర్నేని, సుకుమార్, చెర్రీ

చిరు అతిథిగా... విశాఖతీరంలో!

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రంగస్థలం'. సమంత నాయిక. సుకుమార్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మించింది. ఈనెల 30న విడుదల కానుంది. ఈ ఆదివారం విశాఖపట్నంలో విడుదల ముందస్తు వేడుక నిర్వహిస్తున్నారు. ఆర్.కె.బీచ్ తీరాన జరిగే ఈ కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. గురువారం పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుకుమార్ మాట్లాడుతూ "1980 నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ కాలం నుంచి వచ్చిన వ్యక్తుల్ని అలరిస్తుంది. అప్పటి అనుభూతుల్ని మళ్లీ వెండి తెరపై చూడొచ్చు. ఆల్బమ్‌లో అయిదు పాటలున్నాయి. అవన్నీ చంద్రబోస్ రాసినవే. పది పదిహేను నిమిషాల్లో పాట పూర్తి చేసేవారు. రాసిన తరవాతే ట్యూన్ చేశాం. ఈ చిత్రంలో మరో గీతం ఉంది. అది చంద్రబోస్ స్వయంగా ఆలపించారు. ఆ పాటని థియేటర్లలోనే వినాలి. నేను దర్శకత్వం వహించిన '1(నేనొక్కడినే)', 'నాన్నకు ప్రేమతో' ఓవర్సీస్‌లో బాగా ఆడాయి. ఓసారి అమెరికా వెళ్తే.. 'మనదైన సంస్కృతిని చూపించే చిత్రాలెప్పుడు తీస్తారు?' అని నన్ను ఒకాయన అడిగారు. అప్పుడు నిజంగానే సిగ్గేసింది. 'రంగస్థలం' లాంటి కథ తెరపై చూపించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది. 'రంగమ్మ మంగమ్మ' పాటలో ఉపయోగించిన 'గొల్లభామ' అనే పదం కీటకానికి సంబంధించినది. ఓ వర్గాన్ని ఉద్దేశించి రాసింది కాద"న్నారు. "మంచి సాహిత్యానికి మంచి సంగీతం కుదిరింది. పాటలకు వస్తున్న స్పందన చూస్తే ఆనందంగా ఉంద"న్నారు చంద్రబోస్. '

'ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయ"న్నారు నవీన్ ఎర్నేని. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు రామకృష్ణ, మోనిక, చెర్రీ, నిర్మాతలు వై.రవిశంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రవితేజ

మరో కథకు పచ్చజెండా?

రవితేజ ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుసగా సినిమాల్ని పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం కల్యాణ్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. 'నేల టికెట్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఈమధ్యే శ్రీనువైట్ల సినిమాకి శ్రీకారం చుట్టారు. 'అమర్ అక్బర్ ఆంటోనీ' అనే టైటిల్ ఖరారైంది. ఇప్పుడు మరో కథకు పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు వి.ఐ.ఆనంద్. ఆయన ఇప్పుడు రవితేజ కోసం ఓ కథ సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. అది రవితేజకూ బాగా నచ్చేసిందని, త్వరలోనే ఈ కాంబినేషన్‌లో ఓ చిత్రం రాబోతోందని సమాచారం. 'అమర్ అక్బర్ ఆంటోనీ' అమెరికాలో షూటింగ్ జరుపుకోనుంది. ఇది పూర్తయ్యాకే... ఆనంద్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.

నవ్విస్తూ... కవ్విస్తూ...



సంయుక్త హెగ్డే, సిమ్రన్

"సత్య, మీరా పాత్రలతో తెలుగు ప్రేక్షకుల గుర్తింపు పొందడమే కాదు వారి గుండెల్లో నిలుస్తామనే నమ్మకాన్ని మాకు 'కిరాక్ పార్టీ' చిత్రం కలిగించింద"న్నారు ఆ పాత్రల్లో నటించిన సంయుక్త హెగ్డే, సిమ్రన్. నిఖిల్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా సంయుక్త, సిమ్రన్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. సంయుక్త హెగ్డే మాట్లాడుతూ "ఇందులో నా పేరు సత్య. నవ్విస్తూ, కవ్విస్తూ సాగే ఇంజినీరింగ్ విద్యార్థిని. కాలేజీలో సీనియర్ అబ్బాయి నిఖిల్‌ని ప్రేమిస్తా. ఆ తర్వాత మా ప్రేమకథ అనూహ్యమైన మలుపుతో వినోదాత్మకంగా నడుస్తుంది. కన్నడ మాతృకలో కూడా ఈ పాత్ర నేనే చేశా. ఒకసారి చేసిన పాత్రనే మళ్లీ చేయడం సవాలే. అప్పటికీ, ఇప్పటికీ నటిగా ఎంత ఎదిగానో అర్థమైంది. కొంతయినా నేర్చుకున్నాను అనిపించింది. నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకున్నా" అంది. సిమ్రన్ మాట్లాడుతూ "ఇది నా తొలి చిత్రం. సీనియర్ ఇంజినీరింగ్ విద్యార్థిని. నా పాత్రకి ప్రాధాన్యత ఉంది. తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకుల గుర్తింపు లభించే పాత్ర దక్కడం సంతోషం. కొత్త అవకాశాలు వస్తున్నాయి. తెలుగులో ఓ యువకథానాయకుడి చిత్రంలో నటించే అవకాశం వచ్చింద"ని చెప్పింది.

జె.డి 'ఉగ్ర'రూపం



'ఉగ్రం'లో జె.డి చక్రవర్తి

జె.డి చక్రవర్తి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఉగ్రం'. అమ్మ రాజశేఖర్ దర్శకుడు. నక్షత్ర రాజశేఖర్ నిర్మాత. ఉగాదికి ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తారు. నిర్మాత మాట్లాడుతూ "యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఇది. వినోదానికి ప్రాధాన్యం ఉంది. జెడి చక్రవర్తిని ఓ కొత్త పాత్రలో చూడబోతున్నారు. అతని కెరీర్‌లో 'ఉగ్రం' ప్రత్యేక చిత్రంగా మిగిలిపోతుంది. వాణిజ్య చిత్రాలు ఇష్టపడేవారికి 'ఉగ్రం' ఓ విందు భోజనంలా ఉండబోతోంది. చిత్రీకరణ పూర్తయింది. వేసవిలో విడుదల చేస్తామ"న్నారు.

ఎవరు చేసిన పాపమో... ఈ గాలి దీపాలు

"సత్యగ్యాంగ్' సినిమాలో అనాథలపై రాసిన 'ఎవరు చేసిన పాపమో.. ఈ గాలి దీపాలు' అనే పాట ప్రేక్షకులకి చేరాలనే బాధ్యతతోనే సినిమా ప్రచారంలోనూ పాల్గొన్నాను. 'ఈ మధ్యకాలంలో నేను విన్న గొప్ప సాహిత్యం ఇది' అని ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి... ఈ పాట గురించి నాకు సందేశాన్ని పంపారు" అని గీతరచయిత చంద్రబోస్ చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాత్విక ఈశ్వర్, అక్షిత జంటగా నటించిన చిత్రం 'సత్య గ్యాంగ్'. ప్రభాస్ దర్శకత్వం వహించారు. మహేష్ ఖన్నా నిర్మించారు. నిర్మాత మాట్లాడుతూ "ఇది అనాథల సమస్య చుట్టూ తిరిగే సినిమా. ఆ సమస్యకి పరిష్కారాన్ని చూపే ప్రయత్నం చేశాం. నాలుగు పాటలున్నాయి. దర్శకత్వంతో పాటు స్వరాల బాధ్యతను చక్కగా పూర్తి చేశారు ప్రభాస్. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు. సాత్విక ఈశ్వర్ మాట్లాడుతూ "అనాథలను ప్రేమతో ఆదరించి వారికి చక్కటి దారి చూపడానికి ఓ ఐదుగురు కుర్రాళ్ల గ్యాంగ్ ఎలా కృషి చేసిందనేదే ఈ సినిమా. ఈతరం కోరుకునే వినోదంతో దర్శకుడు తెరకెక్కించారు" అని అన్నారు. కార్యక్రమంలో సముద్ర, ఎ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



అక్షిత, సాత్విక ఈశ్వర్

'రైడ్' చేయడానికి వచ్చేశాడు

బాలీవుడ్‌లో ఇటీవలికాలంలో నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్న చిత్రాలు ఎక్కువగా వస్తున్నాయి. ఆ కోవలో తెరకెక్కిన చిత్రమే 'రైడ్'. ఆదాయపు పన్నుశాఖ దాడుల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. అజయ్ దేవగణ్ కథానాయకుడిగా నటించారు. ఆయన సరసన ఇలియానా కథానాయికగా కనిపిస్తుంది. సౌరభ్ శుక్లా కీలక పాత్రలో నటించారు. 'నో ఒన్ కిల్డ్ జెస్సికా' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌కుమార్ గుప్తా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.



'రైడ్'లో అజయ్‌దేవగణ్, ఇలియానా

గతేడాది గోల్‌మాల్ ఎగైన్, బాద్షాహో చిత్రాలతో రెండు విజయాలందుకున్నారు అజయ్ దేవగణ్. 'గోల్‌మాల్ ఎగైన్' రూ.205 కోట్లకు పైగా వసూళ్లతో అజయ్ కెరీర్‌లోనే ఘన విజయంగా నిలిచింది. ఆ ఉత్సాహంతో ఈ ఏడాది 'రైడ్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు అజయ్. 'బాద్షాహో'లో అజయ్‌తో కలిసి నటించిన ఇలియనా ఈ చిత్రంలో రెండో సారి ఆయనకు జోడీగా నటించింది. 1981లో ఆదాయపు పన్ను శాఖ జరిపిన అతిపెద్ద దాడి ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. అజయ్ ఆదాయపు పన్ను శాఖ అధికారిగా కనిపిస్తాడు.

విడుదలకు సిద్ధం

కథేంటి: ఆదాయపు పన్ను శాఖ అధికారి అమయ్ పట్నాయక్(అజయ్ దేవగణ్) అక్రమార్కుల పాలిట సింహస్వప్నం. ఎవరి ఒత్తిడికీ తలొగ్గక అవినీతిపరుల భరతం పడుతుంటాడు. ఆయన నిబద్ధతకు నజరానాగా ఏడేళ్లలో 49 సార్లు బదిలీ అవుతాడు. అయినా ఇసుమంత కూడా రాజీ పడడు. అతనికి ఉత్తర్‌ప్రదేశ్‌లో తౌజీ అనే ఓ పేరుమోసిన ధనవంతుడి కేసు అప్పగిస్తారు. తౌజీ తన పలుకుబడితో సమాజంలో పెద్దమనిషిగా చలామణీ అవుతుంటాడు. తౌజీ దగ్గర ఉన్న నల్లధనాన్ని వెలికితీసి అతణ్ని కోర్టుకీడ్చడం అంత సులువు కాదని పట్నాయక్‌కు అర్థమవుతుంది. అయినా వ్యూహానికి పదును పెట్టి తౌజీ ఇంటిపై దాడి చేస్తాడు. అది ఆదాయపు పన్ను శాఖ చరిత్రలోనే అదిపెద్ద దాడిగా నిలుస్తుందని అతనికి కూడా తెలియదు. తౌజీ అసలు రంగును పట్నాయక్ ఎలా బయటపెట్టాడు? నీతా (ఇలియానా)తో అతని అనుబంధం ఎలాంటిదన్న విషయాలు తెరపై చూడాలి.

గీతోపదేశం

పడి లేస్తూ ఉంటే పెరిగింది ధైర్యం
అడుగేస్తూ ఉంటే తరిగింది దూరం
చిరునవ్వేస్తూ ఉంటే సెలవంది శోకం
సహనంతో ఉంటే దొరికింది సైన్యం
చెమటోడుస్తుంటే పిలిచింది గమ్యం

గీతం: ఆరాటం ముందు ఆటంకం ఎంత...

చిత్రం: నింగీ నేలా నాదే; రచన: చంద్రబోస్

- పంపినవారు: ఆర్.కృష్ణారావు, జంబులపాడు



కృతి సనన్

కృతి...పార్వతీబాయి

వెండితెరపై భారీ స్థాయి హంగులతో సినిమాను తీర్చిదిద్దగల దిట్ట అశుతోష్ గోవరికర్. 2016లో భారీ వ్యయంతో ఆయన తెరకెక్కించిన 'మొహెంజొ దారో' నిరాశపరిచింది. అందుకే తాజాగా ఆయన తెరకెక్కిస్తున్న చారిత్రక చిత్రం 'పానిపట్'పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇందులో అర్జున్‌కపూర్, సంజయ్ దత్ కీలక పాత్రధారులు. మరో కీలకమైన పాత్రను బాలీవుడ్ భామ కృతి సనన్ పోషించనుంది. ఇందులో మరాఠా యోధుడు సదాశివ్‌రావ్ బహు పాత్రలో అర్జున్ కపూర్, అహ్మద్‌షా అబ్దాలీగా సంజయ్ దత్ కనిపించనున్నారు. "సదాశివ్‌రావ్ రెండో భార్య పార్వతీబాయిగా కృతి నటించనుంది. ఆఫ్ఘన్‌లతో జరిగిన యుద్ధంలో భర్తకు ఎంతో సహకరిస్తుంది పార్వతి. చివరి యుద్ధంలోనూ భర్తతో పాటు కదనరంగంలోకి దూకుతుంది"అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇందులో యుద్ధ ఘట్టాలు, పోరాట సన్నివేశాలు చాలా కీలకం కానున్నాయి. ఎక్కువశాతం పోరాటాలు అర్జున్, సంజయ్ పాత్రల మధ్యే జరుగుతాయి. పాత్రకు న్యాయం చేయడానికి కృతి కూడా కత్తి యుద్ధాల్లో తర్ఫీదు పొందుతోంది. వచ్చే ఏడాది చివర్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

ఈనాడు వసుంధర
శుక్రవారం మార్చి 16, 2018 ● హైదరాబాద్



వేసవి వచ్చిందంటే చేనేత చీరల సందడి మొదలైనట్టే. అలాంటివే ఈ నిపుణ్ ఇకత్ చీరలు. ఆధునిక డిజైన్లతో.. అద్భుతమైన వర్ణాల్లో తీర్చిదిద్దిన ఈ చీరలు కట్టుకుంటే చాలు చక్కనమ్మలా, చెక్కిన శిల్పంలా కనిపిస్తారు. ఇంకెందుకాలస్యం ఎంచుకోండి మరి.

ఇంతులకు ఇకత్!

ఫ్యాషన్ ఫ్యాషన్





ట్రెండీగా డిజైన్ చేసిన ఈ చీరకు జియోమెట్రిక్ సొగసులూ.. పోల్కా ప్రింట్లు ప్రత్యేకం.

ఆధునికంగా రూపొందిన ఇకత్ చీరపై పూల బుటీలూ.. వైవిధ్యమైన అంచు అదనపు ఆకర్షణ.

బ్లాక్ ప్రింట్.. బుటీ డిజైన్‌తో ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన ఇకత్ చీర.

మోడల్: కృతిక సింగ్‌రాథోడ్
ఫొటోలు: దండా శ్రీనివాసరావు

పళ్లకు కొబ్బరినూనె

తెల్లటి పలువరుస మన ముఖానికి పెట్టని ఆభరణం లాంటిది. అయితే రకరకాల కారణాల వల్ల దంతాలు రంగూ, కాంతిని కోల్పోతాయి. మరి వాటిని సహజంగా ఇంట్లో ఉండే పదార్థాలతో ఎలా మెరిపించాలో చూద్దాం...



కొబ్బరినూనెతో: చెంచా కొబ్బరినూనెను నోట్లో పోసుకుని అయిదునిమిషాలు పుక్కిలించి ఉమ్మేయాలి. టూత్‌బ్రష్‌పై అయిదారు చుక్కల కొబ్బరినూనె వేసి పళ్లు బాగా తోమాలి. ఇలా చేయడం వల్ల దంతాలు శుభ్రపడతాయి.




వెనిగర్‌తో: కొంచెం వెనిగర్‌ను చేత్తో తీసుకుని పంటిపై కాసేపు రుద్దాలి. ఆ తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. వెనిగర్‌లోని ఎసిటిక్ ఆమ్లం, పొటాషియం, మెగ్నీషియం హానికర బ్యాక్టీరియానూ, పళ్లపై పేరుకున్న పాచిని పోగొడతాయి. దాంతో చిగుళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి.



నిమ్మతొక్కతో: నిమ్మ సహజ క్లెన్సర్‌లా పనిచేస్తుంది. నిమ్మతొక్కను పళ్లపై రుద్దాలి. ఆ తరువాత చల్లటి నీటితో శుభ్రం చేస్తే వాటిపై పేరుకున్న మురికిపోయి మెరుస్తాయి. నోరూ తాజాగా ఉంటుంది.

వంటసోడా: చెంచా వంటసోడాలో కాసిని నీళ్లు పోసి కలపాలి. దీన్ని బ్రష్‌పై తీసుకుని పళ్లు తోముకోవాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే... పళ్లు మెరుస్తాయి.



క్యారెట్: దీన్ని పళ్లపై రుద్దక్కర్లేదు. అయితే రోజుకోటి తింటే చాలు. ఇది చిగుళ్లను గట్టిపరిచి, పళ్లను ఆరోగ్యంగా మారుస్తుంది.

హలో... మీకు పార్శిల్ వచ్చింది!



చెన్నై, రామాపురంలోని అమెజాన్ డెలివరీ స్టేషన్ అది. ఉదయం తొమ్మిది గంటలకు అమెజాన్ ప్రధాన కార్యాలయం నుంచి లగేజ్ వ్యాన్ వచ్చింది. పదిమంది అమ్మాయిలు అక్కడకు వచ్చి, అందులోంచి పార్శిళ్లను అందుకుని అన్నింటినీ ఆయా ప్రాంతాలవారీగా విడదీశారు. పది నిమిషాల్లో డెలివరీ చేయాల్సిన వాటిని తమ బ్యాగుల్లో భద్రపరుచుకున్నారు. తమ బళ్లమీద ఆ బ్యాగులు వేసుకుని వెళ్లిపోయారు. మహిళలు మాత్రమే పనిచేసే అమెజాన్ రెండు డెలివరీ స్టేషన్లలో ఒకటైన చెన్నై కార్యాలయం అది. దాన్ని జమునాదేవి నిర్వహిస్తోంది.



అదో సవాలు... జమునాదేవి ఐటీ చదివి చెన్నైలోని ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థలో చేసేది. ఎక్కువ గంటలు పని చేయడం, పని ఒత్తిడి వల్ల మరేదైనా చేయాలనుకుంది. అప్పుడే అమెజాన్ మహిళల కోసం ప్రత్యేకంగా డెలివరీ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఆ శాఖ బాధ్యతల్ని తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంది. మూడు నెలలు శిక్షణా తీసుకుంది. అలా ఈ మధ్యే దీన్ని ప్రారంభించింది. అమెజాన్ ప్రధాన కార్యాలయం నుంచి రోజుకు దాదాపు 500 వరకూ పార్శిళ్లు వస్తాయి. వీటిని వినియోగదారుల ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లి ఇవ్వాలి. 'వస్తువు ఏదయినా వినియోగదారులకు జాగ్రత్తగా చేర్చడం, పనిచేసే మహిళల భద్రత రెండూ నాకు సవాళ్లే..' అంటుందామె..

వెంట పెప్పర్ స్ప్రే: ప్రస్తుతం ఇక్కడ పన్నెండు మంది పని చేస్తున్నారు. అందరూ 21 నుంచి 35 ఏళ్ల వయసు లోపువారే. వినియోగదారుడితో మాట్లాడే విధానం, సాంకేతికతకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇచ్చాకే పని అప్పగిస్తారు. 'మా ఉద్యోగినుల్లో కొందరికి వాహనాలు ఉన్నాయి. లేనివారికి సంస్థ తరఫున ఇచ్చాం. వీరంతా రెండు షిఫ్టుల్లో పని చేస్తారు. పిల్లలున్న ఉద్యోగినులు వాళ్లను స్కూళ్ల దగ్గర దింపి సాయంత్రం తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతి ఇస్తాం. లగేజీ ఎక్కువగా ఉంటే.. బండిమీద కష్టం. అప్పుడు ట్రాలీ వాడాలి. అక్కడా మహిళలే ఉంటారు. డోర్ డెలివరీకి మా ఉద్యోగినులు వెళ్లినప్పుడు కొందరు వీరిని చూసి ఆశ్చర్యపోతే మరికొందరు ప్రశంసిస్తారు. మా ఉద్యోగినుల్లో ప్రతీ ఒక్కరూ తమ బ్యాగుల్లో పెప్పర్ స్ప్రే పెట్టుకుంటారు. వీళ్లకు జీతం 10 నుంచి 18 వేల రూపాయల వరకు ఉంటుంది. కొన్నిసార్లు పార్శిళ్లను బట్టి అదనంగా కొంత మొత్తం, పెట్రోలు ఖర్చులు ఇస్తారు. దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం వంటి సమయంలో ఎక్కువ పార్శిళ్లు వస్తాయి. అప్పుడు పనిచేసేవారికి అదనపు అలవెన్సులు పొందుతారు. పురుషులు మాత్రమే నిర్వహించే ఈ విధులను ఇప్పుడు మేం కూడా చేపట్టడం సంతోషంగా ఉంది..' అంటుంది జమున.

బంగారం వెండి

15న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,400	31,400	31,400	31,420
ఆర్నమెంట్	29,330	29,360	29,150	29,200
వెండి (కిలో)	39,440	39,620	39,800	40,000
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	31,350	31,140	31,000	31,110
ఆర్నమెంట్	29,080	29,120	29,000	29,080
వెండి (కిలో)	39,700	39,800	38,800	39,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,350	31,350	-------	-------
ఆర్నమెంట్	29,160	29,160	2,900	2,908 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.40	41.60 గ్రా

చీకటి గదికి మెరిసే పరదాలు



ఇంట్లో కొన్ని గదుల్లో సరిగ్గా వెలుతురు పడదు. అలాంటప్పుడు చిన్న చిన్న ఏర్పాట్లతోనే గది వెలుతురులో కాస్త మార్పు తీసుకురావచ్చు. అదెలాగో చూద్దామా!

- గదిలో పడే కాస్త వెలుతురును కూడా అద్దాలు రెట్టింపుచేస్తాయి. కిటికీల దగ్గరో, గుమ్మం దగ్గరో పొడవాటి అద్దం ఒకటి పెడితే గది ప్రకాశవంతంగా మారుతుంది. ఇలా కాంతిని పరావర్తనం చేసే వస్తువులు ఎక్కువగా అమర్చుకుంటే చూడటానికీ బాగుంటుంది.
- గది మూలల్లో మరీ చీకటిగా అనిపిస్తే ఒక టేబుల్ ల్యాంప్ పెట్టి చూడండి. అది వెడల్పాటి బల్లమీద ఏర్పాటు చేసుకుంటే అవసరమైనప్పుడల్లా ఆఫీసు పని చేసుకోవడానికీ, రీడింగ్ టేబుల్‌లాగా కూడా పనికొస్తుంది. గదిలో స్థలం కూడా ఆదా చేసినట్లుంటుంది.
- టేబుల్ ల్యాంప్‌తోపాటూ గోడలకు కాస్త ఎత్తులో సీలింగ్‌లైట్లను ఏర్పాటు చేసుకుంటే మంచిది. అవి కూడా గది మొత్తానికీ ఒకటే అని కాకుండా వైశాల్యాన్ని బట్టి రెండు, మూడు ఉండేలా చూసుకుంటే గది మూలల వరకూ వెలుతురు చేరుతుంది.
- కిటికీలకూ, గుమ్మాలకు కాస్త మెరిసే, పల్చని పరదాలను ఎంచుకోవాలి. ఇవి కాస్త పలుచగా ఉండటంతో గదిలో వెలుతురు పడుతుంది. వీటిని వీలైనంత లేత రంగుల్లో ఎంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- చిన్నగా, చీకటిగా ఉన్న గది గోడలకు ఎక్కువగా లేత రంగులు వేయడానికే ప్రాధాన్యం ఇస్తాం. కానీ వెలుతురు బాగా పడేచోటే లేత రంగులు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అందుకే కాస్త చీకటిగా ఉన్న గదుల్లో అదీ వెలుతురు ఎక్కువగా పడని చోట కాస్త ముదురు రంగులు ఎంచుకుంటేనే మేలు.

అభాగ్య పిల్లలే... ఆమెకు అతిథులు

ఇరవై సంవత్సరాల కిందట ఏదో పనిమీద హైదరాబాద్ వచ్చిన సుజాతకు ఎప్పటికీ మరిచిపోలేని దుర్ఘటన ఎదురైంది. అప్పటివరకు ఆడిస్తున్న ఏడాదిన్నర వయసున్న కూతురు ఒక్కసారిగా తన కళ్లముందు నుంచి మాయమైంది. అది కూడా రద్దీగా ఉన్న రైల్వేస్టేషన్లో. ఎంత వెతికినా కనిపించలేదు. ఆ తరువాత బిడ్డ కోసం వెతికిన ఊర్లకు లెక్కలేదు. చివరిసారిగా చూసిన ఆ చిన్నారి నవ్వే ఆమె మదిలో మెదిలి కలవరపెట్టేది. ఇప్పుడా చిన్నారి నవ్వే యాభై మంది దివ్యాంగుల జీవితాల్లో నవ్వులు పూయించడానికి కారణమైంది.



ఏళ్లు గడుస్తూనే ఉన్నా బిడ్డ ఆచూకీ దొరకలేదు. దాంతో ఆదరణా, అవసరం ఉన్న చిన్నారులూ, మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు సేవ చేసి వారి చిరునవ్వుల్లోనే తన చిట్టితల్లిని చూసుకోవాలని నిర్ణయించుకుంది సుజాత. ఆ ఆలోచనకు రూపమే 2008లో ప్రారంభించిన 'అతిథి మానసిక వికలాంగుల కేంద్రం'. వరంగల్ జిల్లా హన్మకొండలో ఉందిది. అయిదుగురితో మొదలుపెట్టిన ఆ కేంద్రంలో ఇప్పుడు యాభై మందికి పైగా పిల్లలున్నారు. అక్కడుండే చిన్నారులెవ్వరూ సొంతంగా పనులు చేసుకోలేరు. ఎవరో ఒకరి సాయం కావాల్సిందే. కనీసం వారికున్న అవసరమేంటో చెప్పగలిగేలా చెయ్యాలనుకుంది. వేరే శిక్షకులతో కాకుండా ఆ పని తనే చేస్తే సంతృప్తి దొరుకుతుందనిపించి వాళ్లకు శిక్షణిచ్చేలా అవసరమైన కోర్సులూ పూర్తిచేసింది. ఇప్పుడు స్పష్టంగా మాట్లాడలేని పిల్లలకు నెమ్మదిగా కొన్ని మాటలు పలికేలా తనే శిక్షణ ఇవ్వగలుగుతోంది. ఆశ్రమంలో ఉన్నవాళ్లకే కాదు... ఇతర పిల్లలకు కూడా చేయూతగా నిలుస్తోంది. ఇప్పుడు 'మా మాటలు వినని పిల్లలు కూడా సుజాత చెప్తే వెంటనే ఏమైనా నేర్చుకుంటారు' అంటారు పిల్లల తల్లిదండ్రులు. ఆ ఆశ్రమం నిర్వహణ మొదట్లో కాస్త ఖర్చుతోనే పూర్తయిపోయేది. ఇప్పుడా వ్యయం పెరగడంతో ఇద్దరు కూతుళ్లు, భర్త సంపాదన కూడా దాని కోసమే వెచ్చించడం ఆదర్శనీయం.

ఉపాధి కూడా!

పదిహేను సంవత్సరాలు పైబడిన పిల్లలను సొంతంగా ఉపాధి సంపాదించుకునేలా కుట్లూ, అల్లికలూ, కొవ్వొత్తులు తయారు చేయడంలో అక్కడే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అక్కడిచ్చే తర్ఫీదూ, మనోధైర్యంతో మిమిక్రీ, నృత్యం, క్రీడల్లోనూ ఆ పిల్లలు ప్రతిభ కనబరుస్తున్నారు. దివ్యాంగుల కోసం నిర్వహించే పోటీల్లో పాల్గొంటూ అనేక పతకాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో 11 బంగారు, 17 వెండి, 12 కాంస్య పతకాలు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సేవల్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం అతిథి సంస్థను పురస్కరించింది. 2016లో సావిత్రీబాయి పూలే ఫెల్లోషిప్ జాతీయ అవార్డుకు కూడా సుజాత ఎంపికయ్యారు.

రంజిత్ ఇజ్జగిరి, ఈనాడు డిజిటల్, కరీంనగర్.

పదహారేళ్లకే జుట్టు నెరిసింది...ఎలా!

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

? నాకు పదహారేళ్లు. నాకు ఇప్పుడే జుట్టు పూర్తిగా తెల్లబడిపోయింది. నల్లగా మార్చుకోవడానికి చికిత్సలు ఏమన్నా ఉన్నాయా.. లేదంటే ఇంత చిన్న వయసు నుంచే రంగులు వేసుకోవడం తప్పదా. నా జుట్టు గురించి ఆలోచిస్తే ఎంతో బాధగా ఉంటోంది.

- నీరజ, కర్నూలు

✔ జుట్టు పూర్తిగా నెరిసిపోయాక నల్లగా మార్చడమనేది సహజ పద్ధతుల్లో కష్టం. అసలు మీకీ సమస్య ఎందుకు వచ్చిందో తెలుసుకోవాలి.. ఆ తరువాతే పరిష్కారాల గురించి ఆలోచించడం మంచిది.

ఇవీ కారణాలు: మెలనిన్ తక్కువగా ఉన్నప్పుడు లేదా వంశపారంపర్యంగానూ ఇలా కావచ్చు. కొన్నిసార్లు మనకు తెలియకుండానే జుట్టు ప్యాచుల మాదిరి ఊడిపోతుంది. తిరిగి జుట్టు తెల్లరంగులో వస్తుంది. ఈ సమస్యను అలోపేసియా ఎరియేటా అంటాం. విటమిన్ బి12 లోపం వల్ల కూడా ఇలా కావచ్చు. మరోటి థైరాయిడ్ సమస్య. ఇక, బొల్లి ఉన్నవారిలో, క్షయ, న్యూరోఫైబ్రోమేటాసిస్ ఉన్నా ఇలా కావచ్చు. ఒత్తిడి వల్ల హాని చేసే హార్మోన్లు విడుదలై మెలనిన్ ఉత్పత్తి తగ్గినా జుట్టు తెల్లగా మారుతుంది. అలాగే ఎక్కువగా ఎండకు వెళ్లినా రేడియేషన్ వల్లా ఈ సమస్య బాధిస్తుంది. సింథటిక్ షాంపూలూ, సబ్బులు ఈ సమస్యకు కారణం అవుతాయి. ఇవన్నీ ఒకెత్తయితే.. పిండిపదార్థాలూ, మిఠాయిలూ, శీతలపానీయాలూ, చాక్లెట్లు ఎక్కువగా తీసుకునేవారిలోనూ జుట్టు త్వరగా నెరుస్తుంది.

చికిత్స: ఏ కారణం వల్ల మీకు త్వరగా జుట్టు నెరిసిందో తెలియాలంటే ముందు సొంతంగా ప్రయోగాలు చేయకుండా వైద్యుల్ని సంప్రదించడం మంచిది. రక్తపరీక్ష చేసి అసలైన కారణాన్ని చెబుతారు. వారి సలహాతో ఆర్గానిక్ హెయిర్‌డైలను ఎంచుకుని వాడాలి తప్ప ఏ రంగులు పడితే అవి వాడకూడదు.

ఆహారంలో మార్పులు: రంగు వాడుతున్నా జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఆహారపరంగానూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏ విటమిన్ ఎక్కువగా తీసుకోవాలి. ఇది మాడుని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆకుకూరలూ, పసుపు రంగులో ఉండే పండ్లూ, కూరగాయలు ఎంచుకోవాలి. ఈ పోషకం నూనెలు స్రవించకుండా చూస్తుంది. అలానే పెరుగు, టొమాటో, క్యాలీఫ్లవర్, అరటిపండ్లు, కాలేయం కూడా తీసుకోవచ్చు. ఈ సమస్య ఉన్నప్పుడు ఇనుమూ, జింక్, రాగి వంటి ఖనిజాలు అవసరం. ఇవి చికెన్, మాంసం, పొద్దుతిరుగుడు గింజలూ, గుడ్డులోని పసుపు సొనా, చేపలూ, రొయ్యల వంటి వాటిలో ఉంటాయి. ఇక, తృణధాన్యాలూ, సోయా, పాలూ, చేపలూ, గుడ్లూ ఎక్కువగా తినడం వల్ల మాంసకృత్తులు అందుతాయి. మాంసం నుంచి బి12 పోషకం ఎక్కువగా అందుతుంది. శాకాహారులు మాత్రం ఫోర్టిఫైడ్ పాలపదార్థాలూ, పాలూ, ధాన్యాల నుంచి ఎంచుకోవాలి. వైద్యులు మీకు మల్టీ విటమిన్ సప్లిమెంట్లు కూడా సూచిస్తారు.



ఇంటివైద్యం: వందగ్రాముల కొబ్బరినూనెలో గుప్పెడు కరివేపాకు వేసి కాయాలి. తరువాత వడకట్టి, చల్లార్చి రాత్రిపూట రాసుకోవాలి. మర్నాడు తలస్నానం చేయాలి. ఇలా రోజు మార్చి రోజు చేయాలి. రెండు చెంచాల ఉసిరి పొడీ, కప్పు కొబ్బరినూనె, చెంచా మెంతిపొడి కలిపి వేడి చేయాలి. ఈ మిశ్రమాన్ని రాసుకుని రెండు గంటలయ్యాక కడిగేయాలి. ఇలా వారంలో రెండుసార్లు చేయాలి. కప్పు నువ్వుల నూనెలో చెంచా మెంతిపొడి, కప్పు క్యారెట్ రసం కలిపి పూతలా వేసుకోవాలి. మర్నాడు తలస్నానం చేయాలి. అలానే కాయ నిమ్మరసంలో పది చెంచాల బాదంనూనె కలిపి రాసుకోవాలి. తలస్నానం చేశాక బ్లాక్‌టీ డికాక్షన్‌ను తలమీద పోసుకుని మళ్లీ కడిగేసుకోవాలి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.





లక్షలు లక్షలుగా వస్తాయి!
పక్కా లక్ష్యంతో వస్తాయి!
గుడ్లు పెట్టి వెళ్లిపోతాయి.
గూడులోని గుడ్లు ఊరికే ఉంటాయా!
అందులోని జీవాలు భూమ్మీద పడతాయి!
గమ్మున సాగరంలో సంగమిస్తాయి.
అలలపైన ఇలా వచ్చేవి..
అలా అలలతోనే వెళ్లిపోతాయి.
అవే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు.
అవి వెళ్లే సమయం ఆసన్నమైంది. అప్పుడే
తీరంలో చిట్టి తాబేళ్ల సందడి మొదలైంది.
అందులో మనమూ భాగమవుదామా...

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు అవి ఎక్కడైతే పుట్టాయో ఆ ప్రాంత పరిసరాల్లోనే గుడ్లు పెడతాయి. ఏడాదంతా సముద్రంలో ఎక్కడెక్కడ ఉన్నా.. గుడ్లు పెట్టే సమయానికి అవి జన్మించిన తీరం దిశగా వచ్చేస్తాయి. తీరం వెంట ఐదారు రోజులు తిరుగాడి.. అనువైన ప్రదేశాన్ని ఎంచుకొని తెల్లవారుఝామున గుడ్లు పెట్టి సముద్రంలోకి వెళ్లిపోతాయి.

తూర్పు తీరంలో చిట్టి తాబేళ్ల బృందగానం

ఓపాలి సూసెల్లిపోండి

ఆపద ముంచుకొస్తున్నా పరిగెత్తలేవు. వేగంగా నడవ లేవు. చాలా భారంగా కదులుతాయి. అయినా జీవిత సత్యాన్ని బోధించాయవి. కుందేలును ఓడించి తాబేలు నేర్పించిన 'నిదానమే ప్రధానం' గుర్తుందిగా! తాబేళ్లు మహా మొండివి.. ఎంతకాలమైనా బతికేస్తాయి. చాలా గట్టివి.. మందర పర్వతాన్ని మోసిన ఘనమైన చరిత్ర వాటిది. అలాంటి తాబేళ్లలో ఒక రకం ఆలివ్‌రిడ్లే. సముద్ర తాబేళ్లలో ఇవే చిన్నవి. ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయివి. పసిఫిక్ మహా సముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం దక్షిణ భాగం, హిందూ మహాసముద్రంలో వీటి ఉనికి ఎక్కువ. మన దేశానికి వస్తే.. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తీరాల్లో కనిపిస్తాయి. ఎప్పుడూ కడలి కౌగిట ఈదులాడే రిడ్లే తాబేళ్లు.. ఏడాదికి ఒకసారి తీరంలో కనువిందు చేస్తాయి. సముద్రంలో ఎక్కడున్నా.. డిసెంబర్-ఫిబ్రవరి మధ్య తీరాలకు చేరుకుంటాయి. తీరం సమీపించిన తర్వాత కొన్నాళ్ల పాటు ఆ ప్రాంతంలోనే ఉంటాయి. ఆడ, మగ తాబేళ్లు కలుస్తాయి. జనవరి, ఫిబ్రవరి నాటికి ఆడ తాబేళ్లు.. లక్షల్లో తీరానికి చేరుకుంటాయి. ఒక ప్రదేశాన్ని ఎంచుకొని.. అడుగున్నర లోతున్న గూడు తవ్వుతాయి. అందులో 100 నుంచి 120 వరకు గుడ్లు పెట్టి.. అవి ఎవరి కంటా పడకుండా.. వాటిపై ఇసుక కప్పేసి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి.

బుడిబుడి అడుగులు..

మార్చి మాసాంతం నుంచి ఈ తీరాల్లో సందడి మొదలవుతుంది. తల్లి తాబేళ్లు వదిలి వెళ్లిన గుడ్లలో నుంచి ఒక్కొక్కటిగా పిల్ల తాబేళ్లు బయటకు వస్తాయి. ఇసుకను తొలుచుకుంటూ పైకి వస్తాయి. వీటి సంఖ్య కోట్లలో ఉంటుంది. ఇసుక గూడు నుంచి బయటకు రాగానే.. ఎవరో పిలిచినట్టు బుడిబుడి అడుగులేస్తూ సముద్రం వైపువెళ్లిపోతాయి. పిల్ల తాబేళ్ల ఉత్సాహం చూసేందుకు ఆయా తీరాలకు దేశం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సముద్ర జలాలతో పచ్చిగా మారిన తీరంపై కాలిముద్రలు వేసుకుంటూ ముందుకెళ్తుంటాయవి. అలల తాకిడికి ఒడ్డుకొచ్చి పడుతూ.. సముద్రంలోకి మళ్లిపోతున్న అదే కెరటంపై తేలాడుతూ సముద్ర గర్భంలో కలిసిపోతాయి.

అందరు కలిసి..





ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న జంతుజాలంలో ఆలివ్ రిడ్లే తాబేలు కూడా ఒకటి. వీటిని కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ గుడ్ల పరిరక్షణకు ఏర్పాట్లు చేస్తున్నాయి. జంతు సంరక్షణ సంఘాలు, ఎన్జీవోలు కూడా ఇందులో పాలు పంచుకుంటున్నాయి. తీరప్రాంత గ్రామవాసులూ ఈ పోరాటంలో భాగమవుతున్నారు. తీరాల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి.. గుడ్లను పదిలంగా చూసుకుంటున్నారు. చిట్టి తాబేళ్లు సముద్రంలో కలిసే ఘట్టాన్ని వేడుకగా చేసుకునే గ్రామాలూ ఉన్నాయి. ఆ ప్రదేశాలు పర్యాటకంగానూ అంతో ఇంతో లబ్ధి పొందుతున్నాయి.

రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకు



శ్రీకాకుళం జిల్లాలో 194 కి.మీ సముద్ర తీర ప్రాంతం ఉంది. తీరం పొడవునా పెద్ద ఇసుక తిన్నెలు విస్తరించి ఉన్నాయి. ఆలివ్‌రిడ్లే తాబేళ్లకు గుడ్లు పెట్టడానికి ఇది అనువైన ప్రదేశం. రణస్థలం నుంచి ఇచ్ఛాపురం తీరం వరకు వీటి జాడ కనిపిస్తుంది. జిల్లాలోని బారువా, కళింగపట్నం, భావనపాడు, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు తీరాలు ఏప్రిల్, మే నెలల్లో కొత్తగా పుట్టుకొచ్చిన తాబేళ్లతో అలరిస్తాయి. వీటి గుడ్ల పరిరక్షణకు అటవీశాఖ తీర ప్రాంతంలో ప్రత్యేక హేచరీలను ఏర్పాటు చేస్తుంటుంది. స్థానిక యువత గుడ్లను పరిరక్షిస్తుంటుంది. గుడ్లు వీధికుక్కలు, ఇతర జంతువులు, గద్దల బారిన పడకుండా వాళ్లు జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రతి రోజూ తీరం వెంట గుడ్లను సేకరించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తుంటారు. గుడ్ల నుంచి బయటకు వచ్చిన పిల్లలను సముద్రంలోకి విడిచిపెడతారు. విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం తీరాల్లోనూ ఆలివ్‌రిడ్లే తాబేళ్లను సంరక్షిస్తున్నారు. వీటిల్లో ఏ ప్రాంతానికి వెళ్లినా చిన్ని చిన్ని తాబేళ్లను చూసినట్టు ఉంటుంది.. సాగర విహారం చేసినట్టు ఉంటుంది.

ఎలావెళ్లాలి?

- హైదరాబాద్, విజయవాడ నుంచి శ్రీకాకుళం చేరుకోవాలి. అక్కడి నుంచి బారువా, భావనపాడు, కళింగపట్నం తదితర ప్రాంతాలకు బస్సులు అందుబాటులో ఉంటాయి.
- హైదరాబాద్, విజయవాడ, విశాఖ నుంచి రైళ్లో.. ఇచ్ఛాపురం జంక్షన్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి కావలసిన తీరానికి వెళ్లొచ్చు.

ఊరంతా సందడే

మహారాష్ట్ర తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లను ఆదరించే గ్రామాలెన్నో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది రత్నగిరి జిల్లాలోని వెలాస్. ఫిబ్రవరిలో ఈ తాబేళ్లు వెలాస్ తీరానికి వచ్చి గుడ్లు పెడతాయి. గ్రామస్థులు, గ్రామ పంచాయతీ, మరికొన్ని పర్యావరణ సంస్థలు కలిసి.. తాబేళ్ల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. మార్చి నాటికి ఆ గుడ్లలో నుంచి తాబేళ్లు బయటకు వస్తాయి. ఈ సందర్భంగా పర్యాటక ప్రియులను సాదరంగా ఆహ్వానిస్తుంటారు వెలాస్ గ్రామస్థులు. మార్చి నెలంతా తాబేళ్ల పండగ నిర్వహిస్తారు. ఈ గ్రామానికి సమీపంలో దివేఆగర్, ఆంజర్లే, హరిహరేశ్వర్ తీరాల్లోనూ తాబేళ్ల సందడి చూడొచ్చు.

ఎలా వెళ్లాలి?

- పుణె నుంచి వెలాస్ 194 కిలోమీటర్లు ఉంటుంది. పుణె నుంచి మండన్‌గడ్ మీదుగా ఇక్కడికి చేసుకోవచ్చు.

ఒడిశాలో..

ఒడిశాలో గోపాల్‌పూర్ బీచ్ మొదలు.. గంజాం సమీపంలోని గహిరమాతా బీచ్ వరకు ఆలివ్‌రిడ్లే తాబేళ్లు లక్షలుగా కనిపిస్తాయి. గంజాం తీరానికి ఈ దఫా నాలుగు లక్షలకు పైగా తాబేళ్లు వచ్చి గుడ్లు పెట్టాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో రోజూ వేల సంఖ్యలో తాబేళ్లు కడలి బాట పడతాయి. పూరీ, కోణార్క్, పారాదీప్ తీరాల్లోనూ ఈ ముచ్చట చూడొచ్చు.

ఎలా వెళ్లాలి?

- బరంపురం రైల్వేస్టేషన్ నుంచి గోపాల్‌పూర్ బీచ్‌కు 18 కి.మీ, గహిరమాతా తీరానికి 34 కి.మీ దూరం. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి భువనేశ్వర్ వెళ్లే దాదాపు అన్ని రైళ్లూ బరంపురంలో ఆగుతాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీల్లో ఈ తీరాలకు చేరుకోవచ్చు.
- భువనేశ్వర్ నుంచి పూరీకి 67 కిలోమీటర్లు. అక్కడి నుంచి కోణార్క్‌కు 36 కి.మీ. ఈ రెండు క్షేత్రాల్లోనూ తాబేళ్ల సందడి కనిపిస్తుంది.

పల్లేటి మోహన్‌రావు, న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

అన్నిటికీ ఒకే అస్త్రం



అసలే అడవి.. అందులో తెలియని వాళ్లతో ప్రయాణం. అందరూ కలిసి సాగితే ఫర్వాలేదు. ఒక్కోసారి ఊహించని ప్రమాదాలు ఎదురవ్వొచ్చు. అలాంటి సమయంలో ఆత్మరక్షణ కోసం దిక్కులు చూడకుండా.. ప్యాంటు జేబులో ఇమిడిపోయే మల్టీటూల్ సెట్‌ని బయటకు తీస్తే సరి. ఇది రకరకాలుగా ఉపయోగపడుతుంది. టెంట్ హౌజ్ వేసేటప్పుడు స్క్రూ డ్రైవర్‌గా పనికొస్తుంది, ఎవరైనా వచ్చి మీదపడ్డప్పుడు కత్తిలా కూడా అక్కరకొస్తుంది. మహిళలు తప్పక దగ్గరుంచుకోవాల్సిన వస్తువిది. వీటిలో పలు రకాల డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. ధర రూ.300 నుంచి రూ.1,000 వరకు ఉంది.

విదేశీ విశేషం


ఒకేచోట పదివేల బుద్ధులు





బుద్ధుడి విగ్రహం చూస్తే చాలు.. మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాంటిది పదివేల బుద్ధ విగ్రహాలు ఒకే చోట ఉంటే.. అద్భుతం అనిపిస్తుంది. కెనడా భూభాగంలోని నయాగరా జలపాతం సమీపంలో ఉంటుంది చామ్‌షాన్ బౌద్ధ ఆలయం. ఈ ఆలయం ప్రాంగణంలో రకరకాల బుద్ధ విగ్రహాలు అలరిస్తాయి. లోనికి వెళ్తే ఆనందం పదింతలు అవుతుంది. అడుగడుగునా అందమైన బుద్ధుడి ప్రతిమలు కనిపిస్తాయి. ఒక్కో మూర్తిలో ఒక్కో కళ. ప్రధాన విగ్రహం చుట్టూ గూళ్లల్లో కొలువుదీరిన చిన్న చిన్న బుద్ధ విగ్రహాలు బంగారు వర్ణంలో మెరిసిపోతుంటాయి. 1995లో దీని నిర్మాణం మొదలైంది. 2002లో పూర్తయింది నయాగరా జలపాతాన్ని దర్శించడానికి వచ్చే పర్యాటకుల్లో చాలామంది చామ్‌షాన్ ఆలయాన్ని సందర్శించి వెళ్తుంటారు.

రామ్‌బాగ్ రాముడికి నిజాం సలాం



చారిత్రక హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక కేంద్రాలకు కొదవ లేదు. ఈ రెండింటి మేలుకలయికతో నిర్మితమైన ఆలయమే అత్తాపూర్ సమీపంలోని రామ్‌బాగ్‌లో ఉన్న రామాలయం. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ రామాలయం నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథలు ప్రచారంలో ఉన్నాయి.

అసఫ్‌జాహీల కాలంలో దిల్లీ నుంచి చాలామంది కాయస్తులు హైదరాబాద్‌కు వచ్చారు. అలా వచ్చిన వారిలో కొందరు నిజాం కొలువులో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. రాజా భవనీప్రసాద్ భట్నాగర్ రాజ సేవకులకు జీతభత్యాలు చెల్లించే అధికారిగా ఉండేవాడు. ఆయన నిర్మించినదే ఈ ఆలయం. పెళ్లీడుకొచ్చిన తన కొడుకు మృతిచెందడంతో ఆ ఆవేదన తీరడానికి భవానీ ప్రసాద్ రామాలయం కట్టించాలని అనుకున్నాడు. ఆలయ నిర్మాణం సాగుతుండగా ఒకరోజు శ్రీరాముడు భవానీ ప్రసాద్ కలలో కనిపించి.. "నా విగ్రహాలు గద్వాల్ సంస్థానంలో ఉన్నాయ"ని చెప్పాడట. ఆ మాట మేరకు గద్వాల్ నుంచి విగ్రహాలను తెప్పించారు. 1812లో ఆలయ ప్రతిష్ఠ జరిగింది. ఈ మహోత్సవానికి అప్పటి మూడో నిజాం సికిందర్ జా కూడా హాజరై మతసామరస్యాన్ని చాటారు. అంతేకాదు ఆలయ అర్చకులకు ప్రతి రోజూ రూ.2 చొప్పున మంజూరు చేశారు. ఆలయ నిర్వహణకు కూడా కొంత మొత్తం మంజూరు చేశారట నిజాం రాజు. సుమారు నాలుగున్నర ఎకరాల్లో విస్తరించి ఉన్న రామ్‌బాగ్ ఆలయం ప్రశాంతంగా ఉంటుంది. గద్వాల నుంచి విగ్రహాలతో వచ్చిన అర్చకుల వంశీయులే నేటికీ ఇక్కడ అర్చకత్వం వహిస్తున్నారు.

వెన్నెల్లో.. రామచంద్రుడు

ఏకశిలానగరం..
కానీ ఓరుగల్లు కాదు!
తెలుగునాట
సీతారామలక్ష్మణులు
కొలువుదీరిన పుణ్యధామం..
కానీ భద్రాద్రి కాదు!
వాల్మీకి రామాయణంలో
కనిపించనిది..
వెన్నెల వెలుగుల్లో
మురిపించేది.. ఒకే క్షేత్రం.
అదే ఒంటిమిట్ట!
ఆంధ్రప్రదేశ్‌లో అపర
భద్రాచలంగా పేరొందిన ఈ
దివ్యక్షేత్రం శ్రీరామనవమికి
సర్వాంగ సుందరంగా
ముస్తాబవుతోంది.



దొంగలు కట్టిన గుడి

ఒంటిమిట్టకు ఆ పేరు ఇద్దరు దొంగల వల్ల వచ్చింది. వంటుడు, మిట్టుడు అనే ఇద్దరు దొంగలు దారిదోపిడీలు చేస్తూ.. దోచుకున్న ధనాన్ని ఒంటిమిట్ట గుహల్లో దాచుకునేవారు. కోదండరాముడు ఆ దొంగల బుద్ధి మార్చి వారిని సన్మార్గంలో నడిచేలా అనుగ్రహించాడట. ఆ ఇద్దరూ స్వామివారికి గుడి కట్టించారని చెబుతారు. అలా ఈ క్షేత్రానికి ఒంటిమిట్ట అని పేరు వచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉంది ఒంటిమిట్ట. చుట్టూ కొండలు, పచ్చని పంటపొలాల మధ్యలో ఉంటుంది ఇక్కడి కోదండ రామాలయం. అపురూప శిల్పసంపదతో అలరారుతున్న ఈ దేవాలయ నిర్మాణంలో చోళరాజులు, విజయనగర రాజులు, మట్టిరాజుల కళావైభవం కనిపిస్తుంది. రాజగోపురాలపై అందమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ మంటపంలోని ప్రతి స్తంభం ఒక కళారూపాన్ని ప్రదర్శిస్తుంది.

యుగయుగాల క్షేత్రం

ఒంటిమిట్ట ఆలయం వెనుక పౌరాణిక గాథలు ఎన్నో ఉన్నాయి. త్రేతాయుగంలో శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలిసి ఇక్కడికి వచ్చి రాక్షసులను సంహరించాడట. దానికి కృతజ్ఞతగా మునులు ఏకశిలపై సీతారామ లక్ష్మణుల రూపాలను చెక్కారట. అందుకే ఇది ఏకశిలానగరమైంది. ద్వాపరయుగంలో జాంబవంతుడు ఈ మూర్తిని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ చేశాడట.

చతుర్దశి నాడు..

ఒంటిమిట్ట ఆలయంలో ప్రత్యేకతలు ఎన్నో. సాధారణంగా శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. ఇక్కడ మాత్రం చైత్ర శుద్ధ చతుర్దశి నాడు కల్యాణం చేస్తారు. రామాయణం ప్రకారం సీతారాముల వివాహం చైత్ర మాసంలో ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో జరిగింది. ఒంటిమిట్ట లోనూ అదే రోజున కల్యాణం చేయాలని విజయనగర సామ్రాజ్య నిర్మాతల్లో ఒకరైన బుక్కరాయలు నిర్ణయించారట. తొలికల్యాణ మహోత్సవానికి ఉత్తరఫల్గుణి నక్షత్రం ఘడియలు రాత్రి పూట ఉండటంతో రాత్రివేళలోనే కల్యాణం జరిపించారు. నాటి నుంచి నేటి వరకు చతుర్దశి వెన్నెల్లో స్వామివారి పెళ్లి నిర్వహిస్తున్నారు. ఒంటిమిట్ట గర్భాలయంలో ఆంజనేయుడి విగ్రహం కనిపించదు. పవన సుతుడు.. సంజీవరాయుడిగా ఆలయం ఎదురుగా ఉంటాడు. బమ్మెర పోతన భాగవత కావ్యాన్ని ఇక్కడే రాశారని చెబుతారు. ఒంటిమిట్టకు ఏడాది పొడుగునా పర్యాటకుల తాకిడి ఉంటుంది. శ్రీరామనవమి సందర్భంగా, చతుర్దశి రోజు జరిగే కల్యాణాన్ని తిలకించడానికి ఈ క్షేత్రానికి అసంఖ్యాకంగా భక్తులు తరలివస్తారు. స్వామివారి సేవలో తరించి.. కోదండరాముడి కొండంత దీవెనలు అందుకొని తిరుగు ప్రయాణం అవుతారు.



ఇలా చేరుకోవచ్చు

ఒంటిమిట్ట కడప నుంచి 32 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కడప నుంచి బస్సులు, ట్యాక్సీల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. తిరుపతి నుంచి వచ్చే వారు రైలులో నందలూరుకు చేరుకుని అక్కడి నుంచి బస్సులో వెళ్లొచ్చు.

– గాలి సురేష్, ఈనాడు, కడప
– సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట

సంతోషమా.. నువ్వెక్కడ!

- ప్రపంచ దేశాల్లో ఫిన్‌లాండ్ ప్రథమం
- 133వ స్థానంలో భారత్
- ఐరాస సంతోషదాయక దేశాల నివేదిక

లండన్/ ఐరాస

భూమిపై సంతోషం వెల్లివిరుస్తున్న దేశాల్లో భారత్ 133వ స్థానంలో నిలిచింది. మొత్తం 156 దేశాల వివరాలతో ఐక్యరాజ్య సమితి 2018 ప్రపంచ సంతోష నివేదికను వెల్లడించింది. అత్యంత సంతోషదాయక దేశంగా ఫిన్‌లాండ్ నిలవగా.. తూర్పు ఆఫ్రికాలోని బురుండి ఆఖరు స్థానంలో ఉంది. జాబితాలో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ తదితర పొరుగుదేశాలు భారత్ కంటే ముందున్నాయి. ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక సామరస్యం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఐరాసకు చెందిన సుస్థిరాభివృద్ధి సాధన విభాగం (ఎస్‌డీఎస్ఎన్) ఈ నివేదికను రూపొందించింది. గత ఏడాది ఈ జాబితాలో 128వ స్థానంలో ఉన్న భారత్ 0.698 పాయింట్లు తగ్గి ఈ ఏడాది మరింత దిగువకు పడిపోయింది. ఈనెల 20న అంతర్జాతీయ సంతోష దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను విడుదల చేసింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇతర దేశాలకు వలసలు పెరుగుతున్నాయని.. అలా వెళ్లినవారు చాలా దేశాల్లో సంతోషకర జీవితాన్ని గడుపుతున్నట్లు నివేదిక పేర్కొంది. 'సంతోషం' విషయంలో వివిధ దేశాల మధ్య ఉన్న తేడానే వలసలకు కారణమవుతున్నట్లు తెలిపింది. అలాగే వివిధ దేశాల్లోని వలసదారుల సంతోష స్థాయిలను కూడా తొలిసారిగా ఐరాస అధ్యయనం జరిపింది. ఇలాంటి వలసలు ఎక్కువగా ఉన్న 117 దేశాల్లో భారత్ 91వ స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. ఏ దేశమైతే వలస వచ్చిన వారిని తమలో కలుపుకొంటుందో.. అక్కడ వారితో పాటు, స్థానికులు కూడా సంతోషంగా ఉంటున్నట్లు నివేదిక వెల్లడించింది. కాగా అమెరికాలో ఊబకాయం, మాదకద్రవ్యాల అలవాటు, కుంగుబాటు వంటి రుగ్మతలు పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది.

ప్రథమం: 55 లక్షల జనాభా ఉన్న ఫిన్‌లాండ్ సురక్షిత, అత్యుత్తమ పాలన ఉన్న దేశంగా గుర్తింపు పొందింది. అవినీతి అతి తక్కువ ఉన్న దేశాల్లో కూడా ఒకటిగా నిలిచింది. ఇక్కడి పోలీసులు ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన వారు కాగా.. బ్యాంకులు కూడా మంచిపేరు పొందాయి.

చివరి స్థానం: బురుండిలో దేశాన్ని వదిలి వెళ్లాలన్న ఆంక్షలు, పౌర యుద్ధాలు, తిరుగుబాట్లు తదితర కారణాలతో ప్రజల్లో అశాంతి ఎక్కువగా ఉంది.

2018 - మొదటి 10 దేశాలు
(బ్రాకెట్‌లో గతేడాది ర్యాంకులు)

1. ఫిన్‌లాండ్ (5)	6. నెదర్లాండ్స్ (6)
2. నార్వే (1)	7. కెనడా (7)
3. డెన్మార్క్ (2)	8. న్యూజిలాండ్ (8)
4. ఐస్‌లాండ్ (3)	9. స్వీడన్ (10)
5. స్విట్జర్లాండ్ (4)	10. ఆస్ట్రేలియా (9)

ప్రముఖ దేశాల స్థానమెక్కడ?

జర్మనీ:	15	జపాన్:	54
అమెరికా:	18	దక్షిణ కొరియా:	57
యూకే:	19	రష్యా:	59
ఫ్రాన్స్:	23	దక్షిణాఫ్రికా:	105
సౌదీఅరేబియా:	33		

భారత్ పొరుగు దేశాలు..

పాకిస్థాన్ :	75	బంగ్లాదేశ్ :	115
చైనా :	86	శ్రీలంక :	116
భూటాన్ :	97	అఫ్గానిస్థాన్ :	145
నేపాల్ :	101		

చిట్టచివరి 10 స్థానాలు..

147. మాల్వి (136)	153. టాంజానియా (153)
148. హైతి (145)	154. దక్షిణసూడాన్ (147)
149. లిబేరియా (148)	155. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ (155)
150. సిరియా (152)	156. బురుండి (154)
151. రువాండా (151)	
152. యెమెన్ (146)	



అమరావతిలో బసవతారక క్యాన్సర్ ఆసుపత్రి

- త్వరలో భూమిపూజ: బాలకృష్ణ

హిందూపురం, న్యూస్‌టుడే: అమరావతిలో బసవతారక ఇండో క్యాన్సర్ ఆసుపత్రికి త్వరలో భూమిపూజ చేయనున్నట్లు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారమే ఇందుకు సంబంధించి భూరిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. లేపాక్షి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం అనంతపురం జిల్లా అధికారులతో లేపాక్షి నవోదయా విద్యాలయలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేపాక్షి ఉత్సవాలను ఈనెల 31, ఏప్రిల్ 1న జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఇందుకుతగ్గ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్చి 31 సాయంత్రం లేపాక్షికి చేరుకొని మొదట లేపాక్షి పెద్ద చెరువులో హంద్రీనీవా ద్వారా నింపిన కృష్ణా జలాలకు జలహారతినిస్తారని తెలిపారు. ఉత్సవాల లోగోను కలెక్టర్ వీరపాండియన్‌తో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ విడుదల చేశారు.



లేపాక్షి ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, కలెక్టర్ వీరపాండియన్

'పది' పరీక్షలు షురూ

మొదటి రోజు నుంచే మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ భాష అయిన తెలుగు, హిందీ, ఉర్దూ తదితర సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. మొత్తం 5,38,867 మందిలో 99.57 శాతం విద్యార్థులు హాజరయ్యారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో ఓ పరీక్షా కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ ఇద్దరు ఇంటర్ విద్యార్థులు దొరికిపోయారు. వరంగల్‌లోని ఓ కేంద్రంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేయగా విద్యార్థి వద్ద చిట్టీలు దొరికాయి. దాంతో అక్కడున్న ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తమకు అనుమతి లేదని మరో పాఠశాల నుంచి హాల్‌టికెట్లు జారీ అయినట్లు సృష్టించింది. అయితే వారిని అనుమతించలేదు.

పర్యావరణ అనుమతులు రద్దు చేయలేం

- 'కాళేశ్వరం'పై ఎన్జీటీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు రద్దు చేయలేమని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) స్పష్టం చేసింది. కాళేశ్వరం పర్యావరణ అనుమతుల్ని సవాల్ చేస్తూ హయతుద్దీన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ జావేద్ రహీం నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సంజయ్ ఉపాధ్యాయ వాదనలు వినిపిస్తూ.. తాము కేవలం 22 రోజులు ఆలస్యంగా మాత్రమే పిటిషన్ వేసినందున అనుమతించాలని కోరారు. తాము పిటిషన్ వేసిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు త్వరత్వరగా తెచ్చుకుందన్నారు. తాగునీటి అవసరాల కోసం అని చెబుతూ ఈసీ అనుమతులు వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుగా చేపడుతున్నారని ఆరోపించారు. అనుమతులు అన్నీ తప్పులేననీ, వాటిని రద్దు చేయాలన్నారు. అనుమతులు రద్దు చేయాల్సిన అవసరం లేదనీ, 22 రోజులు ఆలస్యంగా పిటిషన్ వేయడమనే అంశాన్ని తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. తీర్పును ఉల్లంఘిస్తున్నట్లనిపిస్తే హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేయాలనీ, లేకపోతే ఎగ్జిక్యూషన్ పిటిషన్ వేసుకోవాలని ధర్మాసనం సూచించింది. కాళేశ్వరంపై ఇతర కేసులు కూడా ఉన్నాయని అన్నీ కలిపి విచారించాలని న్యాయవాది కోరారు. ప్రధాన న్యాయమూర్తి లేనందున తాము ఇతర ధర్మాసనాల్లోని కేసులన్నీ జతచేసి ఒకే కోర్టుకి తీసుకురాలేమని న్యాయమూర్తి తెలిపారు. పిటిషనర్ అభ్యంతరాలపై ప్రభుత్వం పదిరోజుల్లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం ఏప్రిల్ 12కు విచారణ వాయిదా వేసింది.

కడప ఉక్కు కర్మాగారంపై చర్చలు

- కేంద్ర ఉక్కుశాఖ మంత్రితో వెంకయ్యనాయుడు సమాలోచనలు
- ఏడాది చివరిలోగా శంకుస్థాపన జరిగేలా చూడాలని సూచన

ఈనాడు, దిల్లీ: కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గురువారం పార్లమెంటులోని తన ఛాంబర్‌లో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి చౌదరీ బీరేంద్రసింగ్, ఆ శాఖ కార్యదర్శి అరుణాశర్మలతో మాట్లాడారు. మెకాన్ సంస్థ ఇచ్చిన నివేదికలో ఏం వచ్చింది? దాని గురించి ఏం చేస్తున్నారన్న దానిపై ఆరా తీశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కూడా పాల్గొన్నారు. నివేదిక సానుకూలంగా ఉన్నట్లు కేంద్రమంత్రి బీరేంద్రసింగ్ చెప్పారు. 'విద్యుత్తు, నీళ్లు, రైల్వే లైన్, ఇనుప ఖనిజం అనుసంధానంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకోవాలి. 20 కిలోమీటర్ల దూరం రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సంబంధిత గనుల్లో ఖనిజ నాణ్యత 62% ఉన్నట్లు తేలింది. అది ఉక్కు తయారీకి పనికొస్తుందా? లేదా? అన్నది జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారితో నిర్ధరించుకుంటాం. నాణ్యత మంచిదేనని, అది ఖచ్చితమని తేలితే ముందుకెళ్తాం. మేం కూడా సానుకూలంగా ఉన్నాం. ఏయే సౌకర్యాలు కల్పించేదీ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మెకాన్‌కు చెప్పింది. దీనిపై మరోసారి ప్రభుత్వంతో మాట్లాడి అన్నింటినీ నిర్ధరించుకొని ముందుకెళ్తాం..." అని కేంద్ర మంత్రి వివరించారు. ఈ ఏడాది చివరిలోగా ప్రధానమంత్రితో శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకోవాలని వెంకయ్యనాయుడు సూచించగా... కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ముందడుగు వేస్తామన్నారు. ఒకవేళ కర్మాగారం ఏర్పాటు చేయడానికి ప్రైవేటు సంస్థలు ముందుకు రాకపోతే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సెయిల్, ఆర్ఐఎన్ఎల్ లాంటి వాటి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని కంభంపాటి హరిబాబు కేంద్రమంత్రిని కోరారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో సమావేశమైన కేంద్ర మంత్రి చౌదరి బీరేందర్ సింగ్

డిపాజిట్టు చేస్తే జప్తు చేసిన ఆస్తుల విడుదల

జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ జప్తు ఉత్తర్వులను సవరించిన అప్పిలేట్ అథారిటీ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా హెటిరో, అరబిందో, ట్రైడెంట్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన తాత్కాలిక జప్తును సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను అప్పిలేట్ అథారిటీ ఇటీవల సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వై.ఎస్. ప్రభుత్వం హెటిరో, అరబిందోలకు జడ్చర్ల సెజ్‌లో 75 ఎకరాల చొప్పున తక్కువ ధరకు కేటాయించిందని, ప్రతిఫలంగా ముడుపుల రూపంలో జగన్‌కు చెందిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టారన్న సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. ఇందులోభాగంగా హెటిరో, అరబిందో గ్రూపు సంస్థలతో పాటు జగన్‌కు చెందిన జగతి, జనని ఇన్‌ఫ్రాలకు చెందిన రూ.51 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను 2012 అక్టోబరు 4న ఈడీ తాత్కాలిక జప్తు చేసింది. ఈ జప్తును సమర్థిస్తూ దిల్లీలోని అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేయగా జగతి, జనని, హెటిరో, అరబిందో, ఏపీఎల్ కంపెనీలు అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాయి. తమ ఆస్తులకు బదులుగా డిపాజిట్ చేస్తామని నేరంతో సంబంధం లేని ఆస్తులను విడుదల చేయాలని హెటిరో, అరబిందోలు కోరాయి. వాదనలు విన్న అథారిటీ పెట్టుబడులు సక్రమమైనవేనా, ముడుపుల రూపంలో వచ్చాయా అన్నది ఇప్పుడు తాము తేల్చలేమని, ఆ విషయాన్ని ప్రత్యేక కోర్టు తేలుస్తుందని పేర్కొంది. డిపాజిట్ చేస్తామన్న పిటిషనర్ల అభ్యర్థనను అనుమతిస్తూ అరబిందో రూ.9.90 కోట్లు, హెటిరో రూ.5.60 కోట్లు, జనని రూ.15 కోట్లను ఆరు వారాల్లో డిపాజిట్ చేయాలని, అనంతరం జప్తు చేసిన స్థిరాస్తులను విడుదల చేయాలని ఈడీని ఆదేశించింది.



తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం మొదలైన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించాం. మనకున్న వనరులను, అవసరాలను సరిగ్గా అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకొని ముందుకుసాగడం వల్లే రాష్ట్రం ప్రగతిని సాధిస్తోంది.

కృషీవలుడు

కేటాయింపు రూ.15,511 కోట్లు

ఈనాడు – హైదరాబాద్

పంటల సాగుకు సీజన్ ఆరంభంలోనే ఎకరానికి ఏటా రూ.8 వేల చొప్పున ఇచ్చే 'రైతులక్ష్మి' పథకానికి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది వానా కాలం(ఖరీఫ్), యాసంగి(రబీ) సీజన్లకు కలిపి రూ.12 వేల కోట్లను ఇచ్చారు.

- మొత్తం కోటీ 72 లక్షల ఎకరాల్లో ఏటా రెండు పంటలు సాగుచేసేవారికి రూ.8 వేలు, ఒక పంట వేస్తే రూ.4 వేలను ఇస్తారు. మొత్తం 72 లక్షల మంది రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. రాష్ట్ర వ్యవసాయ రంగంలో అత్యంత ఎక్కువ నిధులు ఒకే ఏడాదిలో కేటాయించిన భారీ పథకం ఇదొక్కటే. వచ్చే నెల 19, 30, మే 15 తేదీల్లో మూడు దఫాలుగా వానాకాలం సీజన్‌కు సంబంధించిన రూ.4 వేల చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటికల్లా బ్యాంకులకిచ్చేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులిచ్చారు.
- రైతు మరణిస్తే అతని కుటుంబానికి బీమా పరిహారంగా రూ.5 లక్షలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా 'రైతు బీమా' పథకాన్ని ప్రకటించి బడ్జెట్‌లో రూ.500 కోట్లను ప్రతిపాదించారు. ఈ పథకానికి ఇంకా ఎక్కువ సొమ్ము ఖర్చయ్యే అవకాశం ఉందని, ప్రాథమికంగా రూ.500 కోట్లను ఇచ్చినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఇది కూడా పూర్తిగా కొత్త పథకం.
- 'రైతు వేదిక'ల పేరుతో మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రతి 5 వేల ఎకరాల పొలాలకు కేంద్రంగా ఉండే ఒక గ్రామంలో 'రైతు వేదిక' పేరుతో సామాజిక భవనం నిర్మించడానికి రూ.158.94 కోట్లు కేటాయించారు. ఈ పథకానికి రైతుల నుంచి సైతం భూములు, నగదు విరాళంగా అడుగుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు 17 ఎకరాల భూమి, రూ.22 లక్షల నగదు ఇచ్చారు.
- వ్యవసాయ యంత్రాల రాయితీ పథకానికి కూడా ప్రస్తుత ఏడాది కంటే వచ్చే ఏడాదికి రూ.156.63 కోట్లు పెంచారు. పంటలబీమా పథకానికి రూ.14 కోట్లు కోత పెట్టారు. విత్తన రాయితీలకు అదనంగా మరో రూ.40 కోట్లు పెంచారు. కూరగాయలు, పండ్లు వంటి ఉద్యాన పంటలకు రాయితీలిచ్చి ప్రోత్సహించేందుకు అదనంగా మరో రూ.50 కోట్లు ఇచ్చారు. హరిత పందిళ్ల పథకం కింద రాయితీల బకాయిలు తీర్చడానికి రూ.119 కోట్లు కేటాయించారు.
- బిందు సేద్యం పథకానికి ఈ ఏడాది నాబార్డు రుణంలో రాయితీలిస్తుండగా వచ్చే ఏడాది రాష్ట్ర కోటా కింద రూ.55.98 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మార్కెట్లలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈనామ్) పథకం కింద అభివృద్ధి చేసేందుకు రూ.50 కోట్లు ప్రతిపాదించారు. గోదాముల నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ నాబార్డు నుంచి తీసుకున్న అప్పుల వాయిదా సొమ్ము చెల్లించడానికి రూ.50 కోట్లు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో 'కేంద్ర ప్రాయోజిత పథకాల'(సీఎస్ఎస్)కు కేంద్రం నుంచి రూ.775.68 కోట్లు వస్తాయని అంచనా. ప్రస్తుత ఏడాదికన్నా ఇది రూ.87 కోట్లు అధికం.
- శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి వచ్చే ఏడాదికి 17.61 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించారు. ఈ విశ్వవిద్యాలయాభివృద్ధికి భారీగా నిధులు అవసరమైనా వ్యవసాయ వర్శిటీకిచ్చిన సొమ్ములో కనీసం ఐదో వంతు కూడా ఇవ్వలేదు.

వ్యవ'సాయ'మంతా రుణమాఫీకే!



గత నాలుగేళ్లుగా బడ్జెట్‌లో వ్యవసాయానికి భారీగానే కేటాయిస్తున్నా.. నిధుల్లో సింహభాగం రుణమాఫీకే ఖర్చయ్యాయి. మిగిలిన నిధుల్లో అధిక భాగం వివిధ రాయితీ పథకాల కోసం కేటాయిస్తున్నా వీటిలో 50% కూడా విడుదల కావటం లేదు.

వ్యవసాయ శాఖ బడ్జెట్ ఏటా రూ. 4-6 వేల కోట్ల మధ్య ఉంటే.. అందులో రుణ మాఫీకి పోతోంది రూ.. 4 వేల కోట్లు

'రుణ మాఫీ' నుంచి రైతు లక్ష్మికి

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచీ రుణమాఫీ ఉండదు. దీని స్థానంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'రైతులక్ష్మి' పథకం తీసుకువస్తోంది.

- రైతుకు ఎకరాకు రూ.4 వేల వంతున చెక్కుల రూపంలో ఇస్తారు.
- ఖరీఫ్, రబీ రెండు పంటలు సాగుచేసే రైతుకు రూ.8 వేల వంతున ఇస్తారు. దీనికి రూ.12,000 కోట్లు కేటాయించారు.

రాయితీ పథకాలకు 50 శాతమే!

రైతులకు బాసటగా నిలిచేందుకు యాంత్రీకరణ నుంచి విత్తనాల వరకూ ప్రతి దశలోనూ వివిధ రాయితీ పథకాలను అమలు చేస్తున్నారు. అయితే వీటికి కేటాయింపులు దండిగానే ఉంటున్నా ఒక్క విత్తన రాయితీ తప్పించి మిగతా పథకాలకు వాస్తవంగా విడుదల అవుతున్నది 50% దాటటం లేదు.

2017-18 లో వివిధ రాయితీ పథకాలకు కేటాయింపులు, వాస్తవిక ఖర్చులు

	యాంత్రీకరణ	హరిత పందిరి	విత్తన రాయితీ
కేటాయింపు	రూ.336.80 కోట్లు.	రూ.192 కోట్లు	రూ.138 కోట్లు
విడుదలైంది	రూ.100 కోట్లు	రూ.74 కోట్లు	రూ.126 కోట్లు

బిందు, తుంపర్ల సేద్యం పథకం రూ. 1000 కోట్లు ఈ మొత్తం నాబార్డ్ నుంచి రుణంగా తీసుకున్నారు.

వ్యవసాయ శాఖకు కేటాయింపు, ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	4800	4800
2015-16	5408	4850
2016-17	5491	4500
2017-18	5899	4711

ఉద్యాన శాఖకు నిధుల తీరు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	560.87	255.91
2015-16	740.99	402.32
2016-17	550	420
2017-18	370.05	226

పంటల కొనుగోలుకు అప్పులే!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'రైతు సమన్వయ సమితి' (రైసస) రాష్ట్ర సంస్థకు బడ్జెట్‌లో నిధులేమీ కేటాయించలేదు. వచ్చే వానాకాలం నుంచి రైతులు సాగు చేసే పంటలకు మార్కెట్‌లో మద్దతు ధరకన్నా తక్కువకు పడిపోతే ఈ సంస్థ కొంటుందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపినా నిధులు ఇవ్వలేదు. అప్పటి అవసరాలను బట్టి ప్రభుత్వం పూచీకత్తు ఇస్తే బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఆ సొమ్ముతో పంటలు కొనాల్సి ఉంటుంది. పంటల 'ధరల స్థిరీకరణ నిధి' (ఎంఎస్ఎఫ్) పద్దు కింద రూ.400 కోట్లు కేటాయించాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. కానీ బడ్జెట్‌లో ఈ నిధి ప్రస్తావన లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత ఒక్క ఏడాది మాత్రమే ఈ నిధికి బడ్జెట్‌లో చోటు దక్కింది. కానీ గత రెండేళ్లుగా అదీ లేదు. దీనివల్ల పంటలకు ధరలు పడిపోయినప్పుడు కొనడం కష్టమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సోయాచిక్కుడు, కందులు, మినుము పంటలను మద్దతు ధరకు కొన్నారు. వీటిలో కందులు కొన్నా బడ్జెట్ కేటాయింపులు లేక రైతులకు గత రెండు నెలలుగా సొమ్ము చెల్లించలేకపోయారు. మొత్తం రూ.1350 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే ఇందులో రూ.600 కోట్లను బ్యాంకుల నుంచి అప్పులుగా తీసుకున్నారు. మరో రూ.640 కోట్లను తీసుకోవడానికి రెండు రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చింది. వచ్చే ఏడాది రైసస సంస్థ నేరుగా మద్దతు ధరకు కొనాలన్నా బ్యాంకుల నుంచి రూ.ఆరేడు వేల కోట్ల వరకూ అప్పులు తీసుకునేందుకు పూచీకత్తు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. అందుకే బడ్జెట్‌లో కేటాయింపులు లేవని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. వచ్చే ఏడాది నుంచి కేంద్రం మద్దతు ధరలకు పంటల కొనుగోలు బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకొనేందుకు కొత్త పథకాన్ని తెస్తోంది. ఇకనుంచి రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా మద్దతు ధరకు పంటలను కొనాలి. తిరిగి వాటిని అమ్ముకున్నప్పుడు నష్టం వస్తే నష్టపోయిన సొమ్ములో 40 శాతం తాము ఇస్తామని కేంద్రం కొత్త పథకంలో షరతు పెట్టింది. పంటలు కొనాలంటే ముందుగా నిధులు సమకూర్చాలని ఇందుకోసం ప్రత్యేకంగా 'ధరల స్థిరీకరణ నిధి' పెట్టాలని తెలంగాణ వ్యవసాయశాఖ కేంద్రాన్ని కోరింది. కానీ కేంద్ర బడ్జెట్‌లో అలాంటి నిధి ఏర్పాటుచేయలేదు. రాష్ట్ర బడ్జెట్‌లోనూ సదరు నిధి లేదు. ఇక అప్పులు తీసుకుంటే... అవీ సకాలంలో రైసస సంస్థ చేతికి అందితేనే మద్దతు ధరకు కొని రైతులకు సొమ్ము వెంటనే ఇవ్వడం సాధ్యమయ్యే అవకాశం ఉంది.

పశుసంవర్ధక శాఖకు అంతంత మాత్రమే

పంటల సాగుకు భారీగా నిధులిచ్చిన ప్రభుత్వం పాడి, మత్స్య రంగానికి పెద్దగా ఇవ్వలేదు. పశుసంవర్ధకశాఖ పథకాలకు రూ.237.19 కోట్లు కేటాయించింది. గతేడాదికన్నా రూ.87 కోట్లు పెంచింది. మత్స్య అభివృద్ధి పథకాలకు గత బడ్జెట్‌లో రూ.60.50 కోట్లు కేటాయించి చివరికి రూ.56.15 కోట్లుగా సవరించింది. వచ్చేఏడాదికి రూ.52.26 కోట్లే ప్రతిపాదించింది. పశువైద్యశాలలకు, పశువులకిచ్చే మందులకు రూ.90.56 కోట్లు, కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించారు. పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయానికి రూ.21 కోట్లు ఇచ్చింది.

వడ్డీ వ్యాపారులే దిక్కు!

తెలంగాణలో ప్రజలు తమ రుణ అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల మీదే అధికంగా ఆధారపడుతున్నారు.

45.1% కుటుంబాలకే సంస్థాగత రుణాలు

రాష్ట్రంలో సంస్థేతర రుణాలపై ఆధారపడుతున్న కుటుంబాలు **57.8%**

ఇందులో వడ్డీ వ్యాపారస్తుల సంఖ్యే అధికం

రాష్ట్ర వ్యాప్తంగా అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న కుటుంబాలు

50.6%

అప్పు దొరుకుతోందా?

రాష్ట్రంలో రుణ లభ్యత బాగుంది

70.7% మందికి రుణాలు దొరుకుతున్నాయి

లభ్యత పట్టణ, నగర జనాభా కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే రుణ లభ్యత బాగుంది.

గ్రామీణ కుటుంబాలకు రుణ లభ్యత	83.3%
పట్టణ కుటుంబాలకు రుణ లభ్యత	53.4%
సంస్థాగత రుణాలు పొందుతున్నవారు	45.1%
వీటిలో వాణిజ్య బ్యాంకుల వాటా	16%
సహకార బ్యాంకుల వాటా	9.3%

సగటు రుణం పట్టణాల్లో అధికం

రాష్ట్రంలో ఒక్కో కుటుంబానికి లభించే సగటు రుణం రూ.5.98 లక్షలు.

గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు లభించే సగటు రుణం 3.23 లక్షలు

పట్టణ/నగర ప్రాంతాల్లోని కుటుంబాలకు రూ.11.92 లక్షలు

ఎస్సీ, ఎస్టీలకు..

- సంస్థాగత రుణ లభ్యత తక్కువ
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయించటమే ఎక్కువ
- వ్యవసాయం కంటే రోజువారీ ఇంటి అవసరాల కోసం అప్పు చెయ్యటమే ఎక్కువ

అప్పు చేసి ఇల్లు కట్టు

- రాష్ట్రంలో గృహ వసతి కోసమే అధికంగా అప్పులు చేస్తున్నారు.
- గృహ వసతి కోసం 28%
- వ్యవసాయేతర ఖర్చుల కోసం 26%
- గృహ అవసరాల కోసం 20%

సంస్థాగత రుణాలు
వడ్డీభారం తక్కువ, ఛార్జీలు-రుసుములు పరిమితం, వేధింపులు తక్కువ.
సంస్థేతర రుణాలు
వడ్డీరేట్లు ఎక్కువ, వేధింపులూ అధికం

(తెలంగాణ సామాజిక అభివృద్ధి నివేదిక– 2017 ప్రకారం)

కొత్త బస్సులకు కొంత

తెలంగాణ ఆర్టీసీకి 2018-19 వార్షిక బడ్జెట్‌లో మొత్తం రూ.975 కోట్లు కేటాయించారు. ఇందులో కొత్త బస్సుల కొనుగోలు కోసం రూ.140 కోట్లను, బస్సుల్లో వివిధ వర్గాలకు కల్పిస్తున్న రాయితీల కింద రూ.520 కోట్లను, ప్రభుత్వ పూచీకత్తుతో తీసుకున్న రుణాలను తీర్చేందుకు రూ.315 కోట్లను ప్రతిపాదించారు. మరో 15 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా ఇప్పటివరకు.. గతేడాది బడ్జెట్‌లో ప్రకటించిన వివిధ రాయితీల కింద రూ.520 కోట్లలో రూ.400 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రవాసులకు ప్రాధాన్యం

ప్రవాసుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలోగానీ తెలంగాణలో ఇప్పటి వరకుగానీ ప్రవాసుల కోసం కేటాయించిన నిధుల్లో ఇవే అత్యధికం. 2017-18లో రూ.79 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించగా ఇందులో దాదాపు రూ.71 కోట్లను ఇప్పటికే వెచ్చించింది.

బడిబుడి అడుగులే

ఈనాడు, హైదరాబాద్: కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడాలి.. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి సర్కారు బడులకు వలసలు ప్రారంభం కావాలని రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. విద్యారంగానికి ఈసారి కేటాయిస్తున్న బడ్జెట్‌ను చూస్తే మాత్రం ఆ లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. మొక్కు'బడి' కేటాయింపులే అందుకు సాక్ష్యం. గతేడాది మొత్తం విద్యాశాఖకు రూ.12,705 కోట్లు ఇవ్వగా తాజా బడ్జెట్‌లో రూ.13,278 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఈసారి కేటాయింపులు కేవలం రూ.573 కోట్లే మాత్రమే అధికం. పాఠశాల విద్యాశాఖలో కొత్తగా 8,792 మంది ఉపాధ్యాయులను నియమిస్తుండటంతో వారికి వేతనాల కోసం తప్ప బడుల అభివృద్ధికి నిధులు పెంచలేదు. ఇప్పటికీ మూడొంతుల పాఠశాలల్లో రక్షిత తాగునీటి సౌకర్యం లేదు. పిల్లలు ఆడుకోవడానికి మైదానాలున్నా క్రీడా పరికరాలు లేవు. పరిస్థితి ఇలా ఉంటే పాఠశాల విద్యాశాఖకు ప్రగతి పద్దు కింద ఈసారి కేటాయించిన నిధులు కేవలం రూ.2,144 కోట్లే. మధ్యాహ్న భోజనం పథకం కూడా అందులోనే. దానికే రూ.460 కోట్లు అవుతాయి. ఇక ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాలకు మరో రూ.300 కోట్లు పోతాయి. ఇక బడి బాగునకు మిగిలిదే ఎంత అంటే నామ మాత్రం. ప్రహరీలు, గదులు నిర్మాణానికే దాదాపు రూ.3 వేల కోట్లు కావాలని విద్యాశాఖ అంచనా వేయడం గమనార్హం. ఈసారి అందుకే సుమారు రూ.18 వేల కోట్లకు ప్రతిపాదనలు తయారు చేసినా అవన్నీ తిరస్కరణకు గురయ్యాయి. దైట్ల నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించారు.

- ఇక ఉన్నత, సాంకేతిక విద్యారంగాలకు ప్రగతి పద్దు కింద కేటాయించిన నిధులను కూడా తగ్గించారు. కళాశాల విద్యాశాఖకు ప్రగతి పద్దు కింద 2017-18కి రూ.78.46 కోట్లు ఇవ్వగా ఈసారి అది రూ.87.27 కోట్లకు పెంచారు. రూసా కింద రూ.82.27 కోట్లు వస్తాయని అంచనాగా చూపారు. ఇంటర్ కళాశాలలకు 2017-18 కింద రూ.62.24 కోట్లు కేటాయించగా 2018-19కి రూ.64.16 కోట్లు ప్రతిపాదించారు.

వర్సిటీలకు నిరాశే

ఈనాడు, హైదరాబాద్: అభివృద్ధి పనులకు ఈసారి భారీగా కేటాయిస్తారన్న ఉపకులపతుల ఆశలకు రాష్ట్రప్రభుత్వం గండికొట్టింది. ఈఏడాది కంటే 2018-19 సంవత్సర బడ్జెట్‌లో సగానికి సగం నిధులు తగ్గించడం నిరాశ కలిగించింది. ఎన్నో ఏళ్లతర్వాత వర్సిటీ అభివృద్ధి పనుల కోసం 2017-18 ఆర్థిక సంవత్సరంలో 8 విశ్వవిద్యాలయాలకు రూ.420 కోట్లు కేటాయించారు. వాటిని కూడా సవరణ బడ్జెట్‌లో రూ.375.64 కోట్లుగా చూపారు. ఇప్పటివరకూ రూ.150 కోట్ల వరకే వ్యయంచేశారు. ఈనెలాఖరుకు అది రూ.200 కోట్లకు మించకపోవచ్చు. వచ్చే విద్యాసంవత్సరం రూ.620 కోట్లు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఉపకులపతుల సమావేశంలో సంకేతాలిచ్చారు. తాజాగా ఈకేటాయింపులను రూ.210 కోట్లకే పరిమితం చేశారు. అవికూడా చివరిలో విడుదల చేస్తే ఖర్చు చేయడం కష్టమని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. ఓయూకు రూ.60 కోట్లే కేటాయించడం గమనార్హం.

ఆ మూడు వర్సిటీలకు సున్నా

అభివృద్ధి పనులకు(ప్రగతి) పద్దు కింద సంప్రదాయ వర్సిటీకి నిధులు కేటాయిస్తున్నందున తమకూ ఇవ్వాలని మూడు వర్సిటీలు కోరాయి. జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు రూ.87 కోట్లు, జేఎన్ఏఎఫ్‌యూకు రూ.23 కోట్లు, బాసరలోని ఆర్‌జీయూకేటీకి రూ.89 కోట్లు, జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్‌కు రూ.87కోట్లు, జేఎన్‌టీయూ జగిత్యాలకు రూ.51 కోట్లు, మంథనికి రూ.76 కోట్లు చొప్పున ప్రతిపాదనలు పంపారు. దీనికి పైసా కూడా కేటాయించలేదు. దీనివల్ల మంథని, జగిత్యాల ఇంజినీరింగ్ కళాశాలల్లో మౌలిక వసతుల సమస్య తీరకుండా ఉంది.

ఉద్యోగులు 4,39,054 మంది

తెలంగాణలో ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో మొత్తం 4,39,054 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బడ్జెట్ పద్దుల్లో ప్రభుత్వం ఈ ఉద్యోగుల గణాంకాలను వెల్లడించింది.

శాశ్వత ఉద్యోగులు	3,18,781
ఒప్పంద ఉద్యోగులు	57,410
వర్క్ ఛార్జ్‌డ్	11,524
గ్రాంట్ ఇన్ ఎయిడ్	51,339

- వయోజన విద్యాశాఖలోని మొత్తం 228 మంది ఉద్యోగులు తాత్కాలికంగానే పనిచేస్తున్నారు.
- సాగర్ ప్రాజెక్టు సీఈ పరిధిలో మొత్తం 991 మంది తాత్కాలిక ఉద్యోగులే.
- పలు శాఖల్లో వేలాది మంది తాత్కాలిక కొలువుల్లోనే పని చేస్తున్నారు. పోలీసు శాఖలో 13,743, ఆరోగ్యశాఖలో 9,060, కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో 5,959 మంది తాత్కాలిక ఉద్యోగులు ఉండడం గమనార్హం.

ప్రక్షాళన

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన, ప్రభుత్వ భూముల రక్షణ తదితర చర్యల కోసం బడ్జెట్‌లో రూ.86.69 కోట్లు కేటాయించారు. ఏళ్ల తరబడి నవీకరణకు నోచుకోని రాష్ట్రంలోని 72 లక్షల ఖాతాల్లోని భూ దస్త్రాల ప్రక్షాళనను(ఎల్ఆర్‌యూపీ) ఇప్పటికే పూర్తిచేశారు. దస్త్రాలు స్పష్టంగా ఉన్న రైతులకు కొత్త పట్టాపాసుపుస్తకాలు ముద్రించి, పంపిణీ చేసేందుకు నాలుగు ఏజెన్సీలకు ముద్రణ బాధ్యతలను అప్పగించనున్నారు. మరోవైపు వెబ్‌ల్యాండ్(మాభూమి) స్థానంలో కోర్‌బ్యాంకింగ్ తరహాలో వేగవంతమైన సేవలు తీసుకొచ్చేందుకు ధరణి పేరుతో కొత్త వెబ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.75 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. తహసీల్దారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల సేవలను అందించేందుకు వీలుగా కార్యాలయాల కంప్యూటరీకరణకు రూ.5.67 కోట్లు పొందుపరిచారు. రాష్ట్రంలో 7.21 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు ఎల్ఆర్‌యూపీలో గుర్తించారు. వాటిలో ఆక్రమణలకు గురవుతున్న భూముల రక్షణకు ఈ దఫా నిధులను పెంచారు. గతేడాది ప్రభుత్వ భూముల రక్షణకు రూ.25.46 లక్షలు కేటాయించగా ఈసారి వాటిని రూ.2.30 కోట్లకు పెంచారు.

రాష్ట్రంలో గందరగోళంగా తయారైన భూముల రికార్డులను సమూలంగా సంస్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీఎత్తున 'భూ దస్త్రాల ప్రక్షాళన' చేపట్టింది. ఈ కార్యక్రమంలో 3,500 మంది రెవెన్యూ అధికారులు 30 జిల్లాల పరిధిలోని 10823 గ్రామాల భూదస్త్రాలను నవీకరించారు. రాష్ట్రంలోని 96% భూముల రికార్డులను నిగ్గు తేల్చారు.



96% రైతుల భూములు పక్కా!

1934 తర్వాత తెలంగాణలో ఇంతటి భారీ కసరత్తు చేపట్టటం ఇదే ప్రథమం.

2017 సెప్టెంబర్ 15 - డిసెంబర్ 31 మధ్య

పరిశీలించిన విస్తీర్ణం 2,55,98,091.19 ఎకరాలు	వ్యవసాయ భూమి (55.5%) 1,42,12,826.17 ఎకరాలు
స్పష్టత తెచ్చిన విస్తీర్ణం (96%) 2,38,08,650.04 ఎకరాలు (అసైన్డ్, సాదా బైనామా కలిపి)	వ్యవసాయేతర భూమి(పట్టా) 11,95,889.10 ఎకరాలు (4.7%)
స్పష్టత లేని విస్తీర్ణం (7%) 17,89,595.18 ఎకరాలు	అసైన్డ్ భూములు (7.8%) 20,01,512.12 ఎకరాలు
దస్త్రాలు స్పష్టంగా ఉన్న ఖాతాలు 72,13,111 (92%)	ఆక్రమణ/కొనుగోళ్లు జరిగిన అసైన్డ్ భూమి 2,41,127.06 ఎకరాలు (0.9%)

నగరీకరణను మాత్రమే అభివృద్ధి అనుకోవడం తప్పు. అభివృద్ధి ఎప్పుడైనా పునాదుల నుంచి ప్రారంభం కావాలి. గ్రామీణ సమాజంలో వికాసం కలిగినప్పుడే అభివృద్ధి సమగ్రతను సంతరించుకుంటుంది.



పారిశ్రామికుడు

కేటాయింపు రూ.1286 కోట్లు

కొత్త విధానంతో సరికొత్త సందోహం

తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. 2015 జులై 12 నుంచి అమల్లోకి తీసుకువచ్చిన 'టీఎస్ఐపాస్' ('తెలంగాణ పారిశ్రామిక అనుమతులు, స్వీయ ధ్రువీకరణ) విధానం ప్రపంచ పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తోంది. ఫలితంగా రాష్ట్రానికి పలు కొత్త పరిశ్రమలు వచ్చాయి. పెట్టుబడులూ, ఉపాధి అవకాశాలూ గణనీయంగా పెరిగాయి. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేసింది. రాయితీ మొత్తాలూ వెన్వెంటనే విడుదలయ్యాయి.

ఇదీ నాలుగేళ్ల పురోగతి

వచ్చిన పెట్టుబడులు రూ. **1.18** లక్షల కోట్లు

కొత్తగా లభించిన ఉపాధి **4.47** లక్షల మందికి

భారీ పరిశ్రమలకు అనుమతులు: **6,206**

ప్రారంభించిన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు **52,401** (వీటి ద్వారా లభించిన ఉపాధి: **5.23** లక్షల మందికి... వచ్చిన పెట్టుబడులు: రూ. **49,102** కోట్లు)

వచ్చిన భారీ పరిశ్రమలు
సుల్తాన్‌పూర్‌లో వైద్య పరికరాల ఉత్పత్తి పరిశ్రమ, టాటా బోయింగ్ వైమానిక పరిశ్రమ

ఆతిథ్యాలు
ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సు, అంతర్జాతీయ గనుల సదస్సు, బయో ఆసియా సదస్సు

పారిశ్రామిక సంస్థలతో అవగాహన ఒప్పందాలు **189**

శంకుస్థాపనలు
వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కు, విఖ్యాత జీఈ-టాటా లీప్ ఇంజిన్ల తయారీ పరిశ్రమ

ఐటీ హబ్
బుద్వేలులో కొత్త ఐటీ సమూహం ఏర్పాటుకు సన్నాహాలు.

అంకుర పరిశ్రమలు
టీ హబ్‌లోని ఇంక్యుబేటర్ ద్వారా **2910** ఏర్పాటు, ఇతర సంస్థల్లోని ఇంక్యుబేటర్ల ద్వారా **2031** పరిశ్రమలు ప్రారంభం

ఈనాడు - హైదరాబాద్

కొత్త పెట్టుబడులు, పరిశ్రమల రాకతో ఉరకలెత్తుతున్న తెలంగాణ పరిశ్రమల శాఖకు మరింత ఊతమిచ్చేందుకు వీలుగా ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచింది. గత ఏడాది కంటే 2018-19 బడ్జెట్‌లో రూ.143 కోట్లను పెంచి 1,286 కోట్లు కేటాయించింది. రాయితీలు, ప్రోత్సాహకాలకు పెద్దపీట వేసింది. మరోవైపు ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణ వైపు దృష్టి సారించింది. కొత్త పరిశ్రమలకు అనుగుణమైన వసతులు, సౌకర్యాల కోసం ఛేదక విభాగానికి రూ. 400 కోట్లను కేటాయించింది. ఇప్పటికే స్థాపించిన పరిశ్రమలకు తోడు, కొత్త పరిశ్రమలకు ప్రభుత్వ రాయితీల అవసరం పెరుగుతోంది. దీనిని పరిగణనలోనికి తీసుకొని ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిపేందుకు సన్నాహాలు చేస్తోంది. బడ్జెట్‌లో పన్నుల చెల్లింపులు, ఇతర రాయితీలకు రూ. 256 కోట్లను, విద్యుత్ సబ్సిడీకి రూ.130 కోట్లను, పావలావడ్డీ రాయితీ కోసం రూ. 100 కోట్లను కేటాయించింది.

వీహబ్‌కు నిధులు

ప్రపంచ పారిశ్రామిక వేత్తల శిఖరాగ్ర సదస్సులో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వీహబ్‌ను ఆవిష్కరించిన విషయం విదితమే. దీనికి బడ్జెట్‌లో రూ.15 కోట్లు కేటాయించింది. వీహబ్‌లో 25 శాతం ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయనుంది.


- పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాల కోసం రూ. 104 కోట్లను ప్రతిపాదించింది.
- జహీరాబాద్‌లోని జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్)లో భూసేకరణ కోసం రూ.100 కోట్లు కేటాయించింది. దీంతో పాటు ఖాయిలా పరిశ్రమల పునరుద్ధరణకు రూ.40 కోట్లను ప్రతిపాదించింది. పారిశ్రామిక రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రం (రిచ్) సంస్థకు రూ.4 కోట్లు, ఆహారశుద్ధి పరిశ్రమలకు రూ.కోటి, పరిశ్రమల్లో ఎగుమతుల ప్రోత్సాహానికి రూ. కోటి కేటాయించింది.
- కొత్తజిల్లాల్లో పరిశ్రమల భవనాల నిర్మాణాలకు రూ. 8.20 కోట్లు.
- చక్కెర పరిశ్రమలకు కొనుగోలు పన్ను రాయితీ రూ. 17.62 కోట్లు.
- ఖనిజాల అన్వేషణ కోసం రూ. 25 కోట్లు..
- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థకు రూ. 8.99 కోట్లు..
- ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలికి రూ. 5.22 కోట్లను ప్రతిపాదించింది.

హబ్‌లకు పండగ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఐటీశాఖకు 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.289.19 కోట్లు కేటాయించింది. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.250.87 కోట్లు కాగా.. నిర్వహణ పద్దు కింద రూ.38.32 కోట్లుగా పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్స్ (టాస్క్)కు బడ్జెట్‌లో నిధులు రెండింతలు చేసింది. సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5 కోట్లు ఉంటే.... ఆ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10 కోట్లుగా పేర్కొంది. టీహబ్‌కు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు బడ్జెట్‌లో నిధులను పెంచింది.

ఐటీ రంగ వృద్ధి ఇదీ..

తెలంగాణా ఐటీ రంగం శీఘ్రగతిన వృద్ధి చెందుతోంది. గత నాలుగేళ్లలో అనేక కొత్త యూనిట్లు వచ్చాయి. పలువురికి ఉపాధి లభించింది.



(అంకెలకు ఆధారం సామాజిక ఆర్థిక సర్వే - 2018)

పోలీసు బాసే

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖ ఆధునికీకరణకు తెలంగాణ ప్రభుత్వం మరోమారు ప్రాధాన్యం ఇచ్చింది. సదుపాయాలు మెరుగుపరచడం, తద్వారా స్నేహపూర్వక పోలీసింగ్ అనే విధానానికి ఊతమిచ్చేందుకు ప్రస్తుత బడ్జెట్‌ల కేటాయింపులు భారీగానే పెంచారు. గతేడాది సవరించిన అంచనా ప్రకారం రూ. 828.01 కోట్లు ఉన్న ప్రగతి పద్దును ఈ ఏడాది రూ.1329.29 కోట్లకు పెంచారు. 500 కోట్లు అదనంగా కేటాయించినట్లయింది. అన్ని పోలీస్‌స్టేషన్లను ఆధునికంగా తీర్చిదిద్దేందుకు, కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలు, కమిషనర్ కార్యాలయాలు నిర్మించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు.

కమాండ్ కంట్రోల్‌కు భారీ కేటాయింపులు

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంతర్జాతీయస్థాయి అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రం నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.280 కోట్ల నిధులు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది దాదాపు రెట్టింపు. తెలంగాణ ప్రభుత్వం పోలీసుశాఖ ఆధునికీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అత్యాధునిక కమాండ్ కంట్రోల్‌ను నిర్మించేందుకు 2014-15, 2015-16 బడ్జెట్లలో రూ.20 కోట్లు చొప్పున కేటాయించినా అదనంగా మొత్తం రూ.87.75 కోట్లు ఖర్చుపెట్టారు. 2016-17లో రూ.140 కోట్లు కేటాయించగా నిధుల కొరతతో రూ.20 కోట్లకు తగ్గించారు. 2017-18 బడ్జెట్‌లో రూ.145 కోట్లు కేటాయించి, ఆ మొత్తం మంజూరు చేశారు. ఇప్పటివరకూ రూ.220 కోట్ల వరకూ వ్యయం చేశారు. నిర్మాణం పూర్తి కానుంది. ఈ ఏడాది చివరి నాటికి మిగతా పనులన్నీ పూర్తిచేసి కమాండ్ కంట్రోల్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో తాజాగా రూ.280 కోట్లు కేటాయించారు.

చేనేతకు బాసట

ఈనాడు, హైదరాబాద్: చేనేత, జౌళి రంగాలకు తెలంగాణ ప్రభుత్వం బాసటగా నిలిచింది. 2017-18లో రూ.1,526 కోట్లు ప్రతిపాదించగా, 2018-19లో రూ. 1,559 కోట్ల నిధులను ప్రకటించింది. ఈసారి కేటాయింపుల్లోనూ జౌళి, చేనేత పార్కులు, సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేశారు. ఇప్పటికే వరంగల్‌లో శంకుస్థాపన చేసిన వరంగల్ కాకతీయ మెగాటెక్స్‌టైల్స్ పార్కుకు, సిరిసిల్లలో చేపట్టిన దుస్తుల తయారీ (అపెరల్) పార్కుకు అదనపు సౌకర్యాలు, వసతులను కల్పించనున్నారు. ఈ రెండు పార్కుల నిర్మాణ వ్యయం రూ.1,400 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.200 కోట్లను వెచ్చించారు. మిగిలిన నిధులను 2018-19 ఆర్థిక సంవత్సరంలో వినియోగించనున్నారు.

చేనేతకు చేయూత

చేనేత, జౌళి రంగ పరిస్థితి **2017-18**లో కొంత ఆశాజనకంగా ఉంది. కార్మికులకు నూలు, రంగులు, రసాయనాల సబ్సిడీ పథకాన్ని, పొదుపు నిధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మరమగ్గాల కార్మికులకు రూ.లక్షలోపు రుణాల్ని మాఫీచేశారు. చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణాల మాఫీ పథకం అమలుకు ఉత్తర్వులు జారీచేసింది. మరమగ్గాల నవీకరణ పథకాన్ని చేపట్టింది. వరంగల్‌లో కాకతీయ మెగా జౌళి పార్కుతో ఈ రంగంలోనూ పరిస్థితి మెరుగయింది. సిరిసిల్ల అపెరల్ పార్కుకు శంకుస్థాపన చేశారు.




చేనేత, జౌళి రంగానికి కేటాయింపులు, ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు
2014-15	144.57	92.21
2015-16	197.83	142.18
2016-17	83.05	52.20
2017-18	1526	1471

రెండంకెల రయ్..రయ్

దేశ వ్యాప్తంగా జీడీపీ(స్థూల జాతీయోత్పత్తి) వృద్ధిరేటు 7%కి అటూ ఇటుగా ఉండగా... తెలంగాణ మాత్రం రెండంకెల వృద్ధి రేటు సాధిస్తోంది. 2016-17 నాటికే రాష్ట్రం రెండంకెల వృద్ధిరేటును నమోదుచేసింది.

నాలుగేళ్లుగా వృద్ధిరేటు తీరుతెన్నులు
(2011-12 స్థిర ధరల ప్రకారం)



వృద్ధిరేటులో ఏపీ కంటే ముందే

వృద్ధి రేటులోనూ తెలంగాణ దూసుకెళుతోంది. రెండేళ్లుగా ఏపీ 11.28% వృద్ధి రేటును నమోదు చేస్తుండగా తెలంగాణ వృద్ధి రేటు 14 % దాటింది.

మైనారిటీలకు మెజారిటీ

కేటాయింపు రూ. 2000 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ముస్లిం మైనార్టీలు..ఎస్సీ, ఎస్టీల తరహాలో పేదరికం అనుభవిస్తున్నారని, వారిని ఇతర వర్గాలతో సమానంగా అభివృద్ధిలోకి తీసుకురావాలని పేర్కొంటూ నిధుల కేటాయింపులు భారీగా పెంచింది. 2018-19 ఏడాదికి రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించింది. బడ్జెట్‌లోని మిగతా విభాగాలతో పోలిస్తే అత్యధికంగా నిధులు పెరిగింది మైనార్టీ శాఖలోనే కావడం గమనార్హం.

అనాథ పిల్లల భవనానికి రూ.20 కోట్లు


ముస్లిం అనాథ పిల్లల కోసం నాంపల్లిలో అనీస్ ఉల్ గుర్బాకు 4,300 చదరపు గజాల స్థలాన్ని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. ఈ భవన నిర్మాణ పనులు ఇప్పటికే మొదలవగా..దానికి బడ్జెట్‌లో రూ.20 కోట్లు ఇచ్చారు.

ఉపకార వేతనాలు, గురుకులాలకు ప్రాధాన్యం...: మైనార్టీల ఉపకార వేతనాలకు ప్రభుత్వ కేటాయింపులు పెరిగాయి. 2017-18లో రూ.100 కోట్లుగా ఉన్న నిధులను.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2018-19) రూ.250 కోట్లకు పెంచింది. ఈ వర్గాల స్వయం ఉపాధి పథకాలకు నిధులను గతంతో పోలిస్తే రెండున్నర రెట్లు పెంచి రూ.100 కోట్లు ఇచ్చింది. క్రిస్టియన్ భవనానికి రూ.30 కోట్లు ఇవ్వగా.. వక్ఫ్‌బోర్డును బలోపేతం చేసే పనిలో భాగంగా ఈ విభాగానికి నిధులను రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్లకు పెంచింది. ఉర్దూఘర్, షాదీఖానాల నిర్మాణానికి రూ.40 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ముస్లింలలో విదేశీ విద్యకు వెళ్లే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో..ఈ ఏడాదికి కనీసం 500 మందికి ఈ పథకం వర్తింపజేసేలా నిధులను రెండున్నర రెట్లు పెంచి రూ.100 కోట్లు కేటాయించింది. ఇటీవల మైనార్టీల కోసం కేటాయించిన 206 గురుకులాల నిర్వహణకు 2017-18లో రూ.425 కోట్లు ఇవ్వగా..ఈ ఏడు రూ.735 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించింది. రంజాన్, క్రిస్మస్ పర్వదినాల నిర్వహణకు రూ.66 కోట్లు ఇచ్చింది.


2017-18 ఏడాదికి నిధుల ఖర్చు అంతంతే...

మైనార్టీ శాఖలో 2017-18 ఏడాదికి (ఇప్పటివరకు) చేసిన నిధుల ఖర్చు తక్కువగానే ఉంది. బోధన రుసుములు, ఉపకార వేతనాలకు రూ.250 కోట్లకుగాను రూ.150 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యాయి. షాదీ ముబారక్ నిధుల్లో రూ.150 కోట్లకు రూ.141 కోట్లే వెచ్చించింది. విదేశీ విద్యకు రూ.40 కోట్లు కేటాయిస్తే రూ.14 కోట్లు మాత్రమే ఖర్చుచేయగలిగింది.


రెవెన్యూ వ్యయం 2018-19 (రూ.కోట్లలో)



రెవెన్యూ వసూళ్లు 2018-19 (రూ.కోట్లలో)




ప్రగతి పద్దు 2018-19 (రూ.కోట్లలో)



మతం లెక్కలు

రాష్ట్రంలో మతాల వారీగా కుటుంబాల సంఖ్య



హిందువులు
88,85,514 (87.17%)
అత్యధికం ↑ రంగారెడ్డి (14,18,792)
అత్యల్పం ↓ హైదరాబాద్ (5,57,424)

ముస్లింలు
11,22,023 (11.01%)
↑ హైదరాబాద్ (3,83,662)
↓ ఖమ్మం (49,752)

క్రైస్తవులు
1,29,107 (1.27%)
↑ రంగారెడ్డి (43,813)
↓ ఆదిలాబాద్ (3,771)

బౌద్ధులు
4,890 (0.05%)
↑ ఆదిలాబాద్ (3,359)
↓ నల్గొండ (21)

సిక్కులు
15,035 (0.15%)
↑ హైదరాబాద్ (4,132)
↓ ఖమ్మం (560)

జైనులు
5726 (0.06%)
↑ హైదరాబాద్ (3,982)
↓ కరీంనగర్ (37)

ఇతరులు
22,719 (0.22%)
↑ హైదరాబాద్ (5253)
↓ నిజామాబాద్ (919)

వికలాంగుల జనాభా

మొత్తం వికలాంగులు **5,01,643**

శారీరక వికలాంగులు **3,02,364** (60%)

మరుగుజ్జులు **5,751** (1%)

అంధులు **65,199** (13%)

మానసిక వికలాంగులు **55,927** (11%)

మూగ, చెవిటి **66,469** (13%)

(2014 సమగ్ర కుటుంబ సర్వే)



గత ప్రభుత్వాల కాలంలో కరెంటు ఉంటే వార్త. ఈ ప్రభుత్వ హయాంలో కరెంటు పోతే వార్త. చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్రంలో వ్యవసాయంతోపాటు అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

భగీరథుడు

కేటాయింపు రూ.25,000 కోట్లు

ఈనాడు - హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం మరోసారి పెద్దపీట వేసింది. వరసగా మూడోసారీ రూ.25 వేల కోట్లు కేటాయించింది. నిధుల్లో సగం కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకే కేటాయించడం గమనార్హం. 2017-18లో అత్యధికంగా ఇప్పటికే రూ.20 వేల కోట్లకుపైగా ఖర్చుచేసినా.. అందులో బడ్జెట్ కేటాయింపుల నుంచి సగం కూడా వ్యయమవలేదు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని రూ.తొమ్మిదివేల కోట్లకు పైగా చెల్లించడంతో మొత్తమ్మీద సాగునీటి ప్రాజెక్టుల ఖర్చు రూ.20 వేల కోట్లు దాటింది. మరోవైపు జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, దేవాదుల, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల ప్రధాన పనులు ఓ కొలిక్కి వచ్చినా.. ఈ ఖరీఫ్‌లోనో లేదా వచ్చే ఏడాది ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించేలా పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధుల కేటాయింపు జరగలేదు.

- మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1800 కోట్లు అవసరమని నీటిపారుదల శాఖ నివేదించగా, రూ.1200 కోట్ల కేటాయింపు జరిగింది.
- ప్రాణహిత ప్రాజెక్టుకు రూ.350 కోట్లు మాత్రమే కేటాయించారు.

కాళేశ్వరానికి దండిగా..

ఈ బడ్జెట్‌లోనూ సింహభాగం రూ.6015 కోట్లు కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికే కేటాయించారు. రూ.80,500 కోట్లు వ్యయమయ్యే ఈ పథకానికి ఇప్పటివరకు సుమారు రూ.30 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. పెరిగిన ధరలను కూడా పరిగణనలోకి తీసుకొంటే ఈ పథకం పూర్తయ్యి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందడానికి మరో రూ.55 వేల కోట్లు అవసరం. బడ్జెట్‌లో ఎక్కువ భాగం కేటాయించడం, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడంతో ప్రధాన పనులకు నిధుల ఇబ్బంది ఉండదని నీటిపారుదలశాఖ వర్గాలు భావిస్తున్నాయి.


గడువులోపు అసాధ్యమే

- రూ.35,210 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చి, రూ.29,659 కోట్లకు గుత్తేదారులతో ఒప్పందం చేసుకొన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇప్పటివరకు చేసిన ఖర్చుపోను రూ.30 వేల కోట్లకుపైగా అవసరం. అంటే ఏడాదికి రూ.15 వేల కోట్లు ఖర్చుచేస్తేగానీ వచ్చే రెండేళ్లలో పూర్తికాదు. ఈ బడ్జెట్‌లో కూ.3035 కోట్లు కేటాయించారు. దీని ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే ఏడెనిమిదేళ్లు పట్టే అవకాశం ఉంది.
- డిండి ఎత్తిపోతల పథకం ఒప్పందం విలువే రూ.4 వేల కోట్లు. భూసేకరణ, పునరావాసానికి అయ్యే వ్యయం దీనికి అదనం. ఇప్పటివరకు రూ.500 కోట్లు కూడా ఖర్చుచేయలేదు. ఈ బడ్జెట్‌లో రూ.525 కోట్లు మాత్రమే కేటాయించారు.
- సీతారామ ఎత్తిపోతల, తుపాకులగూడెం పూర్తికావాలంటే రూ.10 వేల కోట్లకు పైగా కావాలి. ఇప్పటి వరకు చేసిన ఖర్చు నామమాత్రమే. తాజా బడ్జెట్‌లో ఈ రెండింటికీ కలిపి రూ.1725 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలా జరగకపోతే ఇవి పూర్తి కావడానికి సుదీర్ఘకాలం పట్టే అవకాశం ఉంది.

ప్రాజెక్టులవారీ కేటాయింపులు.. (రూ.కోట్లలో)

కాళేశ్వరం ఎత్తిపోతల-6015; పాలమూరు-రంగారెడ్డి-3035; శ్రీశైలం ఎడమగట్టు కాలువ-700; సీతారామ ఎత్తిపోతల-1200; డిండి ఎత్తిపోతల-525; దేవాదుల ఎత్తిపోతల-1967; ప్రాణహిత ప్రాజెకు-350; కల్వకుర్తి ఎత్తిపోతల-500; భీమా ఎత్తిపోతల-170; నెట్టెంపాడు ఎత్తిపోతల-200; కోయిల్‌సాగర్ ఎత్తిపోతల-120; జూరాల-45; ఆర్డీఎస్(తుమ్మిళ్లతో సహా)-145; శ్రీరామసాగర్-160; కడెం-13.5; శ్రీరామసాగర్ రెండోదశ-200; శ్రీరామసాగర్ వరదకాలువ-650; ఎల్లంపల్లి-300; తుపాకులగూడెం-500; సింగూరు ప్రాజెక్టు-55; ఘనపూర్ ఆనకట్ట-40; నాగార్జునసాగర్ ప్రాజెక్టు-125; నాగార్జునసాగర్ ఆధునికీకరణ-207; లోయర్ పెన్‌గంగ-250; నిజాంసాగర్-100; లెండి-40; మోడికుంటవాగు-60; కుమురం భీం-100; పెద్దవాగు జగన్నాథపూర్-48; అలీసాగర్-20; గుత్ప-26; భక్తరామదాసు-25; మూసీ-25; ఒట్టివాగు-30; వైరా-40; పాలెంవాగు-25; నీల్వాయి-31.75; చిన్ననీటి వనరులు (మిషన్‌కాకతీయతో కలిపి)-2511.60; చిన్న ఎత్తిపోతలు-300

మూడున్నరేళ్లలోనే పదేళ్ల ఖర్చు



సాగునీటి రంగానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. గత నాలుగేళ్లలో రూ.65 వేల కోట్లు కేటాయించినా దీనికి, వ్యయానికి అంతరం ఉంది. అయితే మొత్తమ్మీద చూసినపుడు జలయజ్ఞం ప్రారంభించిన తర్వాత పదేళ్లలో చేసినంత వ్యయాన్ని తెలంగాణ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే చేసింది.

గత నాలుగేళ్లలో సాగునీటికి రంగంపై చేసిన వ్యయం **రూ. 47,700 కోట్లు**

- ఇందులో 40% పైగా ఒక్క కాళేశ్వరం మీదే!

దీన్ని బట్టే ఈ పథకానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోందని అర్థమవుతుంది!

ముందు | 2014 | తర్వాత

ముందు

- 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 47.35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 1.34 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా జలయజ్ఞం మొదలెట్టింది.
- చిన్నాపెద్దా కలిపి మొత్తం 33 పథకాలను చేపట్టింది.
- రూ.88,148 కోట్ల పనులకు గుత్తేదారులతో ఒప్పందం చేసుకొంది.
- కానీ పదేళ్లలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల మీద రూ.38 వేల కోట్లు, చిన్న ప్రాజెక్టు పనులపైన రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.
- పదేళ్లలో 6.3 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 92,000 ఎకరాల స్థిరీకరణ జరిగినట్లు ప్రకటించింది.

తర్వాత

- 2014లో తెరాస ప్రభుత్వం 'కోటి ఎకరాలకు నీరు' లక్ష్యంగా నిర్మాణంలో ఉన్న పలు ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపట్టింది. కొన్నింటిని రద్దు చేసింది. మరికొన్నింటిని రీడిజైన్ చేసింది.
- ముఖ్యంగా ప్రాణహిత - చేవెళ్లను రీడిజైన్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.
- తెలంగాణ ఏర్పడకముందు ఈ పథకం పనులపై రూ.5000 కోట్లు ఖర్చుచేయగా, గత రెండేళ్లలోనే రూ.18,000 కోట్లు ఖర్చు చేశారు. ఒక ప్రాజెక్టుపై రెండేళ్లలో ఇంత భారీ మొత్తం ఖర్చు చేయడం ముందెన్నడూ లేదు.



సంవత్సరం	కేటాయింపు	వ్యయం (రూ.కోట్లలో)
2014-15	6500	5285
2015-16	8500	7937
2016-17	25000	13,000
2017-18	24990	20,051

సాగునీటి రంగంపై ఒక రాష్ట్ర ప్రభుత్వం ఇంత భారీ మొత్తం ఖర్చుచేయడం ఇదే ప్రథమం!

- తొలి రెండు సంవత్సరాలు బడ్జెట్ కేటాయింపులో 80%పైగా ఖర్చు చేసినా, తర్వాతి రెండేళ్లు 50% మాత్రమే ఖర్చు చేశారు.

మిగిలిన ప్రాజెక్టులపై ఖర్చు	దేవాదుల	ఎస్ఎల్‌బీసీ	ఎల్లంపల్లి	వరద కాలువ
	రూ.2000 కోట్లు	రూ.2000 కోట్లు	రూ. 1000 కోట్లు	రూ. 1000 కోట్లు

జనాభా ముచ్చట్లు



మొత్తం కుటుంబాలు
1,01,93,027

తెలంగాణలో మొత్తం జనాభా
3,63,37,160

పురుషులు
1,81,48,088 (49.99%)

మహిళలు
1,80,96,660 (49.85%)

ట్రాన్స్‌జెండర్లు
58,264 (0.16%)

గ్రామీణ జనాభా
2,13,95,009 (61.12%)

పట్టణ జనాభా
1,36,08,665 (38.88%)

ఎలాంటి అండ లేని వారు

అనాథలు
4,007 (0.01%)

ఇల్లు లేని ద్రిమ్మరులు
9,70,522 (2.67%)

ఇల్లు ఉన్న ద్రిమ్మరులు
20,856 (0.06%)

వితంతువులు
16,22,133 (4.47%)

ఒంటరి మహిళలు (30 ఏళ్లు వచ్చినా పెళ్లిచేసుకోకుండా)
1,16,304 (0.32%)

కులాల వారీగా జనాభా

ఎస్సీలు 63,60,158 (17.50%)
- ↑ రంగారెడ్డి (9,55,430)
- ↓ నిజామాబాద్ (3,90,163)

ఎస్టీలు 36,02,288 (9.91%)
- ↑ ఖమ్మం (6,83,977)
- ↓ హైదరాబాద్ (75,208)

బీసీలు 1,85,61,856 (51.08%)
- ↑ రంగారెడ్డి (27,71,320)
- ↓ ఖమ్మం (10,24,063)

ఓసీలు 78,12,858 (21.50%)
- ↑ రంగారెడ్డి (21,29,498)
- ↓ ఆదిలాబాద్ (3,55,695)

మైనారిటీలు 52,53,710 (14.46%)
- ↑ హైదరాబాద్ (17,88,326)
- ↓ ఖమ్మం (2,03,925)

(2014 సమగ్ర కుటుంబ సర్వే)

కేటాయింపు రూ.1,801 కోట్లు

భగీ'రథం' ఆలస్యమే

ఈనాడు- హైదరాబాద్: భగీరథకు కొత్త బడ్జెట్‌లో రూ.1,801 కోట్లను మాత్రమే కేటాయించటాన్ని బట్టి పథకం పూర్తికావటానికి మరికొంత జాప్యం అనివార్యమని స్పష్టమవుతోంది. ఇంటింటికి నల్లా నీళ్లనివ్వకపోతే రానున్న ఎన్నికల్లో ఓట్లను అడగబోమని సర్కారు ప్రకటించింది. అందువల్లనే ప్రస్తుత పనులు చాలా ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. ఇంత వరకు అయిన ఖర్చును మినహాయిస్తే రాష్ట్ర సర్కారు తన 20 శాతం వాటాగా 2018-19 బడ్జెట్‌లో రూ.3,500 కోట్లకు పైగానే చూపించాలి.. అందుకు భిన్నంగా రూ.1801 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. అంటే నిధులు సగానికి సగం తగ్గాయన్నమాట. ఈ ప్రభావం పనులపై కచ్చితంగా ఉంటుందని, కేటాయింపు ఆ స్థాయిలో లేనందున పనులు సకాలంలో పూర్తవడం అసాధ్యమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాహ్యవలయ రహదారి (ఓఆర్‌ఆర్) ఆవల మొత్తం 24,224 గ్రామీణ ఆవాసాలుండగా వాటిలో ఇంతవరకు 5,752 ఆవాసాలు, 15 పట్టణాలకు మాత్రమే భగీరథ నీళ్లు చేరాయి.



లక్ష్యం

రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికీ కృష్ణా, గోదావరి నీటిని అందజేయటం. ప్రాజెక్టును 2018 డిసెంబరుకల్లా పూర్తి చేయటం.

అంచనా వ్యయం: **రూ. 43,791 కోట్లు**

నిధులు ఎలా?

భగీరథ మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సొంతగా ఇచ్చేది **20%**

మిగతాది బ్యాంకుల నుంచి భగీరథ కార్పొరేషన్‌కు రుణంగా అందుతోంది. ఆ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం హామీగా ఉంటూ వాటిపై వడ్డీలను ఎప్పటికప్పుడు తానే చెల్లిస్తుంది. ఈ వడ్డీలకు అయ్యే మొత్తాన్నీ బడ్జెట్‌లో చూపించాల్సి ఉంటుంది.

ఇప్పటి వరకూ ఏమైంది?

రాష్ట్రంలోని గ్రామాలు: **10,000** పైచిలుకు

ఈ గ్రామాలన్నింటి వరకూ నీటిని తీసుకువెళ్లేందుకు – నదులు, రిజర్వాయర్ల వద్ద 16 'ఇన్ టేక్' బావుల నిర్మాణం, వాటికి అనుసంధానంగా నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, అక్కడి నుంచి 4,500 గ్రామాల వరకూ నీటి సరఫరాకు పైపులైన్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ఇక గ్రామాల్లోపల అంతర్గతంగా పైపులైన్ల ఏర్పాటు 2,500 గ్రామాల్లోనే పూర్తయింది. వచ్చే 7 నెలల్లో మిగతా గ్రామాలన్నింటిలోను పైపులైన్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

గడువులో లక్ష్యం నెరవేరుతుందా?

ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.43,791 కోట్లలో ఇంత వరకూ రూ.25 కోట్ల విలువైన పనులు పూర్తైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రభుత్వం ఇచ్చింది రూ.5 వేల కోట్లు, బ్యాంకు రుణాలు రూ.20 వేల కోట్లు. అనుకున్నట్లుగా ప్రాజెక్టు డిసెంబరులోపు పూర్తవ్వాలంటే అంచనా వ్యయంలోని మిగతా రూ. 18,791 కోట్లను 2018-19లోనే ఖర్చుచేయాల్సి ఉంటుంది. అంటే ప్రభుత్వం దీనిలో తన 20 శాతం వాటాగా రూ. 3,500 కోట్లకు పైగా ఇవ్వాల్సి ఉంటుంది.

కేటాయింపు రూ.1601 కోట్లు

వేగంగా మిషన్ కాకతీయ

ఈనాడు, హైదరాబాద్: చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం మిషన్ కాకతీయకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1601 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.100 కోట్లు నాబార్డు నుంచి వస్తుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకం కింద నాలుగు విడతల్లో 28,652 చెరువులకు ప్రభుత్వం రూ.8,534.48 కోట్లు నిధులు మంజూరు చేసింది. మూడు విడతల్లో 16,606 చెరువుల మరమ్మతులు పూర్తి కాగా రూ.2,971.98 కోట్లు చెల్లింపులు చేశారు. చెరువుల్లో పూడికతీత, తూముల మరమ్మతు, కాల్వల పునరుద్ధరణ, నీటి సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వెలికి తీసిన పూడికను రైతుల పొలాలకు తరలిస్తున్నారు. పూడికతీత కారణంగా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగినట్లు నీటిపారుదల శాఖ గుర్తించింది. వరుసగా రెండు విడతల్లో చేపట్టిన చెరువుల్లో 3.88 టీఎంసీలు, 2.56 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. దీంతోపాటు సాగు విస్తీర్ణం పెరిగినట్లు గుర్తించారు. మొదటి, రెండో విడతల్లో 6.70 లక్షల ఎకరాలు, 3.59 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. మూడు విడతల్లో 2324 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని వెలికితీశారు. గతేడాది చివర్లో ప్రారంభించిన నాలుగో దశ కార్యక్రమం కింద 5419 చెరువులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, 4108 చెరువులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 3230 చెరువులకు టెండర్లు పూర్తిచేశారు. మరోవైపు బడ్జెట్‌లో మైనర్ ఇరిగేషన్‌లో ఆర్ఐడీఎఫ్ పథకం కింద రూ.205 కోట్లు, ఏఐబీపీ కింద రూ.55 కోట్లు కేటాయింపులు చేశారు.

మిషన్ కాకతీయ



తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బృహత్ కార్యక్రమం మిషన్ కాకతీయ.

- **ఉద్దేశం:** గొలుసుకట్టు చెరువుల అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, తూముల మరమ్మతు.
- **పథకం:** 4 దశల్లో 28,652 చెరువుల పునరుద్ధరణ
- **ఆరంభం:** 2014 లో.

అమలు

మొదటి దశ (2014)
లక్ష్యం: రూ. 2571.58 కోట్లతో 8078 చెరువుల పునరుద్ధరణ.
పురోగతి: రూ. 1568.40 కోట్ల వ్యయంతో 8003 చెరువులు పూర్తి చేశారు.

రెండో దశ (2015)
లక్ష్యం: రూ. 3243.96 కోట్లతో 9003 చెరువుల పునరుద్ధరణ
పురోగతి: రూ. 1177.06 కోట్లు వ్యయమయ్యాయి, 7082 చెరువుల పనులు పూర్తయ్యాయి.

మూడో దశ (2016)
లక్ష్యం: రూ. 1632.59 కోట్లతో 6152 చెరువుల పునరుద్ధరణ
పురోగతి: రూ. 226.52 కోట్లు చెల్లించారు, 1521 చెరువుల పనులు పూర్తి.

నాలుగో దశ (2017)
లక్ష్యం: రూ. 1086.35 కోట్లతో 5419 చెరువుల పునరుద్ధరణ
పురోగతి: రూ. 3230 చెరువులకు టెండర్లు పూర్తయ్యాయి.

మొత్తం పూర్తయినవి: 16,606
కొనసాగుతున్నవి: 12,046

హరితహారం

హరితహారం.. పచ్చదనాన్ని విస్తరింపజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం! కానీ దీని పురోగతి ఏమంత చెప్పుకోదగిన స్థాయిలో లేదు!

- **ప్రారంభం:** చిలుకూరు బాలజీ ఆలయంలో 2015 జులై 3న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా
- **జరిగింది:** మూడేళ్లు గడిచాయి. ఇప్పటి వరకూ నాటింది 81.58 కోట్ల మొక్కలే!

ఏ ఏడాది నాటినవెన్ని?	2015-16	2016-17	2017-18
	15.86 కోట్లు	31.67 కోట్లు	34.05 కోట్లు

లక్ష్యం రాష్ట్రంలో 24% ఉన్న పచ్చదనాన్ని 33% శాతానికి పెంచటం

ఐదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 230 కోట్ల మొక్కల్ని నాటటం

130 కోట్ల మొక్కల్ని జనావాస ప్రాంతాల్లో

100 కోట్లు అటవీ ప్రాంతాల్లో

ఇప్పటివరకు అయిన ఖర్చు **2,264 కోట్లు**



బతికినవెన్ని: తెలియదు. ఇప్పటి వరకూ గణాంకాలు లేవు

తెలంగాణా రాష్ట్ర వైశాల్యం 1,12,077 చ.కి.మీ. ఇందులో అటవీ ప్రాంతం 26,093 చ.కి.మీ. భౌగోళిక విస్తీర్ణంలో అటవీప్రాంతం వాటా 24%

దట్టమైన అడవి (చ.కి.మీ): 286.66 మధ్యస్థాయి అడవి: 7788.11 ఓపెన్ ఫారెస్ట్: 8416.65 స్క్రబ్ ఫారెస్ట్: 4298.32 నాన్ ఫారెస్టు: 5972.27, ఇతరము: 141.69

అటవీశాఖకు స్వల్పమే

కేటాయింపు రూ.336 కోట్లు

ఈనాడు - హైదరాబాద్

అటవీశాఖకు గత ఏడాదితో పోలిస్తే ఈసారి నిధులు స్వల్పంగా పెరిగాయి. కేటాయింపుల్లో సింహభాగం నిధులు నిర్వహణ పద్దులకే ఉన్నాయి. ఈ పద్దు కింద 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.336.12 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ మొత్తం రూ.11.51 కోట్లు ఎక్కువ. ప్రగతిపద్దుకు తాజా బడ్జెట్‌లో రూ.13.42 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.13.01 కోట్లు కేటాయించి, ఆ తర్వాత రూ.12.46 కోట్లకు సవరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.96 లక్షలు అధికం. తెలంగాణకు హరితహారం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టింది. 24 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం 230 కోట్ల మొక్కలు పెంచాల్సి ఉండగా.. ఇప్పటివరకు 81.58 కోట్ల మొక్కలు నాటారు. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, విద్యుత్తులైన్లు.. ఇలా వివిధ శాఖలకు అటవీభూముల్ని ఉపయోగించుకున్నప్పుడు 'కాంప' పథకం కింద నష్టపరిహారం చెల్లిస్తారు. ఆ నిధులతోపాటు జాతీయ ఉపాధి హామీ పథకం, రాష్ట్ర అటవీశాఖ నిధుల్ని మొక్కలు పెంచేందుకు ఖర్చు చేస్తారు.



ప్రజాసంక్షేమం, మౌలిక వసతుల కల్పన, పాలనా సంస్కరణల్లో తెలంగాణ చూపిన మార్గం తమకు కూడా అనుసరణీయమని ఇతర రాష్ట్రాలు భావిస్తున్నాయి.

సంక్షేమవంతుడు

ఈనాడు, హైదరాబాద్: బడుగు, బలహీనవర్గాలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ఈ వర్గాలకు 2018-19 ఏడాది బడ్జెట్‌లో రూ.28,692 కోట్లు కేటాయించింది. మొత్తంగా గత ఏడాదితో పోలిస్తే సంక్షేమ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు దాదాపు 20.50 శాతం పెరిగాయి. మైనార్టీలకు కేటాయింపులు పెంచడం ద్వారా ప్రభుత్వం ఆ వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. గిరిజన సంక్షేమ శాఖకు రూ.1951 కోట్లు (24.19శాతం) అధికంగా ఇవ్వడంతో కేటాయింపుల మొత్తంగా రూ.8,063 కోట్లకు పెరిగాయి. బీసీలకు కేవలం రూ.850 కోట్లు మాత్రమే పెరిగాయి. ఎస్సీలకు నిధుల కేటాయింపు రూ.12,708 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.2,330 కోట్లు అధికం.

పెళ్లి కళ.. కల్యాణలక్ష్మికి రూ.1450 కోట్లు: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల నిధులను గతేడుతో పోలిస్తే దాదాపు 40 శాతం పెంచింది. ఈ పథకం కింద ఎస్సీలకు రూ.400 కోట్లు, బీసీ, ఈబీసీలకు రూ.700 కోట్లు ఇచ్చింది. 2018-19 ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు కలిపి రూ.1450 కోట్లు కేటాయించారు.

'ఉపకారం' 12 శాతం అదనం: బోధన రుసుములు, ఉపకార వేతనాలకు నిధులు గతంతో పోలిస్తే రూ.400 కోట్లు (12 శాతం) పెరిగాయి. 2018-19లో ఉపకార వేతనాల కోసం బడ్జెట్‌లో రూ.3,282.24 కోట్లు కేటాయించినా.. ఈ నిధులు సరిపడేలా లేవు. గత, ప్రస్తుత విద్యా సంవత్సరాలకు కలిపి డిమాండ్ దాదాపు రూ.4,800 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

విదేశీ విద్యకు 47 శాతం ఎక్కువగా: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్యకు గత ఏడాదితో పోలిస్తే నిధులు రూ.121 కోట్లు (41శాతం) పెరిగాయి. 2018-19 ఏడాదిలో దాదాపు 1,100 మంది విద్యార్థులను విదేశాలకు పంపించేందుకు వీలుగా దాదాపు రూ.258.50 కోట్లు కేటాయించారు. నిరుద్యోగ యువతకు ఈ ఏడాదికి స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు వీలుగా..గతేడుతో పోలిస్తే దాదాపు రూ.851 కోట్లు (23 శాతం) అదనంగా నిధుల కేటాయింపులు పెరిగాయి.

గురుకులాలకు రూ.2,707 కోట్లు: 2018-19 ఏడాదికి గురుకులాల సొసైటీల నిర్వహణకు మొత్తంగా రూ.2,707 కోట్లు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల వసతి గృహాల నిర్వహణకు నిధుల కేటాయింపులు పెద్దగా పెరగలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వసతి గృహాల నిర్వహణకు రూ.568.85 కోట్లు కేటాయించారు.

ఎస్సీ, ఎస్టీలకు 'పెన్నిధి'

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద 2018-19 ఏడాదికి ప్రభుత్వం రూ.26,145 కోట్లు కేటాయించింది. గతేడుతో పోలిస్తే ఇది రూ.3,604 కోట్లు అధికం. జనాభా ప్రాతిపదికన ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్సీ ఎస్‌డీఎఫ్) కింద రూ.16,452 కోట్లు, ఎస్టీ ఎస్‌డీఎఫ్ కింద రూ.9,693.11 కోట్లు ఇచ్చినట్లు చూపారు. 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి ఉప ప్రణాళిక స్థానంలో ప్రత్యేక అభివృద్ధి నిధిని తీసుకువచ్చారు. ఈ మేరకు నిధుల ఖర్చుపై విధివిధానాలు జారీ అయ్యాయి. బడ్జెట్ ప్రగతి పద్దులో ఎంత మేరకు నిధులు ఖర్చు అయ్యాయో...అదే స్థాయిలో ఎస్‌డీఎఫ్ నిధులను ఖర్చుచేయాలన్న నిబంధన చేర్చారు. 2017-18 ఏడాదికి (ఫిబ్రవరి గణాంకాల ప్రకారం) రూ.12,328 కోట్లు ఖర్చు అయినట్లు (మొత్తం కేటాయింపుల్లో 54 శాతం) వెల్లడైంది.

పేదలకు 'రెండు పడక గదుల' యోగం

ఉద్దేశం పేదలందరికీ విశాలమైన రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరించి కట్టించి ఇవ్వడం.



రెండు పడక గదుల ఇళ్లు

అమలు రాష్ట్రవ్యాప్తంగా 2.6 లక్షల గృహాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో లక్ష గృహాలు జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. 2015లో రెండు పడక గదుల పథకానికి సంబంధించి నిబంధనలు జారీ అయ్యాయి. ప్రస్తుతం 8,331 గృహాలు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.

ఏడాది	కేటాయింపులు	ఖర్చు(రూ.కోట్లు)
2014-15	118.86	-
2015-16	170.59	-
2016-17	100	177
2017-18	2450	1100

(ఈ ఆర్థిక సంవత్సరానికే కేంద్ర నిధులతో కలిపి)

సమస్యలు ఈ పథకం కింద గృహాలు నిర్మించేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. వచ్చిన చోట్ల అందుబాటులో ప్రభుత్వ స్థలాలు ఉండటం లేదు. దీంతో పలుచోట్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం 1.49 లక్షల గృహాలకు టెండర్లు పూర్తికావడంతో పునాదుల దశకు చేరకున్నాయి. ఇప్పటివరకు ఈ పథకం కింద చేసిన మొత్తం రూ.1277 కోట్లు.

ఇళ్లకు ఫుల్లు

ఈనాడు, హైదరాబాద్: రెండు పడకగదుల గృహాల నిర్మాణానికి కేటాయింపులు పెరిగాయి. 2018-19లో ఈ పథకానికి మొత్తంగా రూ.2,643 కోట్ల కేటాయింపు చూపారు. ఇందులో రాష్ట్ర ఖజానా నుంచి రూ.1500 కోట్లు (గ్రామీణ పేదలకు గృహాల కింద రూ.1000 కోట్లు; ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.500 కోట్లు); కేంద్ర పథకాలైన గ్రామీణ, పట్టణ ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన కింద రూ.1143 కోట్లు కలిపి రూ.2,643 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రతిపాదించారు. 2.6 లక్షల రెండు పడక గదుల గృహాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.18వేల కోట్లకుపైగా అవసరమని అంచనా.

పేదింటి ఆడ పడుచులకు కల్యాణమస్తు!

ఉద్దేశం పేదింటి ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సహాయం అందించడం.

ఎంత ఇస్తారు? రూ.75,116 చొప్పున చెక్కుల (డీడీ) రూపంలో

అమలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల్లోని 3.7 లక్షల మంది పేదింటి ఆడపిల్లల వివాహాలకు దరఖాస్తులు అందాయి. వీరిలో రూ.2.8 లక్షల మందికి సహాయం విడుదలైంది. ఈ సహాయానికి ప్రభుత్వం రూ.1296 కోట్లు ఖర్చుచేసింది.



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్

నాలుగేళ్లుగా పథకానికి కేటాయింపు, ఖర్చు తీరు (రూ.కోట్లలో)

ఏడాది	కేటాయింపు	ఖర్చు
2014-15	250	69.81
2015-16	280	262.51
2016-17	738	205.81
2017-18	850	758

సమస్యలు దరఖాస్తు చేసిన ఆరు నుంచి తొమ్మిది నెలల దాకా సహాయం అందడం లేదు. దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. రెవెన్యూ, ఎమ్మెల్యేల వద్ద నెలలుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

ఆర్థిక కష్టాలేనా?

కేటాయింపు రూ.5650 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల ఆర్థిక కష్టాలు వచ్చే ఏడాది కూడా తీరకపోగా మరిన్ని అప్పులు తీసుకోక తప్పదని కొత్త బడ్జెట్ కేటాయింపులు చెబుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ రంగానికి రూ.5650 కోట్లు కేటాయించారు. వాస్తవానికి అందులో రాయితీల పద్దు కింద రూ.3764 కోట్లు కాగా మిగతా పాత అప్పుల కిస్తీలు, పరిపాలనా ఖర్చులు, ఇతర కార్యక్రమాలకే కేటాయించారు. గత జనవరి ఒకటి నుంచి వ్యవసాయ బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కారణంగా డిమాండు ఇప్పటికే గరిష్ఠంగా 10,200 మెగావాట్లు దాటింది. వచ్చే ఏడాది వినియోగం మరింత పెరిగితే సరఫరా కోసం బయటి మార్కెట్‌లో అధికంగా కొనుగోలు తప్పదు. కొత్తగా కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్కేంద్రంలో అదనంగా ఉత్పత్తి ప్రారంభం కానుంది. భద్రాద్రి విద్యుత్కేంద్రం కూడా వచ్చే ఏడాదిలో పూర్తయితే మరో 1080 మెగావాట్ల ఉత్పత్తి అదనంగా వస్తుందని ప్రభుత్వ అంచనా. దీనివల్ల మార్కెట్‌లో అధికంగా విద్యుత్ కొనుగోళ్లు తప్పవని, ఆదాయ, వ్యయాల మధ్య అంతరం రూ.9700 కోట్లు ఉంటుందని.. ఇటీవల డిస్కంలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి నివేదించాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.5650 కోట్లే కేటాయించింది. వీటిలో వ్యవసాయ బోర్లకిచ్చే కరెంటు రాయితీ కింద రూ.4923 కోట్లు ఇచ్చారు. ఇవి మొత్తం ఇచ్చినా ఇంకా రూ.4050 కోట్ల లోటు కొనసాగుతోంది. స్పిన్నింగ్ మిల్లులకు కరెంటు ఛార్జీల్లో రాయితీ ఇవ్వడానికి ఈ ఏడాది రూ.104.58 కోట్లు ఇస్తే వచ్చే ఏడాదికి రూ.35 కోట్లే కేటాయించారు. ఇందులో సౌరవిద్యుత్‌కిచ్చేది రూ.4 కోట్లే. పవన, సౌర విద్యుత్ వంటి సంప్రదాయేతర ఇంధన వనరులను అభివృద్ధి చేసే 'రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ'(టీఎస్ఆర్ఈడీసీ) జీతభత్యాలకు రూ.8.77 కోట్లు కేటాయించారు. కానీ ఈ సంస్థ చేపట్టే సంప్రదాయేతర ఇంధన అభివృద్ధి కార్యక్రమానికి వచ్చే ఏడాది కేవలం రూ.6 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే జీతభత్యాలకన్నా అభివృద్ధి కార్యక్రమాలకు తక్కువగా ఇవ్వడం గమనార్హం. గతంలో విద్యుత్ బాండ్ల పేరుతో తీసుకున్న అప్పులను తిరిగి తీర్చేందుకు కిస్తీల కింద చెల్లించడానికి రూ.598.24 కోట్లు ఇచ్చారు.

ఉచిత విద్యుత్ ఖర్చే ఎక్కువ!

విద్యుత్ రంగాన్ని పరిపుష్టం చేయడానికి తెలంగాణ సర్కారు పలు చర్యలు తీసుకుంటోంది. ఈ రంగానికి కేటాయిస్తున్న నిధుల్ని పూర్తిగా విడుదల చేస్తోంది. కేటాయింపుల్లో అధికభాగం ఉచిత విద్యుత్తుకే వెచ్చించాల్సి వస్తోంది.

- జనవరి ఒకటి నుంచి సేద్యానికి 24 గంటల కరెంటు ఇస్తున్నారు.
- మౌలిక సదుపాయాల పనులకు అవసరమైన నిధులు అప్పులుగా తెస్తున్నారు.

స్థాపక సామర్థ్యం - కొనుగోలు

రాష్ట్రం ఏర్పడే నాటికి విద్యుదుత్పత్తి స్థాపక సామర్థ్యం	5295 మెగావాట్లు
ప్రస్తుతం	11,689 మెగావాట్లు
కొనుగోలు చేస్తున్న విద్యుత్	15,344 మెగావాట్లు

- రూ.38 వేల కోట్లతో విద్యుత్ కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది.
- సింగరేణిలో 1200 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి మొదలైంది.

విద్యుత్ వినియోగం

- రాష్ట్రం ఏర్పడినపుడు- రోజుకు 6 వేల మెగావాట్లు
- ఇప్పుడు 10 వేలకుపైగా మెగావాట్లు
- అందుబాటులోకి వచ్చిన సౌర విద్యుత్తు 3283 మెగావాట్లు

వినియోగానికి తగినట్లుగా ఉత్పత్తి జరగడం లేదు. దీంతో ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్లతో పాటు బయటి మార్కెట్లోనూ కరెంటు కొంటున్నారు. ఈ కొనుగోళ్ల వల్లే వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 9700 కోట్ల లోటు ఉంటుందని అంచనా.

రానున్నవి..

- దామరచర్ల వద్ద ఒకేసారి 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం
- కొత్తగూడెంలో 800 మె.వా. విద్యుత్కేంద్రం
- మణుగూరులో 1080 మెగావాట్ల కేంద్రం

విద్యుత్ శాఖకు కేటాయింపుల తీరు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2015-16	3800	3800
2016-17	4584	15266
2017-18	4203	4203

రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లు	విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)
1,38,00,000	46,709 (అంచనా) (2017-18లో)

బీసీ.. ప్రత్యేక నిధి ఏదీ?

ఈనాడు, హైదరాబాద్: బీసీల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి నిధి, ప్రత్యేక సహాయం అంటూ ప్రకటించిన ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ఊసెత్తలేదు. ప్రత్యేక కేటాయింపులు చేస్తామని హామీలిచ్చిన మంత్రుల కమిటీలు.. చివరికి ఏమీ తేల్చలేదు. బీసీల బడ్జెట్ రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు ఉంటుందని భావించినా.. చివరికి రూ.5,920 కోట్లకే పరిమితమైంది.

- తెలంగాణలోని 37 సంచార జాతుల కులాల కోసం ప్రత్యేకంగా సమాఖ్యను ప్రకటించింది. సంచార జాతులను ఎంబీసీల జాబితాలో చేర్చాలని భావించినా.. ఆ ప్రక్రియ పూర్తయ్యే నాటికి వారికి సహాయం అందించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది.
- బీసీల స్వయం ఉపాధి రుణాలకు 2017-18లో నిధులివ్వని సర్కారు ఈసారి రూ.150 కోట్లు కేటాయించడం గమనార్హం. మిగతా బీసీ సమాఖ్యలకూ నిధులు మంజూరు చేసింది. సమాఖ్యలకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఇచ్చింది. తెలంగాణ నాయీబ్రాహ్మణ సమాఖ్యకు 2018-19 ఏడాదికీ రూ.250 కోట్లు, రజక సమాఖ్యకు రూ.200 కోట్లు ప్రతిపాదించింది.
- బడ్జెట్‌లో గొల్లకురుమల భవనానికి రూ.5 కోట్లు, బసవేశ్వర భవనానికి రూ.5 కోట్లు, గిరిజన శాఖ తమ బడ్జెట్‌లో గిరిజన భవనాలకు రూ.51.25 కోట్లు, మైనార్టీ సంక్షేమ శాఖ సిక్కు భవనానికి రూ.7 కోట్లు, క్రైస్తవ భవనానికి రూ.30 కోట్లు కేటాయించింది.
- బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాల అభివృద్ధి పథకాలు అమలు చేసేందుకు గత ఏడాది బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు ప్రకటించిన ప్రభుత్వం ప్రత్యేకంగా ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ నిధులెలా ఖర్చు చేయాలన్న విషయమై కార్యాచరణ లేకుండా పోయింది. దీంతో కేటాయించిన రూ.1000 కోట్ల నిధుల్లో రూ.100 కోట్లే ఖర్చయినట్లు తేలింది. 2018-19 ఏడాదికి బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు పేర్కొన్నా.. అవి ఖర్చు చేయాలంటే ఎంబీసీలపై స్పష్టతతో పాటు కార్యాచరణ అవసరం.
- మహిళా, శిశు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖకు చెందిన కొన్ని పథకాల నిధుల్లో కోత పడింది. ఆరోగ్య లక్ష్మి పథకం నిధుల్లో ఏకంగా రూ.97 కోట్లకు కోతపడింది. 2018-19లో ఈ పద్దు కింద రూ.153.79 కోట్లు మాత్రమే ఇచ్చారు. తెలంగాణ మహిళా సహకార సంస్థలకు ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు పెంచింది. సహకార రుణాలకు గానూ రూ.70 కోట్లు ఇచ్చింది.



బడ్జెట్ ప్రసంగం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి నమస్కరిస్తున్న ఈటల రాజేందర్

చిట్టా పద్దులు

రాష్ట్రంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు	7,05,478 (7%)
బ్యాంకు ఖాతాలున్న కుటుంబాలు	71,15,229 (70%)
పోస్టు ఆఫీసు ఖాతాలున్న కుటుంబాలు	12,56,300 (12%)
స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వమున్న కుటుంబాలు	35,30,927 (35%)

పింఛన్లు

మొత్తం ఫించన్‌దారులు	3,17,485
రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు	1,84,565
కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులు	77,894
పీఎస్‌యూల పింఛన్‌దారులు	55,024

ఉద్యోగులు

మొత్తం	15,55,009
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు	3,15,534
కేంద్ర ప్రభుత్వం	1,49,865
పీఎస్‌యూల ఉద్యోగులు	1,19,193
ప్రైవేటు ఉద్యోగులు	7,79,738

చరాస్తులు ఉన్న కుటుంబాలు

ద్విచక్ర వాహనాలు	22,78,182
త్రిచక్ర	1,16,792
నాలుగు చక్రాల	3,00,184
ట్రాక్టర్లు మొ..	89,469
ఏసీలున్న కుటుంబాలు	70,755

భూములు

భూములున్న కుటుంబాలు	32,65,508
భూముల్లేని కుటుంబాలు	69,19,506
ఎకరం కన్నా తక్కువ భూమి ఉన్న కుటుంబాలు	9,67,418
1-2 ఎకరాల మధ్యనున్న వారు	6,83,244
2-3 ఎకరాల మధ్య	5,73,895
3-4 ఎకరాల మధ్య	3,62,222
4-5 ఎకరాల మధ్య	3,00,991
5 ఎకరాల పైన	6,84,014

(2014 సమగ్ర కుటుంబ సర్వే)

ఏమన్నారంటే

సీపీఎం 'బడ్జెట్ కేవలం ఎన్నికల కోసమే రూపొందించినట్లు ఉంది. గతంతో పోలిస్తే రూ.34వేల కోట్లు అదనంగా పెరిగినా అది నిరుపయోగమే. గతేడాది బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన దాంట్లో సగం ఖర్చు కూడా చేయలేదు. గిరిజన అటవీహక్కుల చట్టాన్ని అటకెక్కించిన ప్రభుత్వం ఆదివాసీలు, గిరిజనులను అడవి నుంచి తరిమేసేందుకు ప్రయత్నిస్తున్నార'ని ఎమ్మెల్యే సున్నం రాజయ్య విమర్శించారు. రాష్ట్రాన్ని రూ.1.51 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు.

సీపీఐ బడ్జెట్‌లో కేటాయింపులను భారీగా చూపి, నామమాత్రంగా నిధులు విడుదల చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి అలవాటుగా మారింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన ప్రభుత్వం మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు.

ఉపాధ్యాయ సంఘాలు బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను ఎలా బలోపేతం చేస్తారని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు చేస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వం బడ్జెట్‌లో కేజీ ప్రస్తావనే లేదని యూటీఎఫ్ విమర్శించింది. గతేడాది కంటే 3% తగ్గించడం దారుణమని ఎస్టీయూటీఎస్ అభిప్రాయబడింది. ఉమ్మడి రాష్ట్రంలో 13% విద్యకు కేటాయించగా ఇప్పుడు 10% దాటలేదని పీఆర్‌టీయూ టీఎస్ పేర్కొంది. భారీ బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.10,830 కోట్లు కేటాయించడం సరికాదని టీఆర్‌టీఎఫ్ విమర్శించింది. సర్కారు బడులు ఆదరణ కోల్పోయే ప్రమాదముందని టీపీటీఎఫ్, టీటీఎఫ్, ఏఐఎస్ఎఫ్‌లు ఆందోళన వ్యక్తం చేశాయి.